ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 161 పేజీలు: 8+4 వెల: 6.50

కరూర్ బాధిత కుటుంబాలకు ఉద్యోగాలిచ్చిన తమిళ సిఎం

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: ఇజ్రాయెల్

5లో



శుక్రవారం ఆక్లాండ్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలికిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

## ఆక్లాండ్‌లో ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

### ప్రొటోకాల్ పక్కనపెట్టి మోడీకి స్వాగతం పలికిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

**ఆక్లాండ్,జులై 10:** మూడు దేశాల విదేశీ పర్యటనలో భాగంగా చివరి దశలో న్యూజిలాండ్‌కు చేరిన ప్రధాని నరేంద్రమోడీకి న్యూజిలాండ్ ప్రధాని ఘనంగా స్వాగతంపలికారు. శుక్రవారం ఆయన ఆక్లాండ్‌నగరంలో అడుగు పెట్టారు. ఒక భారత ప్రధాని న్యూజిలాండ్లో పర్యటించడం ఇదే తొలిసారి కావడంవిశేషం. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ >>2

## కట్టుకథల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

### పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించిన మంత్రి మండలి

### తప్పుడు ప్రచారాల బాధ్యులపై కేసులు కఠినతరం: సిఎం చంద్రబాబు

### అమరావతిలో రెండోవిడత భూములిచ్చే రైతులకు సాగు రుణమాఫీకి ఆమోదం

### ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలకు భూకేటాయింపు

### కేబినెట్ భేటీలో 30పైగా అంశాలకు ఆమోదం

**విజయవాడ,జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లోను, కొన్ని మీడియా ప్రసారాల్లో వస్తున్న ఫేక్ వార్తలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కులపరమైన అంశాలు, తప్పుడు వార్తలను కొందరు ఉద్దేశపూర్వకంగానే వేగంగా వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు.భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం వెంటనే టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు రూ.9,355 కోట్ల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 2,943 తాగునీటి పథకాలు రూ.1,811 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు.సమావేశంలో సోషల్ మీడియా అంశంపై ఏపీ కేబినెట్‌లో సీరియస్‌గా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాపై డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను అడ్డం పెట్టుకుని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతపురంలో తోపుదుర్తి దాడులకు కుట్రలు పన్ని రెచ్చగొట్టే ట్రాప్ వేశాడని మంత్రులు చర్చించారు. ఫేక్ వార్తల నియంత్రణకు హోం, న్యాయ శాఖలు కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించినట్లు నాదెండ్ల మనోహర్ తెలిపారు. వాట్సాప్ యూజర్ నేమ్ వస్తే ఈ సమస్యలు మరింత పెరుగుతాయని డీజీపీ అభిప్రాయ పడ్డారు. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారానికి ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై నిరంతరం నోటి విరోచనాలు చేసుకునే ఇటువంటి మానసిక రోగులకు చట్టం పవర్ చూపించాల్సిందేనని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. సోషల్ మీడియా నేరగాళ్లపై నమోదవుతున్న కేసులను కోర్టుల్లో బలంగా వాదించడానికి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చేయడానికి అవసరమైతే ప్రత్యేకంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సైబర్ క్రైమ్ చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తూ, ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారణ జరిపించేలా న్యాయపరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలని ఐటీ, హోంశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చ జరిగింది. పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో కాన్సర్ట్‌ల నిర్వహణ, కాన్సర్ట్‌లకు ప్రత్యేక విధానం ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదేవిధంగా రూ.50కోట్లతో పర్యాటక ప్రచారానికి ఆమోదం >>2



శుక్రవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం దృశ్యం

## కాల్పుల విరమణ ముగిసిందని చెప్పేశా

### ఇరాన్‌తో చర్చలకు అభ్యంతరంలేదు: ట్రంప్

**వాషింగ్టన్,జులై 10:** ఇరాన్ మళ్లీ చర్చలు కొనసాగించాలని అమెరికాను సంప్రదించిందని, అందుకు అమెరికా అంగీకరించినప్పటికీ ఇరు దేశాల మధ్య అమల్లో ఉన్న కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) ఇక ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు ట్రంప్ పోస్టు చేశారు."ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మాతో చర్చలు కొనసాగించాలని కోరింది. అందుకు మేము అంగీకరించాం. అయితే కాల్పుల విరమణ ఇక ముగిసిందని వారికి స్పష్టంగా తెలియజేశామని ట్రంప్ పేర్కొన్నారు. పోస్టు చివరలో ఈ విషయంపై మీ దృష్టికి ధన్యవాదాలు అంటూ తన సంతకం కూడా జత చేశారు. అమెరికా దౌత్యపరమైన చర్చలకు తలుపులు తెరిచి ఉంచినప్పటికీ, ప్రస్తుతం ఇరాన్‌తో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో లేదని ట్రంప్ స్పష్టం చేశారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య జూన్ నెలలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా తాత్కాలిక కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం 60 రోజుల పాటు శత్రుత్వ చర్యలను నిలిపివేసి, ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షల సడలింపు, హార్ముజ్ >>2



## భారీగా కొరియా పెట్టుబడులు





సియోల్‌లో సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ఎపి మంత్రి లోకేష్

### శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే లక్ష్యం

### ఎపి పట్ల విశ్వాసానికి కియా మోటార్స్ పెట్టుబడి నిదర్శనం

### సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్, కొరియా రోడ్‌షోలో మంత్రి లోకేష్ పిలుపు

**విజయవాడ,జులై10, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ, కొరియా భాగస్వామ్యంలో మరో అధ్యాయాన్ని లిఖించబోతున్నాం. పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యమని ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. కొరియాతో ఆంధ్రప్రదేశ్ ది విజయవంతమైన భాగస్వామ్యం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలని విద్య, పిలుపునిచ్చారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్ లో 31వ సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) పార్ట్ నర్ షిప్ సమ్మిట్ సౌత్ కొరియా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన రోడ్ షో లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సియోల్‌లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ మీ మధ్య ఉండటం ఎంతో గౌరవంగా ఉంది. అంతకంటే ముఖ్యంగా, ఇప్పటికే వేలాది మంది జీవితాలను మార్చిన, భవిష్యత్తులో ఆసియాలో అత్యంత కీలకమైన ఆర్థిక భాగస్వామ్యాల్లో ఒకటిగా నిలిచే సామర్థం ఉన్న ఈ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు. పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యం అన్నారు.ఏపీలో 2024లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నా లక్ష్యం ప్రపంచాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసు కురావడం అన్నారు., ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి పరిచయం >>2

## ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువులు

### బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం

### మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జులై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతోపాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలవారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని, ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిన్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో >>2







## ఎన్ఐఎ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

### హైకోర్టులో 'రిజిస్ట్రార్' పోస్టుకు గ్రీన్ సిగ్నల్: మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ, జులై 10,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన విషయాన్ని మంత్రి ఫరూక్ వెల్లడించారు.జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం, 2008 కింద నమోదయ్యే కేసులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులను ఏర్పాటు చేయాలని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశించినట్లు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం రెండు నోటిఫై చేసిన కోర్టులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.కాగా రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 20 ఎన్ఐఏ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 19 కేసులు విశాఖపట్నంలోని 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో, విజయవాడలోని 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉందన్నారు.విశాఖలో ఎన్ఐఏ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం అవసరమని హైకోర్టు అభిప్రాయ పడిందన్నారు. విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం, ఆ కోర్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా నిర్ణయించడం, అలాగే దీనిని నిర్వహించడానికి ఒక స్పెషల్ జడ్జితో సహా మొత్తం 16 మంది సిబ్బందిని కేటాయించాలని చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం >>2

## మరో 100 ఎంబిబిఎస్ సీట్లు

### ఎన్ఎంసి గ్రీన్ సిగ్నల్

### రాష్ట్రంలో వైద్య విస్తరణకు కీలకముందడుగు



**విజయవాడ,జూలై 10.ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్య విస్తరణకు మరో కీలక ముందడుగు పడింది. 202627 విద్యా సంవత్సరానికిఅదనంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో 75, నెల్లూరులోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 25 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్ఓపీ) మంజూరు చేసింది. దీంతో రాష్ట్రానికి మొత్తం 100 అదనపు ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంసీ తాజా అనుమతితో కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 175 నుంచి 250కు పెరిగింది. నెల్లూరులోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్ల సంఖ్య 175నుంచి 200కు చేరుకుంది. ఈ పెంపుతో రాష్ట్రంలో >>2

## జనాభా దామాషాలో బిసి రిజర్వేషన్లు



మహాధర్నా నిర్వహిస్తున్న బిసి నేతలు

### సమగ్ర కులగణన చేపట్టాలి

### రిజర్వేషన్లపై విధించిన 50శాతం పరిమితిని తొలగించాలి

### బిసి రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి: మహాధర్నాలో బిసి నేతలు


**విజయవాడ, జులై 10, ప్రభాతవార్త :** సమగ్ర కులగణన చేసి జనాభా దామాషాలో బీసీ రిజర్వేషన్లు పెంచాలి , రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితి ఎత్తివేయాలి. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలి, కులగణన చేపట్టిన తర్వాతే ఏపీలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి, విద్యా ఉద్యోగాల వలె బిసి రాజకీయ రిజర్వేషన్లలో ఏబిసిడి లుగా వర్గీకరించాలి. బీసీల న్యాయమైన డిమాండ్ పరిష్కరించకపోతే ఆగస్టులో ఢిల్లీని ముట్టడిస్తాం అని బీసీ మహాధర్నా లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్ >>2

## కడపలో మరో కరోనా కేసు

### పాజిటివ్ నిర్ధారణ వ్యక్తిని పరామర్శించిన కమిషనర్, ఎంహెచ్ఓ



**కడప కార్పొరేషన్, జులై 10 ప్రభాతవార్త:** కరోనా కేసులు (కోవిడ్ 19) నమోదు కలకలం రేపుతోంది. కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. కడప నగర పరిధిలోని మాసాపేట ప్రాంతంలో కరోనా వైరస్‌కు సంబంధించి పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ డా. పి. భవాని ప్రసాద్, ప్రజా వైద్య అధికారి డాక్టర్ సౌదాగిరి రమేష్ లు శుక్రవారం కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తిని స్వయంగా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అలాగే వైద్య శాఖ అధికారులు, సిబ్బందికి >>2



శుక్రవారం మెల్‌బోర్న్‌లోని క్రికెట్‌గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనితో ప్రధాని మోడీ

# ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

>> లక్సన్ స్వయంగా విమానాశ్రయానికి విచ్చేసి, ప్రధాని మోడీని ఆలింగనం చేసుకుని అత్యంత ఆత్మీయంగా, ఘనంగా స్వాగతం పలికారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనల అనంతరం ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా వన్ ప్రత్యేక విమానం ఆక్లాండ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. విమానం దిగి వచ్చిన ప్రధాని మోడీకి న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ ఘనంగా స్వాగతం పలికారు. ఇద్దరు ప్రపంచ దేశాల నేతలు ఎంతో ఆత్మీయంగా కరచాలనం చేసుకుని, ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. గడచిన నాలుగు దశాబ్దాలకు పైగా కాలంలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో జరుపుతున్న తొలి అధికారిక పర్యటన ఇదే కావడం విశేషం. ప్రధాని లక్సన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు నరేంద్ర మోడీ ఇక్కడ రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. గతేడాది 2025 మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారతదేశంలో అధికారిక పర్యటన జరిపిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన ఇరు దేశాల బంధానికి కొత్త ఊపునివ్వగా, భారత్‌న్యూజిలాండ్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా కుదిరింది. ఆ ఒప్పందం జరిగిన కొన్ని నెలలకే ప్రధాని మోడీ ఈ పర్యటనకు రావడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సంబంధాల పూర్తి పరిధిని కవర్ చేస్తూ విస్తృతమైన చర్చలు జరుపుతారు. ముఖ్యంగా ఆర్థిక, వాణిజ్య, వ్యాపార సహకారాన్ని మరింత ఉన్నత స్థాయికి విస్తరించడంపై ఈ సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గత రెండేళ్లుగా భారత్, న్యూజిలాండ్ మధ్య వాణిజ్యం, వ్యాపారం, రక్షణ రంగాలలో సాధించిన గణనీయమైన పురోగతిని, తదుపరి కార్యాచరణను ఈ సందర్భంగా ఇద్దరు నేతలు సమీక్షిస్తారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధాని మోడీ చేపట్టిన ఆరు రోజుల విదేశీ పర్యటన ఈ న్యూజిలాండ్ పర్యటనతో ముగియనుంది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను పురస్కరించుకుని ఆక్లాండ్ నగరం సరికొత్తగా ముస్తాబైంది. ఇరు దేశాల స్నేహానికి ప్రతీకగా ఆక్లాండ్లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'స్కై టవర్ ను శుక్రవారం రాత్రి భారత త్రివర్ణ పతాక వర్ణాల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ, ప్రధాని మోడీకి ఆక్లాండ్లో అపూర్వ స్వాగతం లభించిందని పేర్కొన్నారు. ప్రధాని లక్సన్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి విమానాశ్రయంలో స్వాగతం పలకడం, స్కై టవర్ను త్రివర్ణ శోభితం చేయడం ఇరు దేశాల మధ్య ఉన్న దృఢమైన బంధానికి నిదర్శనమని, ఈ పర్యటన పలు రంగాలలో సహకారానికి కొత్త మార్గాలను తెరుస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# కాల్పుల విరమణ ముగిసిందని చెప్పేశా

>> జలసంధిలో సముద్ర భద్రత వంటి కీలక అంశాలపై చర్చలు జరపాలని నిర్ణయించారు. అయితే ఖతార్‌లో జరిగిన పరోక్ష చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. అనంతరం ఇరు దేశాలు పరస్పరం సైనిక దాడులకు దిగడంతో మరోసారి ఉద్రిక్తతలు పెరిగి, యుద్ధ భయం నెలకొంది. ఇంతకుముందు నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, టెహ్రాన్‌తో చర్చలు సమయ వృథాగా మారాయని వ్యాఖ్యానించారు. ఇరాన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, వారితో వ్యవహరించాలనే ఆసక్తి తనకు లేదన్నారు. అమెరికా చర్చల బృందం దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు స్వేచ్ఛగా ఉందని తెలిపారు. టర్కీలో జరిగిన నాటో సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ఇప్పటికీ అమల్లో ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ, అది ఆసక్తికరమైన ప్రశ్న. నా అభిప్రాయం ప్రకారం అది ముగిసిపోయింది. వారితో నేను వ్యవహరించాలనుకోవడం లేదని అన్నారు. తదుపరి మాట్లాడుతూ, ఇరాన్‌తో మరో ఒప్పందం కుదిరినా అది కొనసాగుతుందనే నమ్మకం నాకు లేదు. వారు విశ్వసనీయత లేని వ్యక్తులుగా కనిపించారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వివాదం పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశాలు తక్కువేనని, ఏదైనా జరిగినా చాలా త్వరగా ముగుస్తుందని, దాంతో చమురు సరఫరా సహా భద్రత మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రూత్ సోషల్‌లో మరో పోస్టులో ట్రంప్, తాజా సైనిక చర్య వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు ప్రతీకార చర్య అని పేర్కొన్నారు. "నిన్న ఇరాన్ వాణిజ్య నౌకలపై జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ చర్య చేపట్టాం. మళ్లీ ఇలాంటి ఘటనలు జరిగితే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుంది" అని ఆయన హెచ్చరించారు.

# కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు గౌరవం

## జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మతాల మధ్య చిచ్చుపెట్టి, అలజడులు సృష్టించేందుకు వైసీపీ తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతోందని జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ ఆడుతున్న ఈ ప్రమాదకరమైన రాజకీయ క్రీడను ప్రజలంతా గమనించాలని కోరారు. రాష్ట్రంలో సనాతన ధర్మం, హిందుత్వంపై కావాలనే కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విజయ్ మండిపడ్డారు. ఏలూరు సభలో జడ శ్రవణ్ అనే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం వెనుక తాడేపల్లి పెద్దల హస్తం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. మత ఘర్షణలకు ప్లాన్ చేస్తున్న ఈ ముఠాకు, తాడేపల్లికి ఉన్న ఆర్థిక, రాజకీయ సంబంధాల గుట్టును పోలీసులు పూర్తిగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా తానే రూ. 25 కోట్లు ఖర్చు పెట్టానని చెప్పుకుంటున్న జడ శ్రవణ్‌కు అసలు అన్ని కోట్ల డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రశాంతంగా ఉన్న సమాజంలో విషం చిమ్మేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. యూట్యూబర్ రావణ్, నటుడు ప్రకాశ్ రాజ్, అలాగే జడ శ్రవణ్‌లకు అసలు సనాతన ధర్మం అంటే ఏంటో తెలుసా? అని ప్రశ్నించారు. వీరంతా కేవలం ఒక అజెండా ప్రకారం పనిచేస్తున్న ఖిపెయిడ్ ఆర్టిస్టులుఖి అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలకు, మతాలకు సమాన గౌరవం లభిస్తుందని స్పష్టం చేసిన ఆయన... హిందుత్వంపై, సనాతన ధర్మంపై ఇలాంటి కుటిల యత్నాలు కొనసాగిస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ఇథనాల్ వినియోగంతో ఇంధన సామర్థ్యం తగ్గుదల: అంగీకరించిన కేంద్రం

**న్యూఢిల్లీ,జూలై 10:** ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఇ20) వాడకం వల్ల వాహనాలు పాడైపోతున్నాయన్న ఆందోళనలు ఓవైపు చెలరేగుతుండగా.. కేంద్రం మాత్రం దాన్ని సమర్థించుకుంటూ రోజూ ప్రకటనలు విడుదల చేస్తోంది. వాహనాల్లో ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను మాత్రం అంగీకరించింది. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ కొన్ని వాహనాల్లో ఇంధన సామర్థ్యాన్ని 35 శాతం వరకు తగ్గించగలదని చమురు మంత్రిత్వ శాఖ ఇవాళ స్పష్టత ఇచ్చింది. ఈ ప్రభావం కంటే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీనాక్ లక్షణాలు, వేగవంతమైన దహనం, మెరుగైన పికప్, సున్నితమైన త్వరణం, శుభ్రమైన ఇంజిన్ పనితీరు ,తక్కువ జీవితకాల కార్బన్ ఉద్గారాలు వంటి ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని కేంద్ర వాదిస్తోంది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమంపై వస్తున్న విమర్శలను ఎదుర్కోవడానికి జారీ చేసిన ఒక వివరణాత్మక పత్రంలో పెట్రోలియం ,సహజ వాయువుల మంత్రిత్వ శాఖ, ఇ10 లేదా స్వచ్ఛమైన పెట్రోల్ కంటే ఇ20 ఒక శుభ్రమైన, అధికనాణ్యత గల, మరింత సమర్థవంతమైన ఇంధనమని పేర్కొంది. అలాగే సంవత్సరాల తరబడి శాస్త్రీయ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు ,దేశీయ ఇథనాల్ ఉత్పత్తి విస్తరణ తర్వాత మాత్రమే దీనిని ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని చాలా తొందరగా అమలు చేశారన్న ఆందోళనలను మాత్రం చమురు శాఖ తోసిపుచ్చింది. భారతదేశపు ఇథనాల్ మిశ్రమం కార్యక్రమం 2001లో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టుల నుండి మొదలైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం మిశ్రమాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేసింది.

# బలపడుతున్న సూపర్ ఎల్ నినో

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** ప్రస్తుత సీజనులో వర్షాలు ముమ్మరంగా కురవాల్సిన సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎండలు చోటు చేసుకుంటున్నాయి. రెండ్రోజులుగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఎండలు మళ్లీ దంచికొడుతున్నాయి. రాష్ట్రంలో గడచిన 24 గంటల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. సూర్యాపేట జిల్లా చేవెళ్లలో అత్యధికంగా 38.2 డిగ్రీ సెల్సియస్ ల ఉష్ణోగ్రత నమోదైంది. అంతేకాకుండా సుమారు 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీ సెల్సియస్ వరకు నమోదయ్యాయి. ఇక ఈ నెల 11నుంచి 15 మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నాయి. ముఖ్యంగా 12 నుంచి 15 వరకు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. తూర్పు తెలంగాణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 37 నుండి 40 డిగ్రీ సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరంలో సైతం ఉష్ణోగ్రతలు 35 నుండి 37 డిగ్రీ సెల్సియస్ వరకు చేరి, జనాలను ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా అక్కడక్కడా స్థానికంగా మేఘాలు పట్టి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, జూలై నెల సగటు వర్షపాతంతో పోలిస్తే చాలా తక్కువ శాతమేనని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

# కట్టుకథల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

>> తెలిపిన కేబినెట్, నెల్లూరులో ఐటీసీ హోటల్, కడపలో మాధవి హోటల్‌కు, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు, కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు నిర్ణయించింది. విశాఖ, గుంటూరు, నెల్లూరులో అంబేడ్కర్ గురుకుల సీవోఈల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐఐటీ జేఈఈ, నీట్‌కు రెసిడెన్షియల్ కోచింగ్ ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణకు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్‌కు ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ సిఫార్సులతో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించిన సంస్థలకు భూకేటాయింపులకు అనుమతులు ఇచ్చింది. మంత్రి మండలిలో అన్ని అంశాలపై కీలకంగానే చర్చించారు. అమరావతిలో రెండో విడతకు భూములిచ్చే రైతులకు సాగు రుణమాఫీకి ఆమోదం మంత్రి ఆమోదం తెలిపింది, భూమి సమీకరించే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు రుణమాఫీకి ఆమోదం తెలిపింది, 2026 జనవరి 6 కంటే ముందు తీసుకున్న రుణాలకు మాఫీ వర్తింపు చేసింది, భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు వార్షిక కౌలు పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది, మెట్ట రైతులకు రూ.40 వేలకు, జరీబు రైతులకు రూ.60 వేలకు కౌలు పెంపునకు ఆమోదం, మెట్ట రైతులకు ఏటా రూ.3 వేలు, జరీబు రైతులకు రూ.5 వేల చొప్పున కౌలు పెంపు, రెండో విడత భూసమీకరణ గ్రామాల్లోని ఇనాం భూములకు పరిహారానికి ఆమోదం కేబినేట్ ఆమోదించింది. 307 ఎకరాల ఇనాం భూములకు దేవదాయశాఖకు రూ.159 కోట్ల పరిహారం ఎన్ఎఫ్‌డీబీకి భారీ అక్వేరియం, కార్యాలయం కోసం భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది .ఇటీవల 19వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని వలర .రూ.9,076 కోట్ల పెట్టుబడులుతో 10,531 ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయి,

**తప్పుడు ప్రచారాలను తీవ్ర స్థాయిలో తిప్పి కొట్టండి:** అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే విపక్షాలు పలు ఎత్తుగడలు వేస్తున్నాయని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇందులో భాగంగానే పలు అంశాల్లో ప్రజలను పక్కదోవ పట్టించే దిశలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు., మంత్రి మండలి సమావేశం అనంతరం ఆయన మంత్రులతో మాట్లాడుతూ ప్రతి పథకంపైన పనిగట్టుకుని విష ప్రచారం చేస్తున్నారు. ఈ తంతంతా కూటమి నేతలను రెచ్చగొట్టే ఉద్దేశంతో చేస్తున్నారు. వైఎస్సార్సీపీ వాళ్లు ఎంత రెచ్చగొట్టినా మనవాళ్లు రెచ్చిపోవద్దని, సంయమనం పాటించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా అనంతపురం తదితర చోట్ల జరిగిన కొన్ని ఘటనలను ఆయన ప్రస్తావించారు. జిల్లాల్లోని ప్రతి అంశంపైనా, ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపైనా ఇన్‌ఛార్జ్ మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి దృష్టి మరల్చేందుకు కొత్తగా కావాలని ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్నారని, వైసీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సూచించారు. వైసీపీ ట్రాప్‌లోకి లాగేందుకు చూస్తోందని జాగ్రత్తగా ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లిన సమయంలో ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇన్‌ఛార్జి మంత్రులు.. రెవెన్యూ, ఇతర సమస్యలపై కూడా ఫోకస్ పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను వెంటనే కేబినెట్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

# భారీగా కొరియా పెట్టుబడులు

>>చేయడం అన్నారు.,గత రెండేళ్లలో దావోస్, సింగపూర్, జపాన్, రష్యా, మధ్యప్రాచ్యం, యూరప్, ఇప్పుడు కొరియా వంటి అనేక దేశాల్లో పర్యటించాం. మా లక్ష ్యం కేవలం ఎంవోయూలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు. శాశ్వతంగా నిలిచే భాగస్వామ్యాలను నిర్మించడం మా లక్ష్యం. ఈ పర్యటనలో నా కొరియా మిత్రుల్లో ఒకరు నాకు ఇచ్చిన ప్రశంసను ఎంతో విలువైనదిగా భావిస్తున్నా. ఆయన నన్ను పల్లి పల్లి మంత్రి అని పిలిచారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి అంటే 'త్వరగా... త్వరగా(వేగవంతమైన) అని అర్థం. అదే విధంగా మా ప్రభుత్వం కూడా పనిచేయాలని మేం కోరుకుంటున్నామని పేర్కొన్నారు. 2016లో కియా మోటార్స్ ఏపీలో పెట్టుబడి పెట్టాలనే ధైర్యవంతమైన నిర్ణయంతో మా ప్రయాణం ప్రారంభమైంది. కియా మోటార్స్ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం కేవలం ఒక పెట్టుబడి మాత్రమే కాదు. అది మాపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. అతి తక్కువ కాలంలోనే అనంతపురంలోని కియా ప్లాంట్ ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థకు అత్యుత్తమ ఉత్పాదకత కలిగిన తయారీ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామం మరింత ముఖ్యమైంది. కియా ఒంటరిగా రాలేదు. కియాతో పాటు మొత్తం ఎకో సిస్టమ్ ను తీసుకువచ్చింది. ఈరోజు అనంతపురం భారతదేశంలోని అత్యంత విజయవంతమైన కొరియన్ ఆటోమొబైల్ క్లస్టర్లలో ఒకటిగా ఎదిగింది. ఇప్పుడు మేం రెండో అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతదేశంలో తన మూడో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కోసం శ్రీసిటీని ఎంపిక చేసింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ప్యాకేజింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఈవీ కాంపోనెంట్స్, ఫుట్ వేర్, ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో కూడా కొరియా కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ పర్యటన మమ్మల్ని మరింత ముందుకు తీసుకెళ్లింది. నౌకా నిర్మాణం, సెమీకండక్టర్లు, భారీ పరిశ్రమలు, సముద్ర పరికరాలు, స్టార్టప్‌ల రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ కావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కొరియా మధ్య భాగస్వామ్యం కేవలం ఒక కంపెనీ గురించి కాదు.. పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మించడమే మా లక్ష్యం అన్నారు.

**సౌత్ కొరియా మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీని తీర్చిదిద్దుతాం.** ఇటీవల భారత్ లో సౌత్ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ జరిపిన పర్యటన ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. రెండు దేశాల ప్రభుత్వాలు వచ్చే దశాబ్దానికి జాయింట్ స్ట్రాటజిక్ విజన్‌ను ఆమోదించడం జరిగింది. ఇకపై ఈ సంబంధం కేవలం వాణిజ్యానికే పరిమితం కాదు. సెమీకండక్టర్లు, ఏఐ, అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, షిప్ బిల్డింగ్, మారిటైం సెక్యూరిటీ, క్రిటికల్ మినరల్స్, క్లీన్ ఎనర్జీ, ట్రస్టెడ్ సప్లై చెయిన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీ రంగాలకు విస్తరించింది. ప్రస్తుతం భారత్‌కొరియా ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27 బిలియన్ డాలర్లకు చేరింది. 2030 నాటికి దీన్ని 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని రెండు దేశాల ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ లక్ష్యాన్ని మనం సాధించడమే కాకుండా అధిగమిస్తామని కూడా నమ్ముతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ 190 బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. ఏటా దాదాపు 21 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసే భారతదేశంలోని అగ్రగామి రాష్ట్రాల్లో ఏపీ ఒకటి అన్నారు.

**స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మా విజయ రహస్యం:** ఏపీ ప్రత్యేకతల గురించి చాలా మంది అడుగుతారు. అందుకు మూడు 'ఎస్' లు ప్రధాన కారణాలుగా చెబుతాను. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్. ప్రతి విజయవంతమైన పెట్టుబడి గమ్యస్థానం వెనుక ఒక సమర్థవంతమైన పెట్టుబడి ప్రోత్సాహక సంస్థ ఉంటుంది. మా వద్ద అది ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు, భారతదేశంలోని అత్యుత్తమ పెట్టుబడి ప్రోత్సాహక సంస్థల్లో ఇదొకటి. ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డుకి ఒక విషయం స్పష్టంగా చెప్పా. వారు కేవలం పెట్టుబడులను తీసుకురావడమే కాదు... భారతదేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. ఎంఓయూతో ఈడీబీ పని ముగిసిపోదు. అసలు పని అప్పుడే ప్రారంభమవుతుంది. పెట్టుబడిదారులకు భూమి గుర్తించడం, అనుమతుల ప్రక్రియలో మార్గనిర్దేశం చేయడం, ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సరఫరాదారుల వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమస్యలను పరిష్కరించడం, విస్తరణలో సహకరించడం వంటి ప్రతి దశలో ఈడీబీ తోడ్పడుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే. మీ మొత్తం పెట్టుబడి ప్రయాణంలో ఈడీబీ మీ భాగస్వామి అన్నారు. కొరియా ఏం సాధ్యమో చూపించింది. ఎల్జీ తదుపరి అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఇప్పుడు మరెన్నో కొరియా కంపెనీలు కూడా ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కొరియా భాగస్వామ్యంలోని మొదటి అధ్యాయం ఆటోమొబైల్ రంగం ద్వారా ఖించడం జరిగింది. రెండో అధ్యాయం ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇప్పటికే కొనసాగుతోంది. మూడో అధ్యాయాన్ని మనమందరం కలిసి సెమీకండక్టర్లు, షిప్ బిల్డింగ్, ఏఐ, క్లీన్ ఎనర్జీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో లిఖించబోతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్, కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆసియా, పసిఫిక్ వ్యవహారాల బ్యూరో డైరెక్టర్ జనరల్ శ్రీమతి లీ మిన్‌క్యోంగ్ ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డా.కిమ్ టే హ్యుంగ్ (హ్యూంగ్ కిమ్) సీఐఐ ఆంధ్రప్రదేశ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఛైర్మన్ ఎస్.నరేంద్ర కుమార్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్ లీడర్ సంగ్ హియో, సోలమ్ సీవోవో జే గ్యాబ్ హోటా కోట్రా అవుట్‌బౌండ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఎం ఏ టీమ్ డిప్యూటీ డైరెక్టర్ దే క్యున్ కిమ్, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ శుభమ్ భన్సల్ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా దామాషాలో బిసి రిజర్వేషన్లు

>> రావుల హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాలలో బీసీల వాటా బీసీలకే దక్కాలంటే దేశవ్యా ప్తంగా సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్ రావు లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్ లో బీసీ డిమాండ్లపై మహా ధర్నా చేపట్టారు ఈ ధర్నాకు ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచాలని దశాబ్దాలుగా బీసీలు పోరాడుతున్న ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు, బీసీ రిజర్వేషన్లు పెంచకపోవడం వలన బీసీలు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు తక్షణమే జోక్యం చేసుకొని ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతి జనగణనలో బిసి కులగణన చేపట్టేలా ప్రధాని నరేంద్ర మోడీతో చర్చించి ఆమోదింపచేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోట కల్పించకపోతే మహిళా బిల్లు లక్ష్యం నెరవేరదని బిసి మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లును బిసి'లు ఒప్పుకోరని వారు హెచ్చరించారు. ఏపిలో స్థానిక సంస్థల ఎన్నికలు కులగణాంకాలు చేపట్టిన తర్వాత, కూటమి ప్రభుత్వం బిసి'లకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నెరవేర్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆగస్టు మాసంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టి ఢిల్లీని కూడా ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్, కేసిన శంకర్ రావులు హెచ్చరించారు.



శుక్రవారం అమర్‌నాథ్ యాత్రకు తరలుతున్న భక్తులు

# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువులు

>> ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85 శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు. అలాగే 85,683 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64 శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అను గుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లా ల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని ఆర్.అముదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్ఎస్‌కే పరిధిలో 731 ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80 ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా, ప్రస్తుతం 90 ఎకరాల వరి, 80 ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు. ఈ ఆర్ఎస్‌కే పరిధిలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస, అప్పాపురం, ఎం.ఆర్.పేట గ్రామాలకు తొలి దఫా అవసరంగా 811 బస్తాల యూరియా అవసరమని తెలిపారు. ఇప్పటికే బొడ్డవలస, అప్పాపురం గ్రామాలకు 225 బస్తాలు పంపిణీ పూర్తయిందని, మిగిలిన గ్రామాలకు 219 బస్తాల పంపిణీని యూరియా కార్డులు, తిశితిలీ ద్వారా చేపట్టే సమయంలో రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో అదనపు డిమాండ్ ఏర్పడిందన్నారు. అదనంగా వెంటనే 444 బస్తాల యూరియాను సమీప రైతు సేవా కేంద్రం నుంచి తెప్పించి అదే రోజు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి, టోకెన్ విధానం, క్యూలైన్ ఏర్పాటు చేసి పంపిణీని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 9,987 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అందులో మార్క్‌ఫెడ్ వద్ద 4,850 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అవసరమైన ఎరువులను ప్రభుత్వం సమయానికి అందిస్తుందని భరోసా ఇచ్చారు.

# కడపలో మరో కరోనా కేసు

>> బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కరోనా వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన అన్ని నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు. కడపలోని మాసాపేటలోకు చెందిన వ్యక్తి అనారోగ్యంతో కడప రిమ్స్‌లో వైద్యం తీసుకుంటున్న సమయంలో అతనితోపాటు ఉన్న తన తనయుడు ఆరిఫ్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అతనికి కరోనా పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం హోమ్ ఐసోలేషన్లో ఆరిఫ్ ఉన్నాడు.

# ఎన్ఐఏ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

>> జరిగిందన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి చెందిన, రెగ్యులర్ ప్రాతిపదికన రిజిస్ట్రార్ ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ (క్రిమినల్)నెంబర్ 4/2021 లోని ఆదేశాలు, సుప్రీంకోర్టు కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీఖి చేసిన సిఫార్సుల మేరకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని ఖిస్టేట్ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కమిటీఖికి చెందిన న్యాయమూర్తులు రాష్ట్ర హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి సమానమైన రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్)ఖి పోస్టును సృష్టించాలని నిర్ణయించిన మేరకు ప్రభుత్వం రిజిస్ట్రార్ పోస్టు సృష్టికి ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కొత్త పోస్టు ఏర్పడటం వల్ల జిల్లా న్యాయస్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## మరో 100 ఎంబిబిఎస్ సీట్లు

>> వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, అధ్యాపక సిబ్బంది నియామకం, ఎన్ఎంసీ ప్రమా ణాలకు అనుగుణంగా చేపట్టిన చర్యల ఫలితంగానే ఈ అనుమతులు లభించాయని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణు వర్ధన్ తెలిపారు ఈ సందర్భంగా కడప, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## రాష్ట్రానికి 14 మంది కొత్త ఐపిఎస్‌లు

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తగా 14 మంది ఐపీఎస్ అధికారులను కేటాయించింది. ఇటీవల విడుదలైన యూపీఎస్సీ 2024 ఫలితాల ఆధారంగా ఈ కేటాయింపులు జరిగాయి. రాష్ట్రానికి కేటాయించిన ఐపీఎస్‌లలో చక్కా స్నేహిత్, చల్లా పవన్ కల్యాణ్, ఉర్మి సిన్హా, ముకుంద్ సింగ్, ఆశిష్ రఘువంశీ, వికాస్, రోనక్ ఆశారామ్ మీనా ఉన్నారు. వీరితో పాటు శివం సింగ్, శ్రేయస్ రావు, షా మహ్మద్ ఇమ్రాన్, నిఖిల్ యాదవ్, వీర్ రిషికేష్ నాగనాథ్, దోనేపూడి విజయ్ బాబు, పెండెం ప్రతీష్‌లను ఏపీకి కేటాయిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**ఐదుగురు అధికారులకు ఐఏఎస్ హోదా** రాష్ట్రంలో ఐదుగురు అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించారు. అధికారులు గోపీనాథ్, బాలకృష్ణ, జయకృష్ణ, పద్మావతి, వరప్రసాద్‌కు ఐఏఎస్ హోదా కల్పించారు. కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌తో సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతిలో సిఎం చంద్రబాబు పర్యటన

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యటించారు. రాజధానిలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా జడ్జీల నివాస సముదాయాలు, ఎన్జీవో భవనాల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అమరావతిలో కొత్తగా నిర్మిస్తున్న తమ సొంత నివాస భవనాన్ని సీఎం దంపతులు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

## వారం - వర్జ్యం

11-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
ద్వాదశి రా.2.03
కృత్తిక ఉ.11.01
వర్జ్యం : రా.1.19-రా.2.45
దు.తె.5.41-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సుదూర ప్రాంతాలలోని మీ ఆత్మీయుల సహాయ సహకారాలు అందుకుంటారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**వృషభం:** చర్మ సంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. పనులు సక్రమంగా పూర్తి చేస్తారు.

**మిథునం:** కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు పథకాలపై దృష్టి సారిస్తారు. వ్యవహారాలలో నిదానం.

**కర్కాటకం:** పెద్దలతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు మోయాల్సి ఉంటుంది.

**సింహం:** సంతానాన్ని సక్రమైన పంథాలో నడిపించటానికి విశేషంగా కృషి చేస్తారు. సౌందర్య చిట్కాలపట్ల ఆకర్షితులవుతారు.

**కన్య :** నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. శుభవార్తలు వింటారు.

**తుల :** సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

**వృశ్చికం:** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. వాహనసౌలభ్యం కలదు.

**ధనుస్సు:** మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పురాతన వస్తు సేకరణ చేస్తారు. వివాహ యత్నాలుచేస్తారు.

**మకరం :** మొండితనం కన్నా సర్దుకుపోవటమే మేలని అనుకుంటారు. వ్యవహారాలలో పెద్దల సలహాలు పాటించండి.

**కుంభం:** ఒత్తిడుల నుండి బయటపడతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం:** అప్పుచేయక పోవటమే నిజమైన పొదుపని గుర్తిస్తారు. పెండింగ్ కేసులు పరిష్కార బాటలో ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎపిలో కోట్రా ఇన్వెస్ట్ కొరియా ఆఫీస్ పెట్టండి

- ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యూంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ
- గృహోపకరణాల యూనిట్‌ను ఏర్పాటు చేయాలి
- కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్ఒడి చోహన్ చుల్‌కు వినతి
- శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్టు నెలకొల్పండి
- ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిఇఒ ముందు ప్రతిపాదనలు పెట్టిన మంత్రి లోకేష్
- ఎపిలో బ్యాటరీ యూనిట్‌కు డెల్టా ఎక్స్ సానుకూలం
- డెల్టా ఎక్స్ ఫౌండర్, సిఇఒ స్టీఫెన్ కిమ్‌తో మంత్రి




**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇన్వెస్ట్ కొరియా సంస్థ కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యూంగ్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. అమరావతి లేదా విశాఖపట్నంలో ఒక ప్రత్యేక కోట్రా/ ఇన్వెస్ట్ కొరియా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. మెట్రో నగరాలు మినహా దక్షిణ భారతదేశంలో ఇది మొదటి ఉప జాతీయ కోట్రా కార్యాలయం అవుతుంది. ఇది ఎపిలో అంతర్భాగంగా ఉండే కోట్రా డెస్క్ నుండి పూర్తిస్థాయి కార్యాలయంగా దశలవారీగా అభివృద్ధి చెందుతుంది. దీనికి సియోల్‌లోని కోట్రా / ఇన్వెస్ట్ కొరియాకు అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ డెస్క్ పనిచేస్తుంది. దీని ద్వారా ఎపిఇడిబి- కోట్రా నడుమ బలమైన బంధం ఏర్పాటై పరిశ్రమ దారులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పెట్టుబడిదారుల అవసరాలు, కమ్యూనిటీ అవసరాలపై నాలెడ్జ్ పార్టనర్‌గా ఉమ్మడిగా ఒక ప్రత్యేక కొరియా ఇండస్ట్రియల్ పార్క్ / కొరియా క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. ఎపిలోని శ్రీసిటీ, విశాఖపట్నం, అనంతపురం/ కియా ఎకోసిస్టమ్‌కు కొరియన్ వ్యాపార ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించండి. సిఐఐ-పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 (12-13 నవంబర్ 2026,ఎపి)లో కొరియా సంస్థలు పెద్దఎత్తున హాజరయ్యేలా ప్రోత్సహించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

**కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్ఒడి చోహన్ చుల్‌తో మంత్రి లోకేశ్ భేటీ:** దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఆరో రోజు ప్రముఖ సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్ఒడి చోహన్ చుల్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఎపిలో గృహోపకరణాల యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఇప్పటికే ఎపిలోని శ్రీసిటీలో గృహోపకరణాల క్లస్టర్ ఉందని, అనేక ప్రముఖ సంస్థలు అక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు. భారతదేశంలో తయారవుతున్న ఎసిలలో 40శాతం, టివిలలో 35శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉత్పత్తి అవుతున్నాయని లోకేశ్ స్పష్టం చేశారు.

పరిశ్రమలకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ రాష్ట్రంలో పుష్కలంగా అందుబాటులో ఉందని, ఇక్కడి నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతులు చేయడం చాలా సులభమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, దక్షిణ భారతదేశంలో ఎసిల వినియోగం చాలా ఎక్కువగా ఉందని వివరించగా, ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

**ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిఇఒతోనూ...:** ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిఇఒతో కూడా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఈవీ విడిభాగాలు, ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్ యూనిట్లను ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించాలని కోరారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాలు శ్రీసిటీలో సిద్ధంగా ఉన్నాయని మంత్రి వారికి వివరించారు. వీటితో పాటు రక్షణరంగ తయారీ యూనిట్లలో కూడా పెట్టుబడులు పెట్టాలని, కొరియన్ కంపెనీల సహకారంతో మోటివ్ లింక్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

**ఎపిలో బ్యాటరీ యూనిట్‌కు డెల్టా ఎక్స్ సానుకూలం:** సియోల్‌లో డెల్టా ఎక్స్ ఫౌండర్, సిఇఒ స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఎపిలో ఒక బిఇఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సిఇఒ స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

**శాంసంగ్‌కు భారీ ప్రతిపాదనలు:** అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు.

**ఎఐ, డేటా సెంటర్ హబ్:** రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు. ఎపిలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఒఎస్ఎటి క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఒఎస్ఎటి) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

**అమరావతిలో భాగస్వామ్యం:** రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్‌డి విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు.

**శాంసంగ్ సిటీ:** శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఎపిలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించాలన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు. మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతినిధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు.

# రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి

**- సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పెట్టుబడుల పెట్టేందు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య.వ్యాపార రంగాల్లో దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఏపీ సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంత్రి సచివాలయంలోని ప్రచార విభాగ సమావేశ ప్రాంగణంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడులకు ముందుకు వస్తున్న సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది, సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం ముద్రవేసిందన్నారు. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతం, సంక్షేమ పథకాల అమలు, పేద విద్యార్థుల ఉపాధిపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. తప్పుడు ప్రచారాలు, వ్యక్తిత్వ హననం వల్ల సమాజం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని డీజీపీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాజకీయ ప్రత్యర్థులపై సోషల్ మీడియా ద్వారా కొందరు ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని, వీటికి కొన్ని పార్టీలు ఆర్థిక సాయం కూడా చేస్తున్నాయని విమర్శించారు. సంప్రదాయ మీడియాకు ఉన్న నైతిక విలువలు వీరికి లేవన్నారు.

మహిళలు, బాలికలను కించపరిచే పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై ఫిర్యాదుల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక రెస్పాన్స్ సెల్, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్వేషాలు వ్యాప్తి చేసే వారిని గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ వాడాలని నిర్ణయించారు. ఈ అంశంపై పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. సైబర్ నేరాల విచారణకు నిపుణులైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని సీఎం సూచించారు. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి దేశ విదేశాల్లో అమలులో ఉన్న చట్టాలపై జీఓఎం అధ్యయనం చేయాలని ఆదేశించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి ఖివయబిలిటీ గ్యాప్ ఫండింగ్ఖి కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు అవకాశం కల్పిస్తుంది.




## మంత్రి ఆనంకు సిఎం చంద్రబాబు బర్త్ డే విషెస్



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కేక్ కట్ చేయిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నిర్వహించిన కేబినెట్ సమావేశం అనంతరం సిఎం ప్రత్యేకంగా ఈ వేడుకను నిర్వహించారు. సహచర మంత్రుల సమక్షంలో ఆనం రామనారాయణరెడ్డితో సిఎం చంద్రబాబు కేక్ కట్ చేయించారు. అనంతరం ఆనంకు కేక్ తినిపించి, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ వేడుకతో కాన్ఫరెన్స్ హాలులో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర మంత్రులు కూడా ఆనం రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సహచర మంత్రి పుట్టినరోజును గుర్తుపెట్టుకుని సిఎం చంద్రబాబు వేడుక జరపడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆనం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సిఎం జన్మదిన శుభాకాంక్షలు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం చంద్రబాబు "ఎక్స్" వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో సుదీర్ఘ కాలం దేశానికి సేవ చేయాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని సీఎం పేర్కొన్నారు. ఇక రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు మంత్రి లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలు, సుదీర్ఘ జీవితం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని లోకేశ్ పేర్కొన్నారు.

## రామాయపట్నం పోర్టు గడువు పెంపు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రామాయపట్నం వద్ద ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు నిర్మాణ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈపీసీ పద్ధతిలో ఇక్కడ ఓడరేవు నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టు సంస్థ ఎన్ఈసీఎల్‌కు డిసెంబర్ 30 వరకు గడువు పెంచారు. ఓడరేవు నిర్మాణ పనుల పూర్తికి ఎన్ఈసీఎల్‌కు గడువు పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

## మాతృశాఖకు విజయవాడ జిజిహెచ్ డిప్యూటీ సిఎంఆర్ఒ

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ జీజీహెచ్ ఆసుపత్రిలో మృతదేహం తరలింపునకు అంబులెన్స్ సమకూర్చటంలో డిప్యూటీ సీఎంఆర్‌వో మంగాదేవి విఫలమయ్యారు. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తారు. మంత్రి ఆదేశాల మేరకు డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ చర్యలు తీసుకున్నారు. సర్వీస్ ప్రొవైడర్‌కు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## డిప్యూటీ డైరెక్టర్‌గా రామాంజనేయులుకు పదోన్నతి



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న వి.రామాంజనేయులుకు ఇటీవల ఉప సంచాలకులుగా పదోన్నతి లభించింది. గత పదేళ్ళుగా రాష్ట్ర సచివాలయంలో డిపిఆర్ఓగా, సహాయ సంచాలకులుగా సేవలు అందిస్తున్న ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ వారి కార్యాలయంలో ఉప సంచాలకులుగా పదోన్నతి కల్పించి రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగం (పబ్లిసిటీ సెల్)లో విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించారు. ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్ విశ్వనాధ్‌కి రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

## జంట హత్యల కేసులో ముగ్గురు అరెస్ట్



**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. కుటుంబ వివాహ వివాదాలే కారణంగా మారిన ఈ హత్యకు దారితీసిన వివరాలను తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి తెలిపారు. తిరుపతి తిరుచానూరు మార్గంలో పద్మావతి కళ్యాణ మండపం వద్ద 8వ తేదీ రాత్రి దాడిలో మునిరత్నం, మణికంఠ మృతిచెందిన విషయం విదితమే. లక్ష్మీపురం సర్కిల్ సమీపంలో జరిగిన ఈ సంచలన హత్యలో సిసిటివి ఫుటేజీలను పరిశీలించి నిందితులు తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన వాసు దేవయ్య సునీల్, ఉపేంద్రలను అరెస్ట్ చేశారు.

## స్టాక్ మార్కెట్ పెట్టుబడులు పేరుతో మోసం

## ఆల్ట్మెటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్ల అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త:** స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రతి నెల స్థిరమైన లాభాలు అందిస్తామని ఖాతాదారులను మోసగించిన ఆల్ట్మెటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్లు పి.మోజేష్, లలితాంబికను కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15 వేల చొప్పున 10 నెలలు, రూ.12,500 చొప్పున మరో 10 నెలలు అసలు, లాభం కలిపి రూ.4 లక్షలు ఇస్తామని ఈ సంస్థ రూ.కోట్లలో సేకరించింది. కొన్ని నెలలు చెల్లించాక నిలిపేయడంతో ఇటీవల బాధితులంతా ఆల్ట్మెటి జెనిసెస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆరుగురు ఖాతాదారులు సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో సర్పవరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో ఎఎస్పి ఎం.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఖాతాదారులకు సుమారు రూ.37 కోట్ల మేర చెల్లింపులు నిలిపేసినట్లు తెలిపారు. మోజేష్ బ్యాంకు ఖాతాల్లో తగిన నిల్వలు లేకపోవడం, ఆస్తులు కనిపించక పోవడం ఖాతాదారులను మోసగించాలనే ఈ సంస్థను నడుపుతున్నారని వివరించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో డైరెక్టర్లను అరెస్టు చేసి స్పెషల్ మొబైల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కాకినాడ ఎదుట హాజరుపరచున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సర్పవరం సిఐ సిహెచ్ ప్రకాష్, ఎస్ఐలు ఎం. ఏసుబాబు, జి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్‌టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పునరుద్ధరించండి

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ఎపి ఛాంబర్స్, హోటల్స్ అసోసియేషన్ వినతి

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** హాస్పిటాలిటీ రంగ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఎపి స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి హాస్పిటాలిటీ రంగానికి జిఎస్‌టి సంస్కరణలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 18శాతం జిఎస్‌టిని 5శాతానికి తగ్గించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రతినిధి బృందం మంత్రి దుర్గేష్‌కు విన్నించింది. కమర్షియల్ ఎల్‌పిజి వినియోగిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగిస్తున్న సంస్థలతో పోలిస్తే అధిక నిర్వహణ వ్యయాన్ని భరిస్తున్నాయని, దీంతో వ్యాపార నిర్వహణలో అసమాన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి హాస్పిటాలిటీ రంగానికి సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హాస్పిటాలిటీ రంగానికి జిఎస్‌టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పునరుద్ధరణ అత్యంత అవసరమని, ఐటిసి తొలగింపుతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణ వ్యయం, మూలధన వ్యయం గణనీయంగా పెరిగాయని, సుమారు 20శాతం వరకు పెరిగిన అద్దె భారం కారణంగా ఇప్పటికే తక్కువ లాభాలతో నడుస్తున్న హాస్పిటాలిటీ రంగంపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి ఏర్పడిందని వివరించారు.

ఈ ప్రతిపాదనలపై మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులతో కేంద్ర ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా జులై 14న టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్, అసోసియేషన్ ఆఫ్ నార్త్ ఆంధ్ర డొమెస్టిక్ ఇన్‌బౌండ్ టూరిజం సంయుక్తంగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురంలోని బెర్మ్ పార్క్ హరిత రిసార్ట్‌లో 'ఆంధ్రప్రదేశ్ ట్రావెల్ ఏజెంట్స్ మీట్ / ఇన్‌బౌండ్ టూరిజం కాన్‌క్లేవ్'కు తమ పూర్తి సహకారం అందిస్తున్నందుకు మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కాన్‌క్లేవ్ ప్రభుత్వం, పర్యాటక రంగం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌బౌండ్ టూరిజం అభివృద్ధికి దోహదపడే ముఖ్య వేదికగా నిలవనుందని అన్నారు. మంత్రి దుర్గేష్‌ను కలిసిన వారిలో ఎపి ఛాంబర్స్ సలహాదారు లక్ష్మీనారాయణ, అధ్యక్షులు పి. భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి.స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, జాయింట్ సెక్రటరీ ఎం.వి. పవన్ కార్తీక్, ఎపి ఛాంబర్స్ సభ్యులు, టూరిజం కమిటీ మెంబర్ కళ్యాణి కాకాని ఉన్నారు.



# సమాచార హక్కు అమలు.. సుపరిపాలనకు నిదర్శనం

- రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం స్పష్టీకరణ
- ప్రజలకు సమాచారమే శక్తి.. ఆ హక్కు పరిరక్షణే అధికారుల బాధ్యత
- విజయవాడలో ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన కార్యాలయాలకు షోకాజు నోటీసులు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతమవుతాయని రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం స్పష్టం చేశారు. ప్రజలకు సమాచారాన్ని సకాలంలో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి చట్టబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం విజయవాడలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సమాచార ప్రకటన నిబంధనల అమలు, ప్రజా సమాచార అధికారుల (పీఐవోలు) నియామకం, మొదటి అప్పీలేట్ అధికారుల వివరాల ప్రదర్శన, సమాచార హక్కు దరఖాస్తులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. తొలుత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం డీఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించి స.హ. చట్టం, 2005 అమలుతీరుతెన్నులను పరిశీలించారు. ఆపై ఆకస్మిక తనిఖీలలో భాగంగా దుర్గాపురం, గులాబీతోట స్వర్ణ వార్డు కార్యాలయాలతో పాటు న్యూ జీజీహెచ్, వక్ఫ్‌బోర్డు, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలను తనిఖీ చేశారు. అయితే సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దుర్గాపురం, గులాబీతోట స్వర్ణవార్డు కార్యాలయాలకు, అదేవిధంగా 4(1)(బి) రిజిస్టర్‌తో పాటు మరికొన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడంతో జీజీహెచ్‌కు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా డా. రెహానా బేగం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేవలం సమాచారం అందించే చట్టం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక సాధనమన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ముందస్తుగా అందుబాటులో ఉంచితే సమాచార హక్కు దరఖాస్తులు, అప్పీళ్ల సంఖ్య కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు సకాలంలో సమాచారం అందించి పారదర్శకతకు పెద్దపీట వేయాలని సమాచార కమిషనర్ డా. రెహానా బేగం సూచించారు.

**సమాచారహక్కు చట్టం అమలుపై ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలుపై రాష్ట్రమంతటా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయి. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తో పాటు ఇతర కమిషనర్లు జిల్లాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఆర్టీఐ చట్టం ఏ విధంగా అమలవుతోందో వారు క్షుణ్ణంగా పరిశీలించారు. లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను సంక్షేమ పథకాల డేటా అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం

వార్త

జీవితంలో మమతలు పెంచుకున్నవాడు,
అదే కాలంలో మృత్యుభయాన్ని
హెచ్చించుకుంటాడు.

- లావోస్టే

# 'అణు'బంధం

ఇంధన భద్రతపై ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న తరుణంలో భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఒక కీలక ఒప్పందం కుదిరింది. ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు అన్నివిధాల మార్గం సుగమమైంది. ఇరాన్ యురేనియం ముడిసరుకు కోసం అమెరికా ఖర్గే నుంచి ఎలుక కన్నాల వరకు తొలిచేస్తోంది. అదే సమ యంలో ఎలాంటి వివాదమూ రాజుకోకుండా భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరాలో ఒక అడుగు ముందుకేసింది. ఇరుదేశాలు ఆస్ట్రేలియాల నుంచి భారత్‌కు యురేనియం సరఫరాను కార్యరూపంలోకి తెచ్చే పరిపాలనా ఆమోదాలను సిద్ధం చేసుకోవడం కీలకమైన ముందడుగే. నిజానికి తొలి అడుగు ఏనాడో 2014లోనే పడింది. ఆనాడు కుదిరిన పౌర అణు ఒప్పందానికి ఇప్పుడు ఆచరణాత్మక రూపం లభించిందన్న మాట. దీనిని కేవలం ఇంధన వాణిజ్య ఒప్పందంగా భావించకూడదు. ఇంధన భద్రత, ఇండో పసిఫిక్ ప్రాంతీయ సమతుల్యత, సరఫరా గొలుసుల స్థిరత్వం వంటి అంశాలతో ముడిపడి ఉన్నవ్యూహాత్మక భాగస్వా మ్యంగానే గుర్తించాలి. ఆస్ట్రేలియాలో భారత ప్రధాని నరేంద్రమోడీ పర్యటన సందర్భంగా వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత భారత ప్రధాని, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్‌లు సం యుక్తంగా తమ ఒప్పందంలోని కీలక అంశాలను తెలియ చేశారు. తమ ఒప్పందా నికి బాసటగా ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల పర్యవసానంగా ఈ రెండు దేశాల మధ్య ఏర్పడిన ఒప్పందం ఉభయ తారకమే. ఇంధన సంక్షోభ సమయంలో భారత్, ఆస్ట్రేలియా స్నేహ హస్తం అందుకోవడం లాభదాయకమే. ప్రపంచ ఇంధన సరఫరా ధరలపై యుద్ధ ప్రభావం గణనీయంగాఎక్కువే. ఈ సందర్భంలో ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా లో ఈ రెండు దేశాల భాగస్వామ్యం మంచిదే. భారత్ 2047 నాటికి అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణ నీయంగా పెంచేలక్ష్యంతో ముందుకు సాగుతోంది. బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ తక్కువ కార్బన్ ఉద్గా రాలతో స్థిరమైన విద్యుత్‌ఉత్పత్తిని విస్తరించడానికి యురేనియం అవసరమని అంచనా. భారత్‌కు దేశీయంగా ఉన్న యురేనియం నిల్వలు సరిపోవు. ప్రపంచంలోనే ఆస్ట్రేలియా అతిపెద్ద యురేనియం నిల్వలు కలిగిన దేశం కావున ఆ దేశం భారత్‌కు భారత ఇంధన వ్యూహానికి దీర్ఘకాలిక భరోసానిస్తోంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యమే కాకుండా సముద్రభద్రతపై నెలకొన్న ఆందోళనలు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, ఆవశ్యకత భారత్‌ఆస్ట్రేలియా సంబంధాలను మరింత సమర్థవంతంగా దగ్గర చేస్తున్నాయి. క్వాడ్ భాగస్వామ్య దేశాలుగా ఇరు దేశాలు రక్షణ సముద్ర భద్రత, సాంకేతికత, కీలకఖనిజరంగాల్లో సహకారాన్ని అందచేసుకుంటాయి. యురేనియం సరఫరా కారణంగా భారత్ ఉన్నట్టుండి అణుశక్తిరంగం ఒక్కసారిగా విప్లవాత్మ కంగా మారుతుందని చెప్పలేం. కొత్త అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, పెట్టుబడులు, సాంకేతిక సామర్థ్యం, వ్యర్థాల నిర్వహణ వంటి అనేకసవాళ్లు సవాళ్లుగానే మిగిలిపోయి ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న పరిస్థితుల రీత్యా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ భద్రతా ప్రమాణాలకు లోబడి, దేశశాంతియుత అవసరాల మేరకు మాత్రమే భారత దిగుమతి చేసుకున్న యురేనియంను వినియోగించాల్సి వస్తుంది. భారత్‌తో చేసుకున్న ఒప్పంద రీత్యా ఇకపై ఆస్ట్రేలియా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే అవకాశముంది. విశ్వసనీయ భాగస్వామిగా భారత్‌తోఇంధన వాణిజ్యాన్ని విస్తరణ అణుఇంధన రంగంలో కొత్త మార్కెట్ వచ్చి చేరుతుంది. కీలక ఖనిజాల అవసరమూ ఏర్పడుతుంది. ఈదృష్ట్యా ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద విస్త రణకు కూడా ఆస్కారం ఉంటుంది. అణుశక్తిని స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయాలనే సంకల్పానికి ఇదొక పునర్నిర్వచనం చెబుతోంది. అంటే భారత్ స్వావలంబన దిశగా స్థిరమైన అడుగులు వేయనున్నది. ఈ పర్యటనలో మొత్తం 18 ఒప్పందాలపై భారత్, ఆస్ట్రేలియాల మధ్య సంతకాలు జరిగాయి. వీటిలో భారత్ తీర రక్షక దళం, ఆస్ట్రేలియాకు చెందిన మారిటైమ్ బోర్డర్ కమాండ్‌ల మధ్య ఒప్పందం కూడా ఇమిడి ఉంది. ఇది సముద్ర చట్టాల అమలు, సముద్ర ప్రాంతాలపై అవగాహన, సరిహద్దుల రక్షణ వంటి అంశాలలో పరస్పర సహకారానికి దోహదపడుతుంది. ఈ చర్చలు, ఒప్పందాలు ఇరుదేశాల మధ్య అసాధారణమైన అంశాలుగా ప్రధానులిద్దరూ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా కేవలం శిలాజరహిత ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికే భారత్‌కు యురేనియం ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బానీస్ ప్రకటించారు. ఇకపై తమ భాగస్వామ్యం గతంలో ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉండబోతుందన్న ఆశాభావాన్ని ఉభయులూ ప్రకటించారు. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద సూపర్ ఫండ్ ఆస్ట్రేలియా భారతదేశంలో రూ.3,311కోట్లు అదనపు పెట్టుబడి పెట్టనుంది. భారత ఆర్థికవ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసానికి ఇదే నిదర్శనమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఇండియా, ఆస్ట్రేలియా సిఇఒల ఫోరమ్‌లో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజా పెట్టుబడితోభారత ఆర్థికరంగంలో ఆస్ట్రేలియన్ సూపర్ మొత్తం పెట్టుబడి 3.3 మిలియన్ డాలర్లకు చేరనుంది. 28ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటించిన తొలిభారత ప్రధాని తానేనని నరేంద్రమోడీ ఎంతో సంతోషంగా ముచ్చటించారు. ఈ పర్యటన భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఎంతో పటిష్ట బంధాన్ని నిలబెట్టిందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

మనకు ఉన్న సంపదతో సంతృప్తిపడడం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం.



సర్వేపల్లి రాధాకృష్ణన్

నీవెవరినో చూసి అనుకరించాలనుకునే కంటే నీకు నీవు సహజంగా ఉండటం ఎంతో శ్రేయోదాయకం.



బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### ఒకరు వద్దు, ఇద్దరు ముద్దు నినాదం చాలు

ఇప్పటికిప్పుడే మన జనాభాను ప్రత్యేకంగా పెంచాల్సిన పని లేదు, ఇంకా పెరుగుతూనే వుంది, పెరుగుదల రేటు మాత్రం తగ్గింది. సమీప భవిష్యత్తులో యువతకు కొరత రాదు ఎప్పుడో విజన్ 2047 నాటికి ఆ పరిస్థితి వస్తే జపాన్ వలె పదవీ విరమణ వయస్సు పెంచి, ఇరాన్ సైన్యం వలె ఉద్యోగ అర్హత వయసు తగ్గించి, ఆనాటి పరిస్థితులకి తగినట్లు ఆ పాలకులు చర్యలు చేపడతారు. నేడెందరో విద్యావంతులు, చిరుద్యోగులు విద్య, వైద్యం, పిల్లల పెంపకం వంటి కుటుంబ ఖర్చులు తట్టుకోలేక ఒక బిడ్డతోనే సరిపుచ్చుకుంటున్నారు. కనుక ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మూడో బిడ్డకి ఇస్తామంటున్న ముప్పై వేల రూపాయలను మొదటి బిడ్డకీ, నాలుగో బిడ్డకి ఇస్తామనే నలభై వేలని, రెండోబిడ్డకీ ఇచ్చి, గతంలో వలె అన్నిరాయితీలను అందిస్తే ఫలితం వుంటుంది. ఆ రెండో బిడ్డ, తొలి బిడ్డకి తోడై, వారి ఆటపాటలతో పెద్దలకీ కాలక్షేపంగా వుంటుంది. ఇక చదువుల కోసం బడిలో చేర్చే తల్లిదండ్రులిద్దరూ వుద్యోగులైతే పిల్లల సంరక్షణ కోసం, వారి కుటుంబపెద్దల్నీ తెచ్చుకుంటారు. ముఖ్యమంత్రి ఆశిస్తున్నట్లు వుమ్మడి కుటుంబ వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### సంకల్ప బలం ముఖ్యం

16వ ఆర్థిక సంగం నిధులు గ్రామపంచాయితీలకు విధిల్చాలి అంటే పెట్టిన నిబంధనలు గ్రామపంచాయితీల మధ్య పోటీ తత్వం పెంచే విధంగా ఉన్నాయి. అవి స్వంత నిధులను పెంచుకోవడం వైపు మార్గాలు వెతకాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నాయి. అది హరిత హారం ద్వారా పెంచొచ్చు లేదా తెలంగాణకు ఉండే చారిత్రక జల సంపద ద్వారా కావొచ్చు. మొత్తం మీద కావాల్సినది సంకల్పం మాత్రమే.

- భారత అవినాష్, జనగాం

### పంటల మార్పిడి చేయాలి

నేటి కాలంలో పొలాలలో ఆధునికపద్ధతులను, యంత్రాలను ఉపయోగించి పంటల మార్పిడి విధానాన్ని చేపట్టి అధిక దిగుబడిని పెంపొందించుకోవాలి. రెండు కాలాలు ఒకే పంట వేసి నేల సామర్థ్యాన్ని తగ్గించడం కంటే మెరుగైన బహుళ జాతి పంటలు వేస్తే మద్దతు ధరతో పాటు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### మాతృభాష మాధుర్యం

తెలుగు భాషలోని మాధుర్యం, సౌందర్య సౌరభాలు మరే భాషకులేవని ఘంటాపథంగాచెప్పవచ్చు. మాతృభాషను విస్మరించడం అంటే, అమ్మ భాషను మరిచిపోవటమే అవుతుంది. కేవలంరచయితల కల్పనలకే పరిమితమయ్యే దుర్గతి తెలుగుకు దాపురించిందంటే అతిశయోక్తి కాదు. దీన్ని అధికమించాలంటే మన పిల్లలకు చిన్నతనం నుంచి తెలుగుదనం అలవరచాలి. రామాయణ, భారతాల వంటి ఇతిహాసాలను పరిచయం చేస్తూ, ఆకథలను పిల్లలకు చెప్తూ మాతృభాషలోని తియ్యదనాన్ని వారికి రుచి చూపించాలి. వారికి తెలుగు మాట్లాడటం, చదవటం, రాయటం నేర్పించాలి. ప్రాథమిక పాఠశాలలో అర్హులైన తెలుగు ఉపాధ్యాయులను నియమించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి. పదవ తరగతి వరకు తెలుగు పాఠ్యాంశాన్ని తప్పనిసరి చేయాలి. తెలుగు మాధ్యమాలలో చదివిన వారికి ఉద్యోగాల్లో, ఇతరత్రా ప్రోత్సాహకాలు అందించాలి. తెలుగుభాషను బ్రతికించుకోవాలంటే, ప్రభుత్వ కార్యకలాపాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగును ఉపయోగించాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం

దేశంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు విద్యుత్ పొదుపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, ఎంఎంటీఎస్, మెట్రోకేంద్రాల్లో రాత్రి వేళల్లో అవసరానికి మించి వెలిగించే దీపాలను తగ్గించడంద్వారా గణనీయమైన విద్యుత్ ఆదా సాధ్యమవుతుంది. ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండే అర్ధరాత్రి సమయాల్లో ప్రతి దీపాన్ని వెలిగించడం అవసరం లేదు. ప్రధాన స్టేషన్లు, లోకల్ రైలు కేంద్రాలు, మెట్రో స్టేషన్లలో కనీస భద్రతకు అవసరమైనంత వెలుతురు మాత్రమే ఉంచి, మిగతా దీపాలను నిలిపివేయవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నత విద్య

వివిధ యూనివర్సిటీల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఉన్నత విద్య అవకాశాలు కల్పించాలి. ఈ కోర్సులకు గాను వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి. ప్రతి ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ఆయా శాఖల అభివృద్ధికి గానునిధులు నియామకాలు సంక్షేమపథకాల ప్రచారం కొరకు పరిశోధనలు అవసరం. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులలో ప్రస్తుతం ఉన్నత విద్య డాక్టరేట్ పట్టా పొందిన వారి చేత పర్యవేక్షణ వీరి ద్వారా చేయించడం అవసరం.

- రాపాక రవీందర్, జనగాం

# తిప్పలు పెడుతున్న రెవెన్యూ చట్టాలు!

**'భూ భారతి' చట్టం కూడా విధానపరంగా ఎంతో కొంత ఆశాజనకంగానే కన్పిస్తున్నది. కానీ అమలులో సమస్యలు తక్కువేమీ లేవు. వందలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. అవినీతి కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ చుట్టూ ప్రదక్షిణలు చేసే భజనపరులతో కాకుండా తమకు ఉన్న ఏజెన్సీల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను తెప్పించుకోగలిగితే కొత్త చట్టానికి అర్థం పరమార్థం ఉంటుంది. ఇక కౌలురైతుల, పోడు భూముల సమస్యలు రగులుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామని పాలక పెద్దలు ప్రకటించారు. లక్షలాది మంది గిరిపుత్రులు, కౌలురైతులు ఎదురు చూస్తున్నారు. ఈ సమస్యలు ఎంతో సున్నితమైన భూముల విషయంలో జోక్యం చేసుకొని చేతులే కాదు ఒళ్లు కాల్చుకున్న పెద్దలున్నారు. అవన్నీ దృష్టిలో ఉంచుకొని అన్ని కోణాల్లో మనసు పెట్టి ఆలోచించి ఆచితూచి అడుగులు వేయాలి.**

దామెర్ల సాయిబాబ

కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా ఉంది. భూముల వ్యవహారంలో కొందరు పాలక పెద్దలు, మరికొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు. సంస్కరణలు, చట్టాలు ఎన్ని తెచ్చినా అవి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి. అందులోని కష్టనష్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆచరణ సాధ్యం అవుతుందా? అందుకు తగిన సిబ్బంది ఉందా? వీటన్నింటిని మించి సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం వారికుందా? తదితర అంశాలు పరిగణనలోకి తీసుకొని చట్టాలుచేయాలి. అప్పుడే ఆ చట్టాలు చేసిన నేతలకు ప్రజాభిమానం పెరుగుతుంది. భూముల రికార్డుల విషయంలో ఆది నుంచి భూయజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇప్పుడే కాదు గతంలో కూడా ఎన్నో చట్టాలు చేశారు. ఎంతో మంది అధికారులను నియమించారు. కానీ సమస్యలు పెరిగాయే తప్ప తగ్గలేదని చెప్పొచ్చు. దశాబ్దాల తరబడి వేలాది కేసులు న్యాయస్థానాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్‌ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని సరికొత్తగా ప్రవేశపెట్టింది. అంతకు ముందు తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా టిఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి పోర్టల్' అనే నూతన చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఆ చట్టం రికార్డుపరంగా ఎంత ఉపయోగకరంగా కన్పించినా ఆచరణకు వచ్చేసరికి అన్నీఇన్నీ ఇబ్బందులు కాదు. ఎంతో వ్యయం చేసుకున్నా రికార్డులు సరి చేయించలేక, జరిగిన పొరపాట్లతో కొందరు రైతులు ప్రభుత్వాల నుంచి పొందాల్సిన ప్రయోజనాలను పూర్తిగా పొందలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని పక్కనబెట్టి ఇప్పుడు కొత్తగా 'భూ భారతి' చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఎంత పటిష్టంగా, పకడ్బందీగా నిబంధనలు ఏర్పాటు చేసినా శత కోటిదరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్నట్లు ఏదోరకంగా దళారులు, మరికొందరు రియల్టర్‌ల నుండి ముఖ్యంగా ప్రభుత్వం భూములను కాపాడలేకపోతున్నారు. భూముల రేట్లు అత్యధికంగా పెరిగిన హైదరాబాద్‌తోపాటు చుట్టూ ఉన్న రంగారెడ్డి తదితర జిల్లాల్లో అక్రమాలకు అంతేలేకుండా పోతున్నది. అంతెందుకు తెలంగాణలో 'హైడ్రా'ను ప్రవేశ పెట్టిన తరువాత వెలుగు చూసిన ప్రభుత్వ భూములు, ప్రధానంగా చిన్ననీటి వనరులను ఆక్రమించుకొని ఏకంగా పెద్దపెద్ద భవనాలే కాదు కాలనీలకు కాలనీలే నిర్మించుకొన్న ఉదంతాలు బయటపడ్డాయి. కొన్నింటిని కూల్చి వేసి తిరిగి హైడ్రా ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. ఒకటి రెండు కాదు వేలాది ఎకరాల అత్యంత విలువైన భూములున్నాయి. ఈ అక్రమాలు నిర్మాణాలన్నీ ఒక్కరోజులోనో, ఒక నెలలోనో జరిగినవి కాదు. దశాబ్దాల తరబడి జరిగాయి, జరుగుతున్నాయి. చాలావరకు అనుమతులు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల నుండి పొందారు. ఇందులో నష్టపోయింది, పోతున్నది అమాయక కొనుగోలుదారులే. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా చెప్పుకొనే ప్రజాప్రభుత్వంలో వేలాదిరూపాయలు జీతభత్యాలు రూపేణ నెలనెలా ప్రజాధనాన్ని తీసుకొంటున్న సంబంధిత అధికారగణం ఏంచేస్తున్నట్లు అనే ప్రశ్న ఉదయించక తప్పదు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ చేస్తున్న ఆకస్మిక తనిఖీల్లో ఆదాయానికి మించిన వందలాది కోట్లరూపాయల విలువైన అక్రమాస్తులు బయటపడుతుండటం పరిశీలిస్తే చట్టాలకు ఎలా తూట్లు పొడుస్తున్నారో అర్థమౌతుంది. వాస్తవంగా చూసినా భూముల విషయంలో నిజాంపాలన నుండి పటిష్టమైన చట్టం లేదని చెప్పొచ్చు. తెలంగాణ ప్రాంతంలో 1936 నుంచి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ నిర్వహించడం ప్రారంభించారు. నైజాం పరి

## ఒక్క మాట

పాలన హక్కుల రికార్డుల నిర్వహణ కోసం భూమి హక్కుల రికార్డు చట్టం 1936 ఫస్లీ రూపొందించారు. ఆ తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో భూహక్కుల రెగ్యులరైజేషన్ చట్టాన్ని 1358 ఫస్లీ పేరుతో మరో చట్టాన్ని తెచ్చారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తకాల చట్టం చేశారు. ఇలా ఎన్నో మార్పులు, చేర్పులు చేసినా ఖచ్చితమైన రికార్డులు చేయలేకపోయారనే చెప్పొచ్చు. అందుకే ప్రభుత్వ, దేవుళ్ల భూములతోసహా వేలాది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. శాసనసభలో కూడా ఎన్నోసార్లు ఈ ఆక్రమణలపై చర్చలు జరిగాయి. భూముల విషయంలో రాజుల మధ్య కొంతకాలం, జాగీర్దారుల మధ్య కొంతకాలం ఆ తర్వాత భూకామందుల మధ్య చివరకు వారిపై తిరగబడ్డ సన్నజనం కూడా ఈ పోరాటంలో పాలు పంచుకున్నారు. నక్సలిజం ఆవిర్భావానికి, ఇప్పటికీ అంతో ఇంతో మిగిలి ఉండడానికి ప్రధాన సమస్య అదే. భూమి ముఖ్యమైందన్న విషయం నిర్వివాదం. భూముల విషయంలో ఇప్పటికీ ఎన్నిచట్టాలు చేశారో, ఎన్ని సవరణలుచేశారో, ఇంకెన్ని మినహాయింపులు ఇచ్చారో లెక్కకు అందదు. రాజకీయాల అవసరాలకోసం భూమి చూపి పేదల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు ఏనాటి నుంచో వినిపిస్తున్నాయి. పార్టీలు మారినప్పుడు వారి ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చినప్పుడల్లా చట్టాల్లో మార్పులు చేసుకుంటూపోతున్నారు. 1971లో కేంద్ర ప్రభుత్వం భూగరిష్ట పరిమితిని తీసుకురావడంతో కొంత కదలిక వచ్చిందని చెప్పొచ్చు. 1973లో జనవరి ఒకటిన అప్పటి ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం చట్టం చేసింది. కానీ అమలు చేయడానికి చట్టం వచ్చిన రెండేళ్ల తర్వాత 1975 జనవరి నుంచి శ్రీకారం చుట్టారు. ఈ రెండేళ్ల వ్యవధిలో చాలామంది పెద్దలు తమ భూములను సర్దుబాటు చేసుకునే అవకాశం దొరికింది. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను పెద్దలు నయానో, భయానో ఆక్రమించి అమ్ముకుంటున్నారని అలా వీలుకాకుండా పటిష్టమైన 9/77చట్టాన్ని తీసుకువచ్చారు. అయినా అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఆగలేదు. ఇందుకు రాజకీయ జోక్యం, అవినీతి కారణం. పట్వారీతో పంచాయతీ పెట్టుకుంటే పొలం పోయి గుట్టెక్కుతుంది. గుట్ట వచ్చి పొలంలో కూర్చుంటుందనే నానుడి అప్పట్లోనే ఉండేది. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఏకంగా ఆ వ్యవస్థనే రద్దు చేశారు. అయినా ఆ జాడ్యం ఆగలేదు. ఏదో ఒక రూపం లో కొనసాగుతూనే ఉంది. ఇలాంటి వాటిని అధిగమిం చేందుకు భూహక్కుల రికార్డులను పక్కాగా నిర్వహించ డానికి భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన వెంటనే రికార్డుల్లో మార్పులు చేసి భూయజమానులకు హక్కు పత్రం ఇవ్వడానికి భరోసా కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. భూ రికార్డుల నిర్వహణలో అధునాతనమై పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పట్టాదారు పాసుపుస్తకాల జారీలో జాప్యాన్ని నివారించడం, భూపరిపాలన, అవినీతిని నిర్మూలించడం లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఏకగవాక్ష విధానం ద్వారా భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్, పట్టాల జారీ అన్నీ ఒకే రోజు ఒకే కార్యాలయంలో జరిగేలా నిబంధనలు పొందుపరిచారు. ఇవన్నీ తు.చ తప్పకుండా అమలు చేసి పొరపాట్లు జరగకుండా చేయగలిగితే రైతులకు ఎంతో మేలు జరిగేది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరయ్యాయి. సమస్యలు పెరిగిపోయాయి. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా రికార్డులు తప్పువచ్చేలా చేసి అవి సవరించడానికి వేలు కాదు, లక్షలు వసూలు చేశారు. సమస్యలను భూతద్దంలో చూపి మాయమాటలతో నమ్మించి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. 'భూ భారతి' చట్టం కూడా విధానపరంగా ఎంతో కొంత ఆశాజనకంగానే కన్పిస్తున్నది. కానీ అమలులో సమస్యలు తక్కువేమీ లేవు. వందలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. అవినీతి కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ చుట్టూ ప్రదక్షిణలు చేసే భజనపరులతో కాకుండా తమకు ఉన్న ఏజెన్సీల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను తెప్పించుకోగలిగితే కొత్త చట్టానికి అర్థం పరమార్థం ఉంటుంది. ఇకకౌలురైతుల, పోడు భూముల సమస్యలు రగులుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామని పాలక పెద్దలు ప్రకటించారు. లక్షలాది మంది గిరిపుత్రులు, కౌలురైతులు ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యలు ఎంతో సున్నితమైన భూముల విషయంలో జోక్యం చేసుకొని చేతులే కాదు ఒళ్లు కాల్చుకున్న పెద్దలున్నారు. అవన్నీ దృష్టిలో ఉంచుకొని అన్నికోణాల్లో మనసు పెట్టి ఆలోచించి ఆచితూచి అడుగులు వేయాలి. ●

# జనాభా కాదు... జనశక్తిని నిర్మించాలి

వంగవోలు రవి

భారత్ అభివృద్ధి భవిష్యత్తు జనాభా పరిమాణంపై కాదు, యువతకు విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, ఉపాధి, స్వేచ్ఛ కల్పించడంపైనే ఆధారపడి ఉంది. ప్రపంచ జనాభా దినోత్సవం వచ్చినప్పుడల్లా మన చర్చ ఇప్పటికీ "జనాభా ఎంత పెరిగింది?" అనే ప్రశ్న చుట్టూనే తిరుగుతోంది. కానీ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న అది కాదు. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి 2026 ప్రపంచ జనాభా దినోత్సవానికి ప్రకటించిన 'రిలైజింగ్ ద హోప్స్ అండ్ ఆస్పిరేషన్స్ ఆఫ్ యంగ్ పీపుల్ టుడే అండ్ ఫర్ ద ఫ్యూచర్' అనే థీమ్ కూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. జనాభా ఎంత ఉందన్నది కాదు ఆ జనాభా ఎంత ఆరోగ్యంగా ఉంది, ఎంత చదువుకుంది, ఎంత నైపుణ్యం సంపాదించింది, ఎంత స్వేచ్ఛగా తన జీవితాన్ని నిర్మించుకోగలుగుతోంది అనేదే దేశ భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారింది. ఒకప్పుడు జనాభా పెరుగుదలనే అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా భావించేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఐక్యరాజ్యసమితి లెక్కలప్రకారం అనేక దేశాలు వృద్ధాప్య జనాభా, తగ్గుతున్న జననాల రేటు, కార్మికుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో పాటు, అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ఒక చారిత్రక అవకాశం లభించింది. అయితే ఈ అవకాశాన్ని నిజమైన జనశక్తిగా మార్చగలుగుతున్నామా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది. ఒక దేశ భవిష్యత్తును కేవలం జనాభా సంఖ్య నిర్ణయించదు. ఆ జనాభాలో ఎంతమంది ఆరోగ్యంగా ఉన్నారు? ఎంత మంది నాణ్యమైన విద్య పొందుతున్నారు? ఎంతమందికి అవసరమైన నైపుణ్యాలున్నాయి? ఎంతమందికి గౌరవప్రదమైన ఉపాధి లభిస్తోంది? అన్నదే దేశ పురోగతిని నిర్ణయిస్తుంది. యువశక్తికి నాణ్యమైన విద్య, సరైన శిక్షణ, మెరుగైన ఆరోగ్యం, తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోతే అదే జనాభా నిరుద్యోగం, అసమానత, సామాజిక అసంతృప్తికి కారణమయ్యే ప్రమాదం కూడా ఉంది. అందుకే జనాభా సంఖ్య కంటే మానవ వనరుల నాణ్యతపై పెట్టుబడి పెట్టడం అత్యవసరమైంది. విద్యారంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. యుడిఐఎస్ఇ 2023-24 గణాంకాల ప్రకారం పాఠశాల స్థాయిలో బాలికల నమోదు అబ్బాయిలతో దాదాపు సమాన స్థాయికి చేరుకుంది. కానీ ఈ గణాంకాలు మరో ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నాయి. చదువు పూర్తయిన ప్రతి యువకుడు, యువతి ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారా? పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు వారికి అందుతున్నాయా? మారుతున్న సాంకేతిక ప్రపంచానికి తగిన సామర్థ్యాలను విద్యావ్యవస్థ పెంపొందిస్తోందా? ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత విద్య పూర్తిచేసి ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు. కానీ వారందరికీ వారి నైపుణ్యాలకు తగిన ఉపాధి లభిస్తోందా? అనేది కీలకమైన ప్రశ్న. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023-24 ప్రకారం మహిళల శ్రామిక భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, ఆ పెరుగుదలలో గణనీయమైన భాగం స్వయం ఉపాధి లేదా అనౌపచారిక రంగంలోనే ఉంది. మరోవైపు యువత నిరుద్యోగం, నైపుణ్యాలకు తగ్గఉద్యోగాల కొరత ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. ప్రపంచ జనాభా దినోత్సవం మనకు గుర్తు చేయాల్సిన సందేశం ఒక్కటే. జనాభా సంఖ్యను లెక్కించడం కంటే, ప్రతి మనిషిలోని సామర్థ్యాన్ని పెంపొందించడం చాలా ముఖ్యం. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, గౌరవ ప్రదమైన ఉపాధి, లింగ సమానత్వం, నిర్ణయ స్వేచ్ఛ ఇవే భవిష్యత్ భారతాన్ని నిర్మించే అసలు పునాదులు. ప్రతి యువకుడికి, ప్రతి యువతికి తమ సామర్థ్యాన్ని వికసింప జేసుకునే అవకాశాలను కల్పించినప్పుడే జనాభా నిజమైన జనశక్తిగా మారుతుంది. ●

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




గంగాపురం స్థితప్రజ్ఞ

ఒక్కరైతే ఒంటరే... ఒక్కటైతే ఉప్పెనే' అనే నినాదంతో, లక్షలాది సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యా యుల సామాజిక భద్రతే ధ్యేయంగా జనం నుండి ఉద్భవించిన మహా ప్రవాహం .. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సిపిఎస్‌ఈయు). 2016 లో ప్రారంభమైన ఈ సంఘం, సిపిఎస్ విధానం పట్ల ఉద్యోగుల్లో ఉన్న అంధకారాన్ని తొలగించి, వారిలో అవగాహన కల్పించేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో విస్తృతంగా సదస్సులు, సమావేశాలను నిర్వహించింది. నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలతో పాత పెన్షన్ (ఓపిఎస్) సాధనకై ఈ యూనియన్ దేశవ్యాప్త ఉద్యమానికి ఇరుసుగా నిలిచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2016వరకు లేని 16 లక్షల విలువక్ డెత్ కామ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీతోపాటు ఉద్యోగి సర్వీస్‌లో ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్‌ఆర్థిక రక్షణను కల్పించాయి. ఇది కేవలం 10 ఏళ్లలోనే సాధించింది. అనేక శక్తి యుక్తులతో, అనంతమైన మేధోశక్తితో, కఠినమైనపోటీని తట్టుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల భవితను పిఎఫ్ఆర్డీఏ అనే చట్టం ద్వారా ప్రవేశ పెట్టిన నూతన పెన్షన్ విధానం అంధకారమయం చేసింది.

**మార్కెట్ ఒడిదొడుకులపై పెన్షన్ ఆధారపడటం :** పాత పెన్షన్ విధానంలో (ఓపిఎస్) ఉద్యోగి రిటైర్ అయ్యేనాటికి వచ్చిన చివరి జీతంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేది. కానీ సిపిఎస్ విధానంలో ఉద్యోగి జీతం నుండి కట్ చేసిన సొమ్మును షేర్ మార్కెట్లలో పెట్టుబడిగా పెడుతున్నారు. మార్కెట్ ఒడిదొడుకుల వల్ల రిటైర్మెంట్ తర్వాత వచ్చే పెన్షన్ కేవలం కొన్ని వందల రూపాయలకే పరిమితం అవుతోంది.

**జీవన భృతికి చాలని పెన్షన్లు:** ముప్పై, నలభై ఏళ్ల ప్రభుత్వానికి సేవలందించి రిటైర్ అయిన ఉద్యోగులకు నేడు నెలకు రూ. 1000 నుండి రూ. 2000 లోపే పెన్షన్ వస్తున్న ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఈ కాలంలో ఈ అరకొర డబ్బులతో ఒక వృద్ధాప్య కుటుంబం కనీసం మందుల ఖర్చులు కూడా వెళ్లదీసుకోలేని దుస్థితి నెలకొంది.

**ఆత్మగౌరవానికి దెబ్బ:** జీవితాంతం గౌరవప్రదమైన హోదాలో బతికిన ఉద్యోగి, రిటైర్మెంట్ తర్వాత కుటుంబ సభ్యులపై లేదంటే ఇతరులపై ఆధారపడాల్సి రావడం వారి ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. సామాజిక భద్రత కరువై, విశ్రాంత జీవితం నిస్సహాయంగా మారుతోంది. ఈ అన్యాయమైన విధానానికి వ్యతిరేకంగా టిఎస్‌సిపిఎస్‌ఈయు నేతృత్వంలో సాగినఉద్యమ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్ళు




ఉన్నాయి. **శంఖారావం (ఫిబ్రవరి 26, 2017):** నిజాం కాలేజ్ మైదానంలో లక్షలాది మందితో నిర్వహించిన ఈ సభ రాష్ట్రంలో పెనుదుమారాన్ని రేపింది. దీని ఫలితంగానే డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీ (జి.ఓ 60)సాధించబడింది. **సామూహిక సెలవు, ధర్మదీక్ష (సెప్టెంబర్ 1, 2017):** సంఘం ఇచ్చిన పిలుపుతో 85పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి, జిల్లా కేంద్రాల్లో ధర్మదీక్షలు చేపట్టి తమ దృఢ సంకల్పాన్ని చాటారు. **ఆయుత ధర్మదీక్ష (జనవరి 7, 2018):** నాటి ముఖ్యమంత్రి నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్ గడ్డపై వేలాది మందితో ఆయుత ధర్మదీక్షను విజయవంతంగా నిర్వహించారు. **ఆత్మగౌరవ జన జాతర, ఓట్ ఫర్ ఓపిఎస్:** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో లక్షకుపైగా కుటుంబాలతో భారీ బహిరంగ సభ నిర్వహించి, "పాత పెన్షన్ ఇచ్చే పార్టీలకే మా ఓటు" అని ప్రతిజ్ఞ చేసి సిపిఎస్ ఐక్యతను చాటారు. **రాజకీయ నిర్ణయం మేనిఫెస్టోలో హామీ:** దేశవ్యాప్తంగా ఎన్.ఎం.ఓ.పి.యస్ ద్వారా ఉద్యమాన్ని విస్తరింపజేసి ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణకు కారణమైంది సిపిఎస్ యూనియన్. తెలంగాణలో సైతం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కను కలిసి సమస్య తీవ్రతను వివరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో "సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ" హామీని చేర్చేలా ఈ యూనియన్ నేతలు క్రియాశీలక కృషి చేశారు. గతంలో ఇచ్చిన హామీలు, సిపిఎస్ పెన్షన్ లోపాలవల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్ర అన్యాయాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి మరోమారు బలంగా గుర్తుచేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలనే ఏకైక డిమాండ్‌తో టిఎస్‌సిపిఎస్‌ఈయు మరో చారిత్రాత్మక ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. **జులై 11 నుండి జన జాగరణ యాత్ర:** ఈ సుదీర్ఘ పోరాట యాత్ర భద్రాద్రి జిల్లా నుండి ఘనంగా ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులందరినీ ఏకం చేస్తూ ఈ యాత్ర సాగుతుంది. నియోజకవర్గ కేంద్రాల్లో సిపిఎస్‌ఉద్యోగులతో ప్రత్యేక అవగాహన, సమరశీల సమావేశాలు నిర్వహించి, ఆయా ప్రాంతాల స్థానిక శాసనసభ్యులను (ఎమ్మెల్యేలను) ప్రత్యక్షంగా కలిసి. ఎమ్మెల్యేల స్పందన కోరనున్నారు. 'నాడు ఓట్లు వేశాం.. నేడు మా పెన్షన్ సమస్యపై మీ స్పందన ఏంటి?' అని ప్రశ్నిస్తూ, నాటి ఎన్నికల మేనిఫెస్టో హామీని తక్షణమే జీవో రూపంలో అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతు కూడగట్టడం ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యం. **ఆగస్టు 23చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభ:** జన జాగరణ యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో మలిదశ చైతన్యంతో ఆగస్టు 23న హైదరాబాద్ నడిబొడ్డున చలో హైదరాబాద్ పేరిట 2.6లక్షలాదిమందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభ ద్వారా సిపిఎస్ విధానంవల్ల రిటైర్డ్ ఉద్యోగులు పడుతున్నవేదనను, సమస్య తీవ్రతను ప్రభుత్వానికి కళ్లకుకట్టేలా వివరించి, పాత పెన్షన్ జీవోసాధన దిశగా అంతిమపోరాటం చేయనున్నారు. ●

**(రచయిత : రాష్ట్ర అధ్యక్షులు, టిఎస్‌సిపిఎస్‌ఈయు)**

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కరూర్ బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

## నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి విజయ్

## ఆ ఘటన తనకు మానని గాయమైందన్న తమిళ సిఎం



శుక్రవారం కరూర్‌లో బాధితులకు ఉద్యోగనియామకపత్రాలు అందజేస్తున్న తమిళ సిఎం విజయ్

**కరూర్,జులై 10:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక (కంపాషనేట్ అపాయింట్‌మెంట్) ఉత్తర్వులను అందజేశారు. కరూర్ ఘటన తన హృదయంలో ఇప్పటికీ మానని గాయంగా మిగిలిపోయిందని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు.గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కరూర్‌లో నిర్వహించిన టీవీకే ఎన్నికల ప్రచార సభలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రస్తుతం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ కొనసాగుతోంది.ఈ ఘటన అనంతరం తమిళనాడు ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా, టీవీకే పార్టీ అదనంగా రూ.20 లక్షల పరిహారాన్ని అందించింది.బాధిత కుటుంబాల పునరావాస చర్యల్లో భాగంగా సీఎం విజయ్ కరూర్‌కు వెళ్లి అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక ఉత్తర్వులను పంపిణీ చేశారు. అట్లాస్ అరేనాలో నిర్వహించిన కార్యక్రమంలో 32 బాధిత కుటుంబాలకు చెందిన ఒక్కో సభ్యుడికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలను అందజేశారు. అయితే ఇదే సమయంలో బాధిత కుటుంబాలకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ విచారణ చేపట్టింది. ప్రస్తుతం లబ్ధిదారులకు తాత్కాలిక నియామకాలు మాత్రమే ఇవ్వాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. "నా హృదయంలో నిలిచిపోయిన కరూర్ సోదర, సోదరీమణులందరికీ నా హృదయపూర్వక అభివాదాలు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మనసులోని గాయాలు, బాధలు ఎప్పటికీ మరచిపోలేం. ఎన్నోకష్టాలు, మానసిక వేదనలు దాటుకుని ఈరోజు మీ ముందుకు వచ్చాను" అని అన్నారు. కరూర్ ఘటన నాకు తీవ్ర మనోవేదన కలిగించింది. అక్కడ నా సోదరులను, సోదరీమణులను, అమాయక చిన్నారులను కోల్పోయాను. ఆ విషాదం నా గుండెల్లో ఇప్పటికీ మానని గాయంగా ఉంది. ఆ ఘటనకు నేనే బాధ్యుడిగా చూపించే ప్రయత్నం చేశారు. కానీ ప్రజల కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా శాశ్వత పరిష్కారం తీసుకురావడమే నా లక్ష్యమని విజయ్ స్పష్టంచేశారు. ప్రతిపక్షాలపై కూడా సీఎం విజయ్ విమర్శలు గుప్పించారు. శాసనసభలో పార్టీ ఫండ్ అనే పదం ప్రస్తావనకు రాగానే ప్రతిపక్ష సభ్యులు సభనుంచి బయటకు వెళ్లిపోయారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ శాఖల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, అవినీతి గణనీయంగా తగ్గాయని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని మరోసారి పునరుద్ఘాటించిన సీఎం విజయ్, మాజీముఖ్యమంత్రి సి.ఎన్. అన్నాదురై జయంతి సందర్భంగా జన్మించిన శిశువులకు మేనమామ తరఫున బంగారుఉంగరం బహూకరించే పథకాన్ని కూడా హామీఇచ్చినట్లుగానే అమలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమం చివర్లో బాధిత కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు పంపిణీ చేయగా, ఈచర్య ద్వారా కుటుంబ పోషకులను కోల్పోయిన వారికి దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.



# పేలుళ్లతో దద్దరిల్లిన ఇరాన్

## తమకు సంబంధం లేదన్న అమెరికా

**టెహ్రాన్, జులై 10:** ఇరాన్‌లో గురువారం సాయంత్రం నుంచి పలుచోట్ల భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని స్థానిక వార్తా సంస్థలు, అధికారులు ధ్రువీకరించారు. ఇరాన్‌లోని అణు విద్యుత్ ప్లాంట్ ఉన్న బుషెహర్ వద్ద సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. ఈ విషయాన్ని అక్కడి పొలిటికల్ అండ్ సెక్యూరిటీ గవర్నర్ ఇసన్ జహానియన్ వెల్లడించారు. మరోవైపు కొనారాక్‌లోని నేవల్ జోన్‌లో శత్రు దేశ ఫైటర్ జెట్లు రెండు విడతల్లో దాడులు చేసినట్లు ఇరాన్ అధికారి మహమ్మద్ యూనిస్ హక్కానీ పేర్కొన్నారు. అయితే అమెరికా మాత్రం ఈ దాడులతో తమకు సంబంధం లేదని పేర్కొంది. తమ దళాలు తాజాగా ఎటువంటి దాడులు నిర్వహించలేదని తేల్చి చెప్పింది. ఇక ఇజ్రాయెల్ అధికారి ఒకరు అమెరికా మీడియా సంస్థతో మాట్లాడుతూ దాడుల్లో తమ మిలిటరీ ప్రమేయం ఉన్నట్లు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. మరి తాజా దాడులకు పాల్పడింది ఎవరనే అంశంపై స్పష్టత రాలేదు. ఇరాన్ మాత్రం అమెరికా-ఇజ్రాయెల్ హస్తంఉండొచ్చని చెబుతోంది. అమెరికా గురువారం తెల్లవారుజామున చేసిన దాడుల్లో కూడా బుషెహర్‌ను లక్ష్యంగా చేసుకొంది. ఈ సమయంలో అణుప్లాంట్‌ను టార్గెట్ చేసినట్లు ఇరాన్ ఆరోపించింది. గురువారం మొత్తం 90 లక్ష్యాలపై దాడి చేసిన విషయం తెలిసిందే.

# తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత

## వాళ్ల బాగోగులు చూడకపోతే ఆస్తులు వెనక్కి

## బాంబే హైకోర్టు కీలక తీర్పు!



**ముంబై, జులై 10:** తల్లిదండ్రుల నుంచి ఆస్తులు పొంది వారి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా, అశ్రద్ధతో వ్యవహరించే పిల్లలకు కనువిప్పు కలిగేలా బాంబే హైకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. వృద్ధాప్యంలో తమను చూసుకుంటారనే షరతుతో ఆస్తిని పిల్లలకు బదిలీ చేసినతల్లిదండ్రులు, ఆ షరతును కనుక పిల్లలు నెరవేర్చకపోతే వారు తమ ఆస్తిని తిరిగి వెనక్కి తీసుకోవచ్చునని బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. తల్లిదండ్రులు ఆర్థికంగా స్థితిమంతులైన ప్పటికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. లోయర్ పారెల్‌లోని ఫ్లాట్‌ను తన 68 యేండ్ల తండ్రికి స్వాధీనం చేయాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ 42యేళ్ల వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర ఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రాథమిక సౌకర్యాలు, శారీరక అవసరాలు కల్పిస్తాననే షరతులో ఆస్తి బదిలీ జరిగి, అలా చేయడంలో విఫలమైతే, ఆ బదిలీని రద్దు చేసే అధికారం ట్రిబ్యునల్‌కు ఉందని సీనియర్ సిటిజన్స్ చట్టం, 2007 సెక్షన్ 23 చెబుతున్నదని పేర్కొన్న హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ పిటిషనర్ వాదనను తిరస్కరించింది.

# కేతన్ హత్యకేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు ఏర్పాటు చేయాలి

## రాష్ట్రపతికి లేఖరాసిన పుణే వ్యాపారి కేతన్ అగర్వాల్ తండ్రి



**పుణె,జులై 10:** నగరానికి చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసును త్వరగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని, ఈ కేసు త్వరగా ముందుకు సాగేలా సహాయం చేయాలని ఆయన కోరారు. కొడుకును పోగొట్టుకున్న 20 రోజుల్లోనే తాను తండ్రిని కూడా కోల్పోయానని, తమకు న్యాయం చేయాలని ఆయన భావోద్వేగంతో రాష్ట్రపతికి లేఖ రాశారు. కేతన్ మరణాన్ని తట్టుకోలేక అతడి తాత గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి సెక్రటరీకి పంపిన విశాల్ అగర్వాల్ బుధవారం పంపిన ఈమెయిల్‌లో తమ కుమారుడు మరణం తర్వాత కుటుంబం ఎదుర్కొంటున్న బాధను పంచుకున్నారు. ఓ వ్యాపారవేత్తగా లేదా ప్రభావశీలవ్యక్తిగా తాను ఈ లేఖ రాయడం లేదు. కేవలం ఒకతండ్రిగా ఆవేదనతో ఈ లేఖ రాస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కేతన్ అంటే తన తండ్రికి ఎంతో ఇష్టమని, ఎంతగానో ప్రేమించే మన వడు మరణంతో ఆయన మనోవేదనకు గురై గుండెపోటుతో చనిపోయారని అన్నారు. తమ కుటుంబానికి ఇది తీరని వేదనను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ కేసును విచారించేలా చూడాలని, దోషులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చూడాలని విశాల్ కోరారు.

# ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: ఇజ్రాయెల్




**టెల్ అవీవ్,జులై 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ మరోసారి కుట్ర పన్నుతోందని అమెరికాను ఇజ్రాయెల్ హెచ్చరించిందన్న సమాచారం వైరల్ అయింది. అందుకే ట్రంప్ ఇరాన్‌పై దాడులు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం ఇజ్రాయెల్ ఇటీవల పెంటగాన్‌కు అందించిన నిఘా నివేదికలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను ఇజ్రాయెల్ అగ్రరాజ్యానికి అందజేసింది. అయితే ఈ సమాచారాన్ని అమెరికా నిఘా సంస్థలు ఇప్పటివరకు స్వతంత్రంగా నిర్ధారించలేదని తెలుస్తోంది. ఇజ్రాయెల్ హెచ్చరికకు ముందు అలాంటి కుట్రపై తమ వద్ద స్పష్టమైన ఆధారాలు లేవని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. కొంతమంది అమెరికా అధికారులు మాత్రం ఈ హెచ్చరిక వెనుక మరో కోణం ఉండొచ్చని భావిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌పై మరింత సైనిక చర్యలకు ట్రంప్‌ను ఒప్పించే ప్రయత్నంలో భాగంగానే ఇజ్రాయెల్ ఈ సమాచారం ఇచ్చి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇరాన్ మాత్రం చాలా కాలంగా ట్రంప్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని బహిరంగంగానే హెచ్చరిస్తూ వస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన అగ్ర కమాండర్ ఖాసీ సులేమానీ హత్యకు అమెరికానే కారణమని టెహ్రాన్ ఆరోపిస్తోంది.

# అయోధ్య విరాళాల చోరీ కేసు: 13న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ, జులై 10:**అయోధ్య రామాలయం విరాళాల చోరీపై నమోదు అయిన పిటిషన్లపై జులై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జులై7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది.

# కరిగిపోతున్న అమర్‌నాథ్ మంచులింగం

**శ్రీనగర్,జులై 10:** శతాబ్దాలుగా కోట్ల మంది హిందువులు అత్యంత పవిత్రంగా పూజించే అమర్‌నాథ్ గుహలోని సహజసిద్ధ మంచు లింగం (బాబా బర్ఫానీ) యాత్ర ప్రారంభమైన కేవలం ఐదు రోజుల్లోనే 90 శాతానికిపైగా కరిగిపోవడం కలకలం రేపుతోంది. ఈ నెల 3న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్రకు భక్తులు రికార్డు స్థాయిలో తరలివచ్చారు. అయితే, యాత్ర మొదలైన మొదటి వారంలోనే మంచు లింగం దాదాపు అదృశ్యమవడంతో దర్శనానికి వస్తున్న భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ మార్పుపై పీడీపీ నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ సామాజిక మాధ్యమ వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తూ, గుహ పరిసరాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రోజుకు కేవలం 10వేలమంది భక్తులను మాత్రమే అనుమతించాలనే నిబంధన ఉన్నప్పటికీ, మొదటి నాలుగు రోజుల్లోనే ఏకంగా 93వేల మందికి పైగా భక్తులు గుహను సందర్శించారు. అధికారిక నమోదు లేకుండా వస్తున్న వేలాది మంది అదనపు భక్తుల వల్ల అక్కడి మౌలిక వసతులపై, పర్యావరణంపై తీవ్ర ఒత్తిడిపెరుగుతోందని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా ఆందోళన వ్యక్తంచేశారు. అమర్‌నాథ్ మంచు లింగం ఇంత వేగంగా కరిగిపోవడానికి గ్లోబల్ వార్మింగ్ (భూతాపం),మానవ కార్యకలాపాలే ప్రధానకారణాలని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్లఎత్తులో ఉన్న ఈ గుహ పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. గతంలో 2018, 2020, 2022 సంవత్సరాల్లోనూ మంచు లింగం త్వరగా కరిగినప్పటికీ ఈసారి కేవలం ఐదు రోజుల్లోనే కరిగిపోవడం పర్యావరణ విపత్తుకు అద్దం పడుతోంది.



# మేఘాలయ హనీమూన్ హత్య కేసు నిర్దోషినని సుప్రీంలో సోనమ్ వాదన

**న్యూఢిల్లీ, జులై 10:** మేఘాలయ హనీమూన్ హత్య కేసులో తనను తప్పుగా ఇరికించారని ప్రధాన నిందితురాలు సోనమ్ రఘువంశీ సుప్రీంకోర్టుకు తెలిపారు.మేఘాలయలో హనీమూన్ సందర్భంగా తన భర్త రాజా హత్య కేసులో ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీ, తాను నిర్దోషినని సుప్రీంకోర్టులో వాదించారు. రాష్ట్ర హైకోర్టు మంజూరు చేసిన తన బెయిల్‌ను రద్దు చేయాలన్న మేఘాలయ ప్రభుత్వ అభ్యర్థనను వ్యతిరేకిస్తూ ఆమె అఫిడవిట్ దాఖలు చేశారు. తనను తప్పుగా ఇరికించారని, ప్రాసిక్యూషన్ కేసు కేవలం అనుమానం, పరిస్థితులపైనే ఆధారపడి ఉందని సోనమ్ తన అఫిడవిట్‌లో ఆరోపించారు. ఆమెకు బెయిల్ మంజూరు చేయాలన్న హైకోర్టు నిర్ణయాన్ని మేఘాలయ ప్రభుత్వం సవాలు చేయగా, సుప్రీంకోర్టు సోనమ్ అభ్యర్థనను విచారించింది. హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఆమె ఇప్పటికే విడుదలయ్యారని పేర్కొంటూ, ఆమె బెయిల్‌ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిలు మంజూరు చేయడానికి హైకోర్టు చెప్పిన కారణాలపై ధర్మాసనానికి సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఈ దశలో జోక్యం చేసుకోకూడదని నిర్ణయించుకుంది. విచారణ సందర్భంగా, తన అరెస్టుకు గల కారణాలను తనకు తెలియ జేయలేదని, సరైన న్యాయ సహాయం నిరాకరించారని సోనమ్ తరఫు న్యాయవాది వాదించారు. గతంలో బెయిలు దరఖాస్తుల సమయంలో దిగువ కోర్టులలో ఈ అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మేఘాలయ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఈకేసు 'దిగ్భ్రాంతికరమ్', పథకం ప్రకారం జరిగిన హత్యఅని, అరెస్టు పత్రాలలో జరిగిన ఒక అక్షర దోషం కారణంగా బెయిలు మంజూరు చేశారని వాదించారు. హత్యకు సంబంధించిన సెక్షన్ 103కు బదులుగా, అరెస్టు మెమోలో పొరపాటున భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 403ను పేర్కొన్నారని మెహతా వివరించారు. ఇది కేవలం ఒక గుమాస్తా పొరపాటు అని, దీనివల్ల నిందితురాలికి ఎలాంటి నష్టం జరగదని ఆయన వాదించారు. ఇలాంటి పొరపాటు అరెస్టును రద్దు చేయగలదా? బెయిలు మంజూరును సమర్థించగలదా? అనే విషయాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించవచ్చని కూడా సుప్రీంకోర్టు సూచించింది.

# శబరిమల కానుకల లెక్కింపుపై హైకోర్టు కీలక ఆదేశాలు

**తిరువనంతపురం, జులై 10:** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల మదింపు, భద్రతకు సంబంధించి కేరళ హైకోర్టు తాజాగా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 80 బస్తాలలో భద్రపరిచిన అయ్యప్పస్వామి బంగారు, వెండి కానుకల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెటి శంకరన్‌కు అవసరమైన అన్ని సహాయ సహకారాలుఅందించాలని బోర్డును కోర్టు ఆదేశించింది. ప్రత్యేక కమిషనర్ సమర్పించిన నివేదికను పరిశీలిస్తూ జస్టిస్ వి.రాజా విజయ రాఘవన్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. జులై 4న నిర్వహించిన తనిఖీల్లో ఆ 80 సంచులలో కేవలం బంగారం, వెండి మాత్రమే కాకుండా ఇతర సామగ్రి కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో, విలువ లేని వస్తువులను ముందుగా వేరు చేస్తే తప్ప అసలైన కానుకల విలువను నిర్ధారించడం సాధ్యం కాదని నివేదిక పేర్కొంది. ఈ వేరుచేసే ప్రక్రియకు, మదింపునకు పూర్తి సహకారం అందిస్తామని దేవస్థానం బోర్డు కోర్టుకు హామీ ఇచ్చింది. భవిష్యత్తులో స్వీకరించే విలువైన కానుకలను సురక్షితంగా భద్రపరచడానికి అనుసరించబోయే శాశ్వత విధానాన్ని తమకు తెలియజేయాలని బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆలయానికి వచ్చే కానుకలను క్రమానుగతంగా మదింపు చేసి, ఒక సమగ్రమైన డిజిటల్ ఇన్వెంటరీ ద్వారా నమోదు చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది.



# డిజిటల్‌రైల్వే టికెట్లు బుక్‌చేసిన మొబైల్‌లోనే చూపించాలి

**న్యూఢిల్లీ,జులై 10:** భారతీయ రైల్వే శాఖ డిజిటల్ అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల విషయంలో ప్రయాణికులకు కీలక స్పష్టతనిచ్చింది. రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసుకున్న డిజిటల్ టికెట్లను ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బుకింగ్ చేసిన మొబైల్ ఫోన్‌లోనే చూపించాలని స్పష్టం చేసింది. టికెట్ స్క్రీన్‌షాట్లు, పీడీఎఫ్ కాపీలు లేదా వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫార్వార్డ్ చేసిన కాపీలు చెల్లవని తేల్చి చెప్పింది. వీటిని ప్రయాణానికి సరైన ఆధారాలుగా పరిగణించబోమని రైల్వే అధికారులు వెల్లడించారు. డిజిటల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఇటీవల ఓ ప్రయాణికుడు వాట్సాప్ స్క్రీన్‌షాట్ చూపించగా, అధికారులు అతడికి జరిమానా విధించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రయాణికులు రైలు బయలుదేరక ముందే టికెట్ బుక్ చేసుకోవాలని, ప్రయాణ సమయంలో టికెట్ బుక్ చేసిన ఫోన్‌తో పాటు తప్పనిసరిగా అసలు గుర్తింపుకార్డును వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. రైల్వేశాఖ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులందరికీ ఒకరే టికెట్లు బుక్‌చేసే సందర్భాల్లోనూ, సాంకేతిక పరిజ్ఞానంలేని వృద్ధుల ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే సాధకబాధల గురించి పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసిన వ్యక్తి ప్రయాణంలో లేకపోతే ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రయాణికుల ఆందోళనలపై రైల్వే శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రైల్ వన్‌యాప్‌లో డిజిటల్ పద్ధతిలోఅన్‌రిజర్వ్‌డ్ టికెట్లుకొనుగోలు చేస్తే 3శాతంరాయితీ లభిస్తున్నప్పటికీ, తాజాగా ఈ నిబంధన అనేక మందికి ఇబ్బందికరంగా మారింది.

# గురుగ్రామ్‌లో ఎన్‌కౌంటర్ నలుగురు క్రిమినల్స్ హతం

**గురుగ్రామ్,జులై 10:**ఢిల్లీసమీపంలోని గురుగ్రామ్‌లో గురువారం రాత్రి పోలీసులు, నేరస్థుల మధ్య ఫైరింగ్ జరిగింది. సుమారు 60 రౌండ్ల పాటు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆ ఘటనలో నలుగురు నేరస్థులు మృతిచెందగా, ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. గురుగ్రామ్‌లోని సుశాంత్ లోక ఫేజ్‌లో ఆ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం రాత్రి 9.30 నిమిషాలకు క్రైం బ్రాంచ్ పోలీసులు సమాచారం అందుకున్నారు. ఓ స్కార్పియో ఎస్‌యూవీలో సాయుధ వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. ఆ ఇంటెలిజెన్స్ ఆధారంగా క్రైం బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సువాంత్ లోక్ ఫేజ్‌లో ఉన్న ఓ వ్యాపారి ఇంటి వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. విదేశాల్లో ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ వ్యాపారి నుంచి బెదిరింపుకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అనుమానిత నిందితులను పోలీసులు చుట్టుముట్టారు. లొంగిపోవాలని ఆదేశించారు. కానీ నిందిత వ్యక్తులు విచక్షణారహితంగా ఫైరింగ్ చేశారు. ఆ కాల్పులకు కౌంటర్‌గా పోలీసులు ఫైరింగ్‌కు దిగారు. దీపక్ నందల్ గ్యాంగ్‌కు చెందిన షూటర్లు ఈ కాల్పుల్లో పాల్గొన్నారు. అందరికీ గాయాలు అయినట్లు తెలిసింది. ఓ ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కానీ నలుగురు మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. అయిదో వ్యక్తి మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు గురుగ్రామ్ పోలీసులు కూడా గాయపడ్డారు. వాళ్లను కూడా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# ఉత్తరాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## విరిగిపడుతున్న కొండచరియలు

## పెద్దసంఖ్యలో సాధారణ ప్రజలు మృతి

**న్యూఢిల్లీ,జులై 10:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కొండ చరియలు విరిగిపడగా పలువురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. యూపీలోని సంత్ కబీర్ నగర్, కుషినగర్, బులంద్ షహర్, షమ్లీ, ఘజియాబాద్ లలో వర్షాల కారణంగా కొందరు మరణించారు. భారీ వర్షాల ధాటికి నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండగా కొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 16 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవ్వగా సూరత్ లో రోడ్లు జలమయమై వాగులను తలపిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు అలకనంద, మందాకిని నదులు పొంగి పొర్లు తుండగా మరోసారి అతిభారీ వర్షాల హెచ్చరికలు రావడంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలో స్కూళ్లను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్ లో 75 ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమవ్వగా 29 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వర్షాలు, గాలులకు పాడైనట్లు గుర్తించారు. భారీ వర్షాల నేపథ్యంలో చార్ ధామ్ యాత్రకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరకాశి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో గంగోత్రి హైవే మూసుకుపోయింది. ఉత్తరప్రదేశ్ లోనూ నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఘజియాబాద్, మీరఠ్, హాపూర్, బులంద్ షహర్, బాఘ్ పత్, ముజఫర్ నగర్, మొరాదాబాద్ జిల్లాల్లో స్కూళ్లకు ముందుగానే సెలవు ప్రకటించారు. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.



# సంక్షిప్త వార్తలు

## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు

**క్యీవ్,జులై 10:** రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ దాడులను ముమ్మరం చేసింది. రష్యాలోని స్టావ్‌రోపోల్, ట్వెర్, ఉఫా ప్రాంతాలతో పాటు క్రిమియాలోని కీలక చమురు పంపింగ్ స్టేషన్‌లను తమ దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించడానికి మాస్కో నిరాకరిస్తుండడం వల్లే ఈ దాడులు పెంచామని, రష్యా వెనక్కి తగ్గే వరకు ప్రతిరోజూ అక్కడ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తామని ఆయన హెచ్చరించారు.

## డిజిటల్ సంతకాలు వీసాలకు చెల్లవు..

**న్యూఢిల్లీ, జులై 10:** హెచ్1బీ వీసా పిటిషన్లు, గ్రీన్ కార్డ్ దరఖాస్తులు సహా ఇమిగ్రేషన్ ప్రయోజన అభ్యర్థనలపై దరఖాస్తుదారులు ఎలా సంతకం చేయాలన్న విషయమై అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) శుక్రవారం నుంచి కొత్త నిబంధనలను అమలుకు తెచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం చేతిరాతతో చేసిన సంతకాలు లేదా నకలు సంతకాన్ని(రీప్రొడ్యూస్డ్ సిగ్నేచర్) మాత్రమే అధికారులు స్వీకరించనున్నారు. కాపీ పేస్ట్ చేసిన సంతకం, ఆటో జనరేటెడ్ లేదా అనధికార సంతకంతో కూడిన దరఖాస్తును అధికారులు తిరస్కరిస్తారు.

## చైనా మెగా ప్రాజెక్టుకు భూకంపాల ముప్పు

**బీజింగ్,జులై 10:** బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ స్థాయిలో నిర్మిస్తున్న మెగా హైడ్రోపవర్ ప్రాజెక్టు భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ డ్యామ్ నిర్మాణ ప్రాంతం కింద ఒక క్రియాశీలక ఫాల్ట్ లైన్ ఉన్నట్లు చైనాకు చెందిన జియాలజిస్టులే స్వయంగా హెచ్చరించారు. దీనివల్ల ఆ ప్రాంతంలో భూకంపాలు సంభవించే, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని వారి అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక గత నెలలో ప్రచురితమైంది.

## బాలీవుడ్ నటుడికి 3నెలల జైలు



**న్యూఢిల్లీ, జులై 10:** బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు చెక్ బౌన్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు మూడునెలల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు విధించిన ఆరునెలల శిక్షను హైకోర్టుతగ్గించింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పు వెలువరించారు. అయితే, తీర్పు అమలుపై రెండునెలల స్టే విధించి, ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం కల్పించారు. ఈ తీర్పుపై రాజ్‌పాల్ యాదవ్ స్పందిస్తూ,ప్రస్తుతం నాదగ్గర డబ్బులేనందున జైలుశిక్ష అను భవించాల్సి వస్తోందన్నారు.

## ఎయిర్‌రూటులో తరలిస్తున్న కొకైన్ పట్టివేత

**న్యూఢిల్లీ,జులై 10:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్‌ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు.

## సర్ ఫారాలు నింపేందుకు డబ్బు డిమాండ్!

**రాంచి,జులై 10:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పత్రాల పంపిణీ కోసం బూత్ స్థాయి అధికారిణి (బీఎల్‌వో) డబ్బులు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీనితో పాటు డబ్బులు తీసుకుని సర్ ఫారాలు నింపుతున్న సైబర్ కేఫ్‌పై ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు.జార్ఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. గర్వా జిల్లాలో బీఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్న జమీలా బీబీ,సర్ ఫారాల పంపిణీ, పూరించడం, స్వీకరించడం కోసం రూ. 50 నుంచి రూ.100 వరకు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు.

## ఫోర్జరీ పత్రాలతో ఉద్యోగాలు పొందిన టీచర్ల తొలగింపు

**పాట్నా,జులై 10:**బీహార్ విద్యాశాఖ రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. నకిలీ పట్టాలు, ఫోర్జరీ చేసిన విద్యా ధ్రువీకరణ పత్రాలను సమర్పించి మోసపూరితంగా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సంపాదించిన 3,035మంది టీచర్లను విధుల్లోంచి తొలగించింది. 2006నుండి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయుల నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ బ్యూరో గత కొంతకాలంగా లోతైన దర్యాప్తు చేపట్టింది. ఈ సుదీర్ఘ విచారణ ముగిసిన తర్వాత విజిలెన్స్ బ్యూరో సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ భారీ చర్యలకు విద్యాశాఖ పూనుకుంది.

## బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జగన్ భారీ దోపిడి

• స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో మాజీ సిఎం జగన్ రాయలసీమ యువతకు ఉపాధి ఇస్తాననే భ్రమ కల్పించి భారీ దోపిడీ చేశారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని పరిశ్రమలకు భూ కేటాయింపుల పేరుతో క్విడ్ ప్రోకో ద్వారా జగన్ కోట్లు దండుకున్నారని ఆరోపించారు. బ్రాహ్మణి స్టీల్స్‌కు 14 వేల ఎకరాల ప్రజల సొత్తు, ప్రభుత్వ భూమిని కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. కేటాయించిన భూములను రూ.350 కోట్లకు తాకట్టు పెట్టి భారీ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు.
రెడ్ గోల్డ్ ఎంటర్‌ప్రైజెస్, ఆర్ఆర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జగతి పబ్లికేషన్స్‌కు రూ.44 కోట్లు, ఇందిరా టెలివిజన్‌కు రూ.30 కోట్లు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని పట్టాభి ప్రశ్నించారు. జగన్ లూటీకి గురైన 14 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని పట్టాభి వివరించారు. నాడు పరిశ్రమల పేరుతో జగన్ లూటీ చేస్తే.. నేడు పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి విప్లవాన్ని తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వమని తెలిపారు. కియాతో ప్రారంభమైన పారిశ్రామిక ప్రగతి.. నేడు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిట్టల్ వంటి గ్లోబల్ సంస్థల పెట్టుబడులతో కొనసాగుతోందన్నారు. లూటీకి ప్రతీక జగన్ అయితే.. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలకు ప్రతీక చంద్రబాబు అని కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు.

## విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం

• వంద శాతం ఆన్‌లైన్ బిల్లు చెల్లింపులే ఎస్‌పిడిసిఎల్ లక్ష్యం: సిఎండి శివశంకర్



**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోంది. డిజిటల్ యుగానికి అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత సరళతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపు విధానంతో పాటు అధికారిక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, వేగవంతమైన, సురక్షితమైన, పారదర్శకమైన చెల్లింపు వ్యవస్థను అమలు చేస్తోంది. ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, డైనమిక్ క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర), నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించవచ్చు. అంతేకాకుండా మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ వినియోగ వివరాలు, గత బిల్లు చెల్లింపుల చరిత్రను తెలుసుకోవడంతో పాటు కొత్త విద్యుత్ సేవలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించబడింది. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 61.32 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు సంస్థ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తోంది. ప్రతి నెలా సుమారు రూ.520 కోట్ల విలువైన విద్యుత్ బిల్లులను వినియోగదారులు చెల్లించడం జరుగుతోంది. ప్రస్తుతం మొత్తం బిల్లుల్లో 49.50 శాతం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ శాతాన్ని దశలవారీగా 100 శాతానికి పెంచడమే సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా సంస్థ పలు చర్యలు చేపడుతోంది. ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలు (ఇఆర్‌ఓలు)లో కూడా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం కల్పిస్తోంది. బిల్లుల వసూళ్లలో పారదర్శకతను మరింత పెంపొందించేందుకు, నగదు లావాదేవీలను తగ్గించేందుకు దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే ప్రక్రియను అమలు చేస్తోంది.

**వినియోగదారుల్లో చైతన్యం:** 'విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. విద్యుత్ బిల్లుల వసూళ్లలో పారదర్శకత పెంపొందించడంతోపాటు వంద శాతం డిజిటల్ చెల్లింపులను అమలు చేయాలని అన్ని జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఈ లక్ష్యంతో దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే చర్యలు కొనసాగుతున్నాయి. డిజిటల్ చెల్లింపుల సందర్భంగా గుర్తు తెలియని లింకులు, సందేశాలు లేదా నకిలీ యాప్‌లను నమ్మి మోసపోవద్దు. విద్యుత్ బిల్లులను ఎస్‌పిడిసిఎల్ అధికారిక మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాలని వినియోగదారులను కోరుతున్నాం. సురక్షితమైన, వేగవంతమైన, పారదర్శకమైన సేవల కోసం వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలి' అని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

## మామిడి రైతుకు ప్రభుత్వం అండ

• తోతాపురి రైతుకు సబ్సిడీ అందించడంతో అర్హులైన ప్రతి రైతుకు న్యాయం: చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, జులై 10 ప్రభాతవార్త:** తోతాపురి మామిడి సాగు చేసి నష్టపోయిన అర్హులైన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల మేరకు సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తోతాపురి మామిడి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు వుండదని, గ్రామసభలు, క్షేత్రస్థాయి పరిశీలన, గత ఏడాది వివరాలు, రైతుల ధృవీకరణ, పంట ఈకెవైసి నమోదు వంటి అంశాల ఆధారంగా అర్హులైన రైతులను గుర్తించడం జరుగుతుందన్నారు. మామిడి పంట నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మామిడి రైతులకు సబ్సిడీ పంపిణీ రాష్ట్ర ప్రభుత్వ విధానాల ప్రకారం జరుగుతుందని, అర్హులైన రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.
గ్రామ స్థాయిలో అధికారులు సమగ్రంగా వివరాలు సేకరించి అర్హులైన జాబితాను సిద్ధం చేస్తారన్నారు. అలాగే అంతర్జాతీయ పరిస్థితులు, ఎగుమతుల మందగమనం, పల్ప్ పరిశ్రమల్లో కొనుగోళ్లు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్న మామిడి రైతులకు అండగా నిలవడానికి ఈ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్ళి చర్చించడం జరిగిందన్నారు. సిఎం ఆదేశాల మేరకు తోతాపురి కేజీకి రూ.4 కనీస మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశంలో మామిడి గుజ్జు తయారీ, ఎగుమతులకు చిత్తూరు ప్రధాన కేంద్రంగా వుండటంతో సుమారు 35 వేల రైతు కుటుంబాలు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నా యన్నారు. తోతాపురి సాగుకు సంబంధించిన సమస్యలను అధ్యయనం చేసి తగిన పరిష్కారాలను సూచించడానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఐసిఎఆర్ నియమించిన నిపుణుల బృందం శుక్రవారం జిల్లాలో పర్యటిస్తోందన్నారు.





## ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు ఉపసంహరించాలి

• సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నేతలు డిమాండ్

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు ప్రశ్న రావణ్‌పై మోపిన ఉపా చట్టం కేసు తక్షణమే ఉపసంహరించాలని సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే ప్రయత్నం జరుగుతోందని, ప్రశ్నించే వారిపైన, విమర్శించే వారిపైన కేసులు మోపుతూ కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని, ఇటీవల కాలంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అనేక పరిణామాలు జరగడంపై సమావేశంలో విపక్షాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యల్ని పక్కదారి పట్టించేందుకుగానే ప్రశ్న రావణ్‌పై అక్రమ కేసులు మోపి, జైలుకు పంపారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, వైసిపి, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు, రిటైర్డ్ ఐఎఎస్, ఐపిఎస్‌లు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల నేతలు, జర్నలిస్టులు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై ముక్తకంఠంతో ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం, రాజద్రోహం కేసులు మోపడాన్ని తప్పుపట్టారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేలా కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతోందని నేతలు ధ్వజమెత్తారు.
రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వందలాదిగా ఉన్న యూట్యూబర్ల వాక్ స్వాతంత్రానికి, భావజాలానికి భంగం కలిగేలా పాలకులు వ్యవహరించడం దుర్మార్గమని తప్పుపట్టారు. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఎవరైనా మితిమీరి వ్యవహరిస్తే చట్టాలు ద్వారానే ఎదుర్కోవాలని సూచించారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు నమోదుతో భవిష్యత్తులో మరిన్ని కేసులు నమోదయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉపా చట్టం కేసు ఉద్దేశ్యం పూర్వకంగాను, కావాలనే రావణ్‌ను జైలుకు పంపాలనే పెట్టిన కేసేనని తేల్చిచెప్పారు. సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ప్రజలను డైవర్షన్ చేసేందుకు రావణ్‌పై రాజకీయ కుట్రలకు పాల్పడ్డారని, తక్షణమే ఉపా కేసు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రసంగాన్నే ప్రశ్న రావణ్ అనుకరించారనీ, కానీ పవన్‌లా ప్రశ్న రావణ్ చెప్పు చూపించలేదన్నారు. దీంతో ముందస్తుగా పవన్‌పైనే కేసు పెట్టాలన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం కేసు నమోదు అన్యాయం, అక్రమం, దారుణమని ఖండించారు. ఈ కేసు ముగిసేవరకు వైసిపి పక్షాన ప్రశ్న రావణ్‌కు అండగా నిలుస్తామని, విపక్షాలు చేసే ఉద్యమంలో భాగస్వాములవుతామని స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షోపన్యాసం ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉపా చట్టాన్ని ఈ నెల 17వ తేదీలోపు ఉపసంహరించుకోకపోతే ఆ తదుపరి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బి.రామకృష్ణ, సిపిఐ(ఎంఎల్) ఎంఎల్ లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, ఎస్‌యుసిఐ నాయకులు అమర్‌నాథ్, ఎంసిపిఐ(యు) నాయకులు ఖాదర్ భాషా, పిసిసి ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ, జర్నలిస్టులు డానీ, అమరయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, రిటైర్డ్ సిఐ సాల్మన్‌రాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రానాయక్, రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, తాటిపాక మధు, విసికె పార్టీ నాయకులు వెంకట్రాముడు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, సిహెచ్. వెంకటసుబ్బయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వలరాజు, బందెల నాసర్‌జీ, ఉపాధ్యక్షులు సాయి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్‌కె సుభాని, నాయకులు లంకా గోవిందరాజులు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఎపి మహిళా సమాఖ్య కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నాయకులు ఓర్సు భారతీ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, నాయకులు బి.రాయప్ప, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ అఫ్సర్ తదితరులు హాజరయ్యారు.

## 'రావణ్‌కు ఏ విధంగా జగన్ మద్దతిస్తున్నారు'



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశద్రోహానికి పాల్పడిన రావణ్‌కు మాజీ సిఎం జగన్ ఏ విధంగా మద్దతు ఇస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, దేశద్రోహ శక్తుల తరఫున వాదనలు వినిపించడంపై ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. రాజ్యాంగం, చట్టం, దేవతలపై కనీస గౌరవం లేకుండా మాట్లాడే వారిని వైసిపి సమర్థించడం సభ్యసమాజం తలదించుకునే చర్యగా ఆయన అభివర్ణించారు. కులాల, ప్రాంతాల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించి సమాజాన్ని ఇబ్బంది పెట్టేలా వైసిపి వ్యవహరిస్తోందని ఆరోపించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులకు నెలనెలా ముడుపులిచ్చి, ప్రజాప్రభుత్వంపై బురదజల్లేలా సంఘ విద్రోహ శక్తులను తయారు చేస్తున్నారంటూ వైసిపి నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు వారు రాక్షసుల్లా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని విధ్వంసానికి ప్లాన్ గీసి, తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆరోపించారు.

## తిరుమల సమాచారం



## మళ్లీ కొండ కిటకిట

• వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వారాంతం... వరుససెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. వరుసగా రెండవ శనివారం, ఆదివారాలు సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. గత మూడురోజులు నుండి కొనసాగుతున్న ఈ రద్దీ శుక్రవారం కూడా యధావిధిగా ఉంది. సాయంత్రానికి భక్తులు వెలుపల క్యూలైన్లలో ఐదుకిలోమీటర్ల వరకు బారులు తీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 45వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. గురువారం రాత్రి వరకు 70,141మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు అవస్థలు వర్ణనాతీతం. 'ఏడుకొండలవాడా... ఆపదమొక్కుల వాడ అనాథరక్షకా' గోవింద అంటూ తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో గదుల కోసం నిరీక్షణ తప్పడం లేదు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి జితిన్ రామ్



**శ్రీకాళహస్తి, జులై 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శుక్రవారం కేంద్ర సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్‌రామ్ మాంఝి పూజలు జరిపించుకున్నారు. కేంద్ర మంత్రికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయన ఆలయ ప్రాశస్త్యం గురించి వవేదపండితులను అడిగి తెలుసుకున్నారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సి.నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఎపిఆర్‌ఓ సుబ్రమణ్యం, తహాశీల్దార్ టివి సుబ్రమణ్యం, సహాయ తహాశీల్దార్ అనిల్ కుమార్‌లు పర్యవేక్షించారు.

## కొండపై కష్టాలకు చెక్ ఎప్పుడు?

### అలిపిరి వద్ద ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు 'బ్రేక్' పడిందా!

• తిరుమల శ్రీవారి భక్తుల్లోనూ వీడని సందేహాలు






**తిరుమల, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆపద మొక్కులవాడు... అనాథ రక్షకుడు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజు రోజుకూ రెట్టింపవుతున్న నేపథ్యంలో కొండపై దర్శనాలతో బాటు వసతి సౌకర్యం గగనంగా మారింది. రోజువారీగా 40వేల మంది భక్తులు పెరిగితేనే తిరుమలలో వసతి దొరకడం క్లిష్టసమస్య. ఈ నేపథ్యంలో దేశవిదేశాల నుండి వస్తున్న భక్తులకు కొండపై కష్టాలు తొలగించి తిరుపతి అలిపిరి వద్ద ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటుచేయాలని ఏడాదిన్నర క్రిందటే ప్రతిపాదనలు సిద్ధమైనా... టిటిడి పాలక మండలి ఆమోదించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చ లేదు. ఇందుకోసం అలిపిరికి సమీపంలోని ఎస్వీ శిల్ప కళాశాల స్థలంతోబాటు పరిసరాలను ఎంపికచేశారు. ఈ స్థలంలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటుతో కొండపై భక్తుల కష్టాలకు కొంత వరకు చెక్‌పెట్టవచ్చని భావించారు. అయితే ఈ ప్రతిపాదనలు వెనుక స్థల గ్రహణం పట్టిందనేది టిటిడి వర్గాల్లో దుమారం. ఈ సమయంలో కొండకు వచ్చే భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. సాధారణరోజుల్లోనూ 90వేలమంది వరకు భక్తులు వస్తుండగా వారాంతం, వరుస సెలవులు, ప్రత్యేక పర్వదినాల్లో 1.50లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తుండటం తెలిసిందే. వచ్చిన భక్తులకు దేవుని దర్శనం సకాలంలో చేయించే మాట ఎలా ఉన్నా కనీసం ఉండటానికి గది కూడా దొరకదంటే ఆశ్చర్యంలేదు. ఆలయం వెలుపల కిలో మీటర్లు బారులు తీరుతున్న సామాన్యభక్తులకు తాగు నీరు, అన్నప్రసాదాలు కూడా అందకపోవడం మరో విశేషం. తిరుమలకొండపై రద్దీని నియంత్రించేం దుకు వీలుగా తిరుపతి అలిపిరిలోనే బేస్‌క్యాంప్ ఏర్పాటు చేయాలనేది టిటిడి అధికారుల ఆలోచన. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌తో యాత్రికులను అలిపిరిలోనే బసచేసేలా చర్యలు తీసుకునే వీలుకలుగుతుంది. అయితే ఇలా ఇప్పటికీ ఈ పనులకు కార్యాచరణ అమలుకాలేదు.

**తిరుమల విజన్ 2047 అమలు ఇలాగేనా!?:** తిరుమల విజన్ 2047 అమలు చేయడంలో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి, దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి అలిపిరి వద్ద బేస్‌క్యాంపు (ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్)ఏర్పాటుకు సుమారు 15 హెక్టార్ల విస్తీర్ణం స్థలం ఎంపిక చేసింది. ఈ స్థలంలో ప్రస్తుతం శిల్పకళాశాల నడుస్తుండటంతో దాన్ని మరోచోటికి తరలించి కాలుష్యం కూడా ఉండదని భావించారు. అయితే ఈ పనులకు ఇప్పటికీ అడుగడుగునా గ్రహణం పట్టింది. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటైతే అలిపిరి వద్దే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అన్ని సమకూర్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి, అధికారులు కూడా సూచనప్రాయంగా అంగీకరించారు. లక్షమంది వరకు తిరుమలకు భక్తులు వస్తుండటంతో ఉన్న వసతి, దర్శనం కష్టంగా మారింది. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 24 గంటల నుండి 30గంటల సమయం కూడా పడుతోంది. రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నాయ చర్యలు, నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందనే భక్తుల సూచనలతో అలిపిరిలోనే టౌన్‌షిప్‌కు మార్గం అన్వేషించారు. తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేల మంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌలిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో బేస్ క్యాంపు అవసరాన్ని గుర్తించారు. అలిపిరి పాత చెక్ పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకుని ఇందుకు శ్రీకారం చుట్టాలనేది ఆలోచన.

**టౌన్‌షిప్‌తోనే యాత్రికులకు సకల సౌకర్యాలు:** అలిపిరి వద్ద టౌన్‌షిప్ ఏర్పాటుచేస్తే తిరుమలకొండపై కష్టాలు తప్పినట్లే. ప్రస్తుతం తిరుమలలో 7,700 గదులు, వెయ్యికిపైగా మఠాల్లోని గదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాల్లో 10వేల వరకు లాకర్లు సదుపాయం ఉన్నాయి. 50వేల మంది వరకు భక్తులకు వసతి పొందుతున్నారు. భక్తులు కొండకు చేరు కున్నా ఆరుబయట, ఖాళీస్థలాల్లో, ఉద్యానవనాల్లో విశ్రాంతి తీసుకోవడం, తలదాచుకోవడం జరుగుతుంది. తిరుపతికి చేరుకునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమ లకు వాహనాల కాలుష్యం నుండి రక్షణతోబాటు, పర్యావరణ పరిరక్షణకు సులభమవుతుంది. ఇంటి గ్రేటెడ్ టౌన్‌షిప్‌లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రణాళి కలు రూపొందించి ఆమోదించ దంతో టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది.

## తిరుపతిలో డ్రీమ్ చేజర్ ప్రొడక్షన్ చిత్రం



**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో సినిమాల షూటింగ్ మొదలైంది. యువ నటుడు, దర్శకుడు తిలక్ రాయల్ దర్శకత్వంలో డ్రీమ్ చేజర్ ప్రొడక్షన్ నం.1 బ్యానర్‌పై రూపొందుతున్న నూతన చిత్రం శుక్రవారం ఉదయం తిరుపతి కోనేటికట్ట వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ముహూర్త కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి సినీ నిర్మాత ఎన్.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టారు. బిజెపి నాయకుడు నవీన్ కుమార్‌రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి తొలి షాట్‌కు 'యాక్షన్' చెప్పి చిత్రీకరణకు శ్రీకారం చుట్టారు. ఈ చిత్రంలో తిలక్ రాయల్, లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, భూషణమణి, రేణుక, రుహిక అర్జున్, గగన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సహ దర్శకులుగా శ్రీనివాస్ విక్రమ్, రామేశ్వరం, అనిల్, సినిమాటోగ్రాఫర్‌గా భరత్, అసిస్టెంట్ డైరెక్టర్లుగా మాధురి, విష్ణు, షణ్ముగన్, మహేష్, నితీష్, విజయ్, ధనుష్ పనిచేస్తున్నారు. లైటింగ్ విభాగాన్ని కిరణ్, కార్తీక్, ఫైట్ మాస్టర్‌గా నవదీప్, సంగీత దర్శకుడిగా వివాన్ సూర్య, గేయ రచయితలుగా దినకర్, రవితేజ వ్యవహరిస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో చిత్ర ప్రారంభం జరగడం శుభసూచకమని, ఈ చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. నటుడు, దర్శకుడు తిలక్ రాయల్ మాట్లాడుతూ, చిత్ర ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో, పూర్తి నిబద్ధతతో చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే చిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమా నికి విశ్రాంత ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ డాక్టర్ జిఎస్ ప్రసాద్, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు పగడాల మురళి, బిజెపి నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం

• నిందితులు ఒడిశా, తమిళనాడు వాసులు

**కుప్పం, జులై 10 ప్రభాతవార్త:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో తాను, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, అర్బన్ ఎస్సైలు బాబు, రామకృష్ణ కలిసి కుప్పం పట్టణం రైల్వే స్టేషన్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా నలుగురు యువకులు కుప్పం రైల్వేస్టేషన్ అండర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కన్పించారన్నారు. వీరిని విచారించగా వీరి నుంచి ఆరు కిలోల గంజాయి లభ్యమైందన్నారు. పట్టుబడిన నిందితుల్లో ఒడిషా రాష్ట్రంకు చెందిన అలోక్ డిగల్ (20) సాయి డిగల్ (22), తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మౌలా (32), ప్రదీప్ (23) ఉన్నారన్నారు.
నిందితులనుంచి గంజాయితోపాటు ఓ మోటారు సైకిల్‌ను సైతం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.కుప్పం సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

### సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి రంగాలలో

## భారత్ పరుగులు

• 'ఐసర్ష్ వార్షికోత్సవంలో పలువురు వక్తలు



**శ్రీకాళహస్తి, జులై 10 ప్రభాతవార్త:** రెండు దశాబ్దాలుగా సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి రంగాలలో దేశం పరుగులు తీస్తుందని కేంద్ర రక్షణ పరిశోధన శాఖాదికారి డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్) ఏడవ స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఐఐటి, ఐసర్ ఒకేచోట ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండటం గర్వకారణం అన్నారు. దీని సాధనకు కృషి చేసిన నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనీయుడన్నారు. రక్షణ శాఖ భారత ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అత్యధిక యుద్ధవిమానాలు, రాడార్లు ఇతర రక్షణ సాంకేతికాలను అభివృద్ధిలో ప్రపంచంలోనే భారత దేశం ముందంజలో ఉందన్నారు. ఐసర్‌లో చదివిన విద్యార్థులు మంచి భవిష్యత్తుకు వెళ్ళాలి. తమ పరిశోధనల ఫలితాలను దేశ రక్షణకు ఉపయోగపడాలన్నారు. స్నాతకోత్సవంలో అండర్ గ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ మాస్టర్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 214మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఐఐఎస్ఇఆర్ తిరుపతి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ హరి ఎస్. భర్తియా స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. ఐఐఎస్ఇఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, రాష్ట్ర ప్రభుత్వ డి.ఎస్.టి కార్యదర్శి హెచ్ పురుషోత్తం, ఐఐటి తిరుపతి డైరెక్టర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ పాల్గొని, పట్టభద్రులను అభినందించారు.

## తండ్రి, సవతి తల్లి హత్య కేసులో కొడుకుకు జీవిత ఖైదు

**విజయనగరం, జులై 10 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా, బొండపల్లి పోలీసు స్టేషన్‌లో 2024 సంవత్సరంలో నమోదైన హత్య కేసులో నిందితుడు బొండపల్లి గ్రామం ఎస్.సి.కాలనీకి చెందిన డోల లక్ష్మణరావు (23)కు జీవిత ఖైదు, రూ.2000లు జరిమానా విధిస్తూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత తీర్పునిచ్చారు. డోల లక్ష్మణరావు తల్లి తన చిన్నతనంలోనే చనిపోగా అతని తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడు. సవతి తల్లి, తండ్రి నిందితుడిని ఎందుకు పనికిరాడని, ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మని నిత్యం హేళన చేసేవారన్నారు. దీన్ని భరించలేని నిందితుడు డోల లక్ష్మణరావు (23) 2024 ఫిబ్రవరి 23న కత్తితో తల్లితండ్రులను నరికి చంపేశాడు. బొండపల్లి విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి గజపతినగరం ఎస్ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేయగా, అప్పటి గజపతినగరం సిఐ ఎన్.వి.ప్రభాకరరావు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, సమర్ధవంతంగా దర్యాప్తు పూర్తి చేసారు. అనంతరం సిఐ జి.ఎ.వి.రమణ నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. కేసులో ప్రాసిక్యూషన్ విజయవంతంగా పూర్తి చేసి, న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశ పెట్టడం, నేరం రుజువు కావడంతో నిందితుడు డోల లక్ష్మణరావు (23)కు జీవిత ఖైదు, రూ.2000 జరిమానాగా విధిస్తూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత తీర్పు వెల్లడించినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడు శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టిన పబ్లిక్ ప్రాసిక్యూటరు జి.సత్యం పోలీసుల తరుపున వాదనలు వినిపించగా, అప్పటి గజపతినగరం సిఐ జి.ఎ.వి.రమణ, కోర్టు కానిస్టేబుల్ బి.రవి కుమార్, సి.ఎం.ఎస్. ఎఎస్ఐ పి.మల్లేశ్వరరావుల క్రియాశీలకంగా పని చేసారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.

## తెనాలిలో భార్యను చంపిన భర్త

**తెనాలి, జులై 10 ప్రభాతవార్త:** అక్రమ సంబంధం అనుమానంతో భార్యను భర్త కత్తితో నరికి చంపేశాడు. పోలీసుల కథనం ప్రకారం, అంగలకుదురులోని శ్రీనగర్ కాలనీలో నివసిస్తున్న నరేంద్రబాబు అలియాస్ నాని అనే వ్యక్తి తన భార్య సంధ్యారాణిపై అనుమానంతో గొడవపడ్డాడు. గొడవ తీవ్రమవడంతో కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ఆమెను అక్కడికక్కడే చంపాడు. మృతురాలిది నూజండ్లకు చెందిన మన్నే సంధ్యారాణిగా గుర్తించారు. నిందితుడు నరేంద్రబాబు తెనాలికి చెందినవాడు. వీరికి వివాహమై 10 ఏళ్లు అవుతుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. హత్య చేసిన తర్వాత నిందితుడు మృతురాలి జుట్టును కూడా కత్తిరించాడు. అనంతరం ఇంటికి బయట నుండి గడియ పెట్టి నేరుగా తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాడిన కత్తితో సహ లొంగిపోయాడు. సమాచారం అందుకున్న తెనాలి రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.

## చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్



**తిరుమల, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో యాత్రికుల ముసుగులో నేరాలకు పాల్పడుతున్న నిందితుడ్ని తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్దనుండి రూ.60వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఇటీవల కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈనెల 6వతేదీ జార్ఖండ్ కు చెందిన ఒక భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి దర్శనార్థమై తిరుమలకు వచ్చాడు. తిరుమలలోని ఎఎన్‌సి గది 414నిలో బస చేసి గదికి తాళం వేసి శ్రీవారి దర్శనానికి వెళ్ళారు. తిరిగి వచ్చే లోపు గదిచ కిటికీ ద్వారా ప్రవేశించి సుమారు 95వేల రూపాయలు నగదు చోరీ చేశారు. దీనిపై బాధితుడు తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాల ద్వారా ముద్దాయిని గుర్తించారు. తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఉప్పు గోవర్ధన్ (25) రెండు నెలల క్రితం తిరుమలలో శానిటేషన్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ దొంగతనానికి పాల్పడ్డాడు, ఇతడు గతంలో కూడా పలు దొంగతనం కేసులలో అరెస్టై విచారణ ఎదుర్కొంటున్నాడు. శ్రీవారి భక్తులు తాము తీసుకున్న వసతి గదుల నందు విలువైన వస్తువులు ఉంచి వెళ్ళవద్దని, గదులు, విడిచి వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలు సక్రమంగా తాళం వేసి వెళ్ళాలని కోరారు. విలువైన నగదు, ఆభరణాలు ఇతర విలువైన వస్తువులను నిరక్ష్యంగా ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## విజయవాడలో గంజాయి పట్టివేత, ముగ్గురు అరెస్టు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయిని పట్టుకున్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి పట్టుకున్నారు. విజయవాడలో ఈగల్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో 31.5 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## దుర్గమ్మ దర్శనానికి వెల్లువెత్తిన భక్తజనం



**ఇంద్రకీలాద్రి, జులై 10 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి శుక్రవారం భక్తులు వెల్లువలా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సహాయ కమిషనర్ రంగారావు క్యూలైన్ల నిర్వహణను క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. శుక్రవారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 30 గంటల వరకు అంతరాయ దర్శనం నిలిపివేశారు. అలాగే, ఇదే సమయంలో వీఐపీ దర్శనాలు అన్నీ కూడా పూర్తిగా నిలిపివేసి సామాన్య భక్తులకు పెద్ద పీట వేశారు.



**దుర్గమ్మ సేవలో హోం మంత్రి అనిత:** దుర్గమ్మని శుక్రవారం హోం మంత్రి అనిత దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీ రంగారావు, ధర్మకర్తలు మండల సభ్యులు బడేటి ధర్మరావు మంత్రికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం పలికారు.

**27 నుండి శాకంబరి ఉత్సవాలు:** ఆలయంలో 27 నుండి 29 వరకు శాకంబరి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ శాకంబరి మాతగా దర్శనమిస్తారని ఆలయంలోని మూలవర్లతో పాటు ఉపాలయాల్లో కూడా శాకంబరి అలంకరణ నిర్వహిస్తామన్నారు. సకల లోకాలు సుఖసంతోషాలతో వర్ధిల్లటానికి పాడిపంటలు సమృద్ధిగా పండడానికి, ఆకలి దప్పుల బాధలు రాకుండా శ్రీ అమ్మవారిని భక్తులు ప్రార్థిస్తారని తెలిపారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారెను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

# గోదావరి వరదలకు సన్నద్ధం

**● రుద్రమకోటలో ఎస్‌డిఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్ ● ప్రాణరక్షణ చర్యలపై ప్రత్యక్ష విన్యాసాలు**

**● వరద ప్రభావిత మండలాల్లో అప్రమత్తతకు అధికారుల పిలుపు**




**ఏలూరు, జులై 10 ప్రభాతవార్త బ్యూరో:** వర్షాకాలం నేపథ్యంలో గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు జిల్లా యంత్రాంగం ముందస్తు సన్నాహాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా వేలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామంలోని గోదావరి నది తీరంలో శుక్రవారం ఎపి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్), జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణనష్టం జరగకుండా వేగంగా స్పందించడం, నీటిలో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించడం, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం వంటి అత్యవసర పరిస్థితులను ఈ మాక్ డ్రిల్‌లో ప్రతిరూపంగా ప్రదర్శించారు. పడవలు, లైఫ్ జాకెట్లు, రెస్క్యూ తాళ్లు, ఇతర ఆధునిక పరికరాలను ఉపయోగించి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రత్యక్ష విన్యాసాలు చేసి సిబ్బందికి శిక్షణ ఇచ్చాయి. ఈ కార్యక్రమాన్ని వేలేరుపాడు తహసీల్దార్ శ్రీనివాసరావు, కుక్కునూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల సురేష్ బాబు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్ కుమార్ పర్యవేక్షించారు. పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ఎస్‌డిఆర్‌ఎఫ్ ప్రత్యేక బృందాలు పాల్గొని వరదల సమయంలో చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

**గోదావరి పరివాహక గ్రామాలపై ప్రత్యేక దృష్టి:** ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల గోదావరి పరివాహక గ్రామాలు వరదల ప్రభావానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాల కారణంగా గోదావరి నీటిమట్టం పెరిగితే ఈ ప్రాంతాల్లో అప్రమత్త చర్యలు అత్యంత కీలకంగా మారుతాయి. ఈ నేపథ్యంలో ముందస్తు సన్నాహాల్లో భాగంగానే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:** వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని అధికారులు సూచించారు. వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, విద్యుత్ తీగలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్థులు స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

**సమన్వయమే విజయానికి మూలం:** పోలీసు, రెవెన్యూ, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఇతర శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే విపత్తుల సమయంలో ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా సిబ్బందిలో అత్యవసర స్పందన సామర్థ్యం పెరగడంతో పాటు, విపత్తు నిర్వహణపై మరింత స్పష్టమైన అవగాహన ఏర్పడిందని పేర్కొన్నారు. వర్షాకాలం మొత్తం జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, అవసరమైతే తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు.

# స్వల్పకాలిక పంటలే సాగుచేయాలి

**● ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువే ● రైతులకు పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన**



**అనంతపురం, జులై 10 ప్రభాతవార్త బ్యూరో:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షపాతం, దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల రైతులు ముందస్తు సన్నద్ధతతో వ్యవసాయాన్ని చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లకుండా ఉలవలు, పెసలు, సజ్జలు లాంటి స్వల్పకాలిక పంటలు రైతులు వేసుకోవాలని, చెరువులు, చెక్ డ్యాములోని నీటిని వినియోగించుకుని పంట ఎండబెట్టకుండా ఉండేందుకు రెండు, మూడు రక్షకతడులను ఇవ్వాలని, రిస్క్ తగ్గించుకొనే పంటలు, పండ్ల తోటల సాగుకు రైతులు చొరవ చూపాలని శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. శుక్రవారం అనంతపురంలోని అక్సియన్ ఫ్రాటర్నా ఏకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అనంతపురం ప్రాంతంపై ఎల్‌నినో ప్రభావం' అంశంపై శుక్రవారం ఒకరోజు సదస్సులో ఈ మేరకు పలు సూచనలు చేశారు. ఆ డా. బండి వెంకటేశ్వర్లు, మాజీ డైరెక్టర్, ఐసిఎఆర్-క్రిడా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఎల్‌నినో ప్రభావం రుతుపవనాల అనంతరం కూడా కొనసాగవచ్చని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు వాతావరణ మార్పులకు అనుగుణమైన పంటల సాగు విధానాలను అనుసరించాలని, ప్రభుత్వం సకాలంలో తగినచర్యలు చేపట్టాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా దీర్ఘకాల, మధ్యకాల, స్వల్పకాల పంటలను సమన్వయంతో సాగు చేయాలని సదస్సు సిఫార్సు చేసింది. విత్తనాలు ఆలస్యమైతే ఉలవలు, పెసలు, మినుములు, చిరుధాన్యాలు వంటి కరువు తట్టుకునే పంటలను సాగు చేయాలని నిపుణులు సూచించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఏఆర్ఎస్), రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డా. ఎం. విజయ్ శంకర్ బాబు, ఎఎఫ్ ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి, రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం పండ్ల తోటల శాస్త్రవేత్త తిరుపతి రెడ్డి, బెంగళూరు ఐఐఎస్ఇ రిటైర్డ్ ప్రొఫెసర్ డా. ఎన్.హెచ్. రవీంద్రనాథ్, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ డా. టి.యలమందారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సాల్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డా. బి.ఎస్. సుష్మ (ఐఐఎస్‌సి), డా. ఎం.విజయ్ శంకర్‌బాబు, డా. జి.నారాయణస్వామి, డా. సి.రాధాకుమారి (ఏఆర్ఎస్, రేకులకుంట), రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సిఇఒ భానుజా, డా. చంద్రాయుడు (కెవికె, కళ్యాణదుర్గం), డా. హెచ్.ఎస్. నాయక్ (ఎల్ఆర్ఎస్, సిద్ధరాంపురం), నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ అనూరాధ, జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, ఎపిఎంఐపి, రైతు సాధికార సంస్థ, డబ్ల్యూఎంఎ, ఫౌండేషన్ ఫర్ ఎకాలజికల్ సెక్యూరిటీ, సేక్రీస్, సిసిడి, రెడ్స్, జన జాగృతి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూడు ఎక్సలెన్సీ సెంటర్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం

**● సిఎం చంద్రబాబు నాయుడు, సహచర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి డిఎస్‌బివి స్వామి**

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సాంఘిక సంక్షేమ ఆధ్వర్యంలో మూడు ఎక్సలెన్సీ సెంటర్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సహచర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి డా.స్వామి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా మధురవాడ, గుంటూరు జిల్లా తాడికొండ, తిరుపతి జిల్లా కోటలో ఎక్సలెన్సీ సెంటర్లు ఈ విద్యా సంవత్సరం నుంచే ఏర్పాటు చేయనున్నాం. ఎక్సలెన్సీ సెంటర్లలో విద్యార్థులకు ఇంటర్ తో పాటు ఐఐటీ, నీట్, జేఈఈకి ఉచిత శిక్షణ అందిస్తాం. ఒక్కో ఎక్సలెన్సీ సెంటర్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఎంపీసీ, బైపీసీలకు 150 మంది చొప్పున ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 300 మందికి ప్రవేశం కల్పిస్తాం. ప్రవేశాల్లో బాలికలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. ఈ ఎక్సలెన్సీ సెంటర్ల నిర్వహణకు టెండర్లు పిలిచి అర్హత కలిగిన వారికి అప్పగిస్తాం. పర్యవేక్షణ మాత్రం ప్రభుత్వానిదే. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని అందుకనుగుణంగా పేద విద్యార్థులకు కార్పొరేట్‌కి దీటుగా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.


# వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్న ప్రజా ప్రతినిధులు

**● నేతలకే మొదట కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్పీని కోరా ● రిజర్వేషన్ పోరాట సమితి నేతల బిసి నాగరాజు ఆవేదన**



**అనంతపురం, జులై 10 ప్రభాతవార్త బ్యూరో:** ప్రజా ప్రతినిధులే వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, రౌడీలను పెంచి పోషించే ప్రజా ప్రతినిధులకు మొదట కౌన్సెలింగ్ ఇవ్వాలని అనంతపురం జిల్లా ఎస్పీని కలిసి కోరినట్లు రిజర్వేషన్ పోరాట సమితి నేతల బిసి నాగరాజు డిమాండ్ చేశారు. ఇష్టాను సారం తిట్టుకునే నాయకులకే ఎమ్మెల్యేలు, ఎంపి టికెట్లను, ప్రధాన పార్టీల నేతలు చంద్రబాబు, జగన్ ఇస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. నేతలు ఇష్టాను సారం నోటికి వచ్చినట్లు మాట్లాడే వారి ప్రెస్‌మీట్లను మీడియా బాయ్‌కాట్ చేయాలని సమాజానికి నష్టం చేకూర్చే విధంగా ప్రజా ప్రతినిధులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ఆ భాషను సోషల్ మీడియా యదావిధిగా ప్రసారం చేస్తే సమాజానికి నష్టం చేసిన వారు అవుతారని ఈ విషయంలో సోషల్ మీడియా బాధ్యతగా వ్యవహరించాలని బిసి నాగరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చిన తర్వాత అక్కడే విలేకర్లతో మాట్లాడారు. తాడిపత్రి మొదలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజా ప్రతినిధులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పిజిఆర్‌ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని మాచవరం బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, జేసి ఇలక్కియా ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా రెవెన్యూ సేవలు, ప్రభుత్వ పథకాలు, ఉపాధి కల్పన, పోలీస్ శాఖకు సంబందించి మొత్తం 61 అర్జీలు రాగా వాటిని వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించామని, ఇప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నాణ్యమైన పరిష్కారం చూపిస్తున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జులై నెలలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగుచోట్ల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణలో భాగంగా గత వారం ఆలోనగర్‌లో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించామని వాటిలో చాలా వరకు పరిష్కారమైనట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం చొరవతో సూపర్ స్ట్రక్చర్ నుండి వందలాది కుటుంబాలకు ఊరట లభించిందన్నారు. మాచవరం జాగీర్దార్ పేరుతో 22ఏలో ఉన్న దాదాపు 80 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలు స్థానికంగానే పరిష్కారం లభిస్తుండటం పట్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## తొలి మోడల్ పుష్కర గ్రామంగా తీపర్రు

**● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త:** రాబోయే 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు నియోజకవర్గంలోని 'తీపర్రు' గ్రామాన్ని ఆదర్శ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తీపర్రు మోడల్ విలేజ్ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అదే విధంగా గోదావరి తీరంలో ప్రతి గ్రామంలో ఈ తరహా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 'మా గోదావరి సంక్రాంతి 2027' పేరిట రానున్న జనవరి నాటికి తీపర్రు నమూనాతో ముక్కామల, ముక్తేశ్వరం, కుండలీశ్వరం, కొవ్వూరు తదితర గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయనున్నామన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా అదే పుణ్య ఫలం లభిస్తుందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుష్కరాలకు ముందే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం సంకల్పం 'స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల్ను'ను క్షేత్రస్థాయిలో నిజం చేసే ఆదర్శ గ్రామంగా తీపర్రును నిలుపుతామని స్పష్టం చేశారు. మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షకు అనుగుణంగా తీపర్రు ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా ఎలా సిద్ధం చేయాలి? అలాగే 'నీర్తి' అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత ప్రాంతంగా ఎలా మార్చాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగా గ్రామ చెరువు పునరుద్ధరించడం, నీటి గుర్రపు డెక్క తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. గ్రామంలో ఫ్లెక్సీలు లేకుండా ప్లాస్టిక్ రహిత ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా యాత్రికులు, పర్యాటకులు తమ గోదావరి దర్శనాన్ని గుర్తుంచుకునేలా 'ఐ లవ్ గోదావరి మా తీపర్రు' పేరుతో రెండు సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 25 హోమ్ స్టేలకు సన్నాహాలు చేస్తామన్నారు.

## ఎస్ఐఆర్‌ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఆత్మకూరు (నెల్లూరు), జులై 10 ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. డిజిటలైజేషన్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటికే 84శాతం డిజిటలైజేషన్ పూర్తి కావడంపై లెక్టర్ అధికారులను అభినందించారు. మిగిలిన డిజిటలైజేషన్ ప్రక్రియను శని, ఆదివారాల్లో కూడా వేగవంతంగా పూర్తిచేయాలని బిఎల్‌ఒలు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జాడతెలియని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓటర్లు, డిజిటలైజేషన్ ప్రక్రియకు పూర్తి సహకారం అందించి తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ బి.పావని, తహసిల్దార్ పద్మజాకుమారి, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, ఎంపిడిఒ, ఇతర అధికారులు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## 'సర్' వేగవంతం చేయండి: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), జులై 10 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అలాగే 'సర్' ప్రోగ్రామ్‌ని త్వరితగతిని పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని ఆమె క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి అర్జీ సమస్యను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం కోవూరు నియోజకర్గంలో సర్ ప్రోగ్రామ్ పురోగతిని పరిశీలించారు. కోవూరు మండలంలో 75 శాతం, కొడవలూరులో 72.39, ఇందుకూరుపేటలో 72.2 శాతం, బుచ్చిరూరల్ 71.2 శాతం విడవలూరులో 67.54 శాతం పూర్తి కాగా బుచ్చి టౌన్‌లో కేవలం 63.4 శాతం మాత్రమే పూర్తి అయిందని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నాయకులందరు ఈకార్యక్రమంలో చురుక్కుగా పాల్గొని ఏ వార్డులో సర్ ప్రోగ్రామ్ వెనుక బడకుండా పూర్తి స్దాయిలో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, దొడ్ల కోదండరామిరెడ్డి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ఎం.వి శేషయ్య, మురళీ, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, క్లష్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బసవతారకం క్యాన్సర్ వైద్యశాల నిర్మాణాన్ని పరిశీలించిన గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త:** అమరావతిలో నిర్మితమవుతున్న బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ వైద్యశాలను గేట్స్‌ఫౌండేషన్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అర్చన వ్యాస్, సిఒఒ రావి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు ఛీఫ్‌జనరల్ మేనేజర్ బాలసుబ్రమణ్యం ప్రాజెక్టుకు సంబందించిన పలు వివరాలను అర్చనకు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలనిసంస్థ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తికి అర్చన సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఎందరో క్యాన్సర్ పేషంట్‌లకు సేవలు అందిస్తున్న బసవతారకం క్యాన్సర్ వైద్యశాల వైద్యులు, సిబ్బందితోపాటు సంస్థ చైర్మన్ నందమూరి బాలకృష్ణను ఈసందర్భంగా అర్చన అభినందించారు. వైద్యశాల ప్రాజెక్టు ప్రతినిధులు అర్చనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందచేసారు.

## పిఆర్‌సి అమలు కోసం 14న ర్యాలీ: ఆప్టా

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పిఆర్‌సి కమిటీ నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంజి మెహది ఒక ప్రకటన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన గళం వినిపించాలని పిలుపునిచ్చారు.

## కులమే లేని ఎఫ్ఐఆర్‌లో కులాన్ని అంటగట్టిన అడ్వకేట్ శ్రవణ్: కిరణ్ రాయల్

**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జనం కోసం, వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న డిసిఎం పవన్ కళ్యాణ్‌ని టార్గెట్ చేసే జోకర్లలో శ్రవణ్ ఒక్క జోకర్‌లా తయారయ్యాడని జనసేనపార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ఎద్దేవాచేశారు. కులమే లేని ఎఫ్ఐఆర్ లో కులాన్ని అంటగట్టిన అడ్వకేట్ శ్రవణ్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాయలసీమ రెడ్లను కాపులు అని అంటున్నారని, ఈ విషయంగా కావాలంటే విజయ్ సాయిరెడ్డి, జగన్మోహన్ రెడ్డిని అడిగి తెలుసుకో అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జడా శ్రవణ్ లిల్లీపుట్ కాదు సిల్లిపుట్ అని కామెంట్స్ చేశారు. సిల్లీ పుట్ శ్రావణ్ జైలుకి వెళ్లడానికి తహతలాడుతున్నాడని, రూ.25 కోట్లు ఎన్నికల్లో ఖర్చు పెట్టామని చెబుతున్న శ్రవణ్ ఆ రూ.25 కోట్లు ఎలా వచ్చాయనేది ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ వల్లే సుగాలిప్రీతి ఘటన భయటకు వచ్చిందని కిరణ్‌రాయల్ గుర్తుచేశారు. సిల్లీపుట్ అడ్వకేట్ జడా శ్రవణ్ పబ్లిసిటీ కోసమే పవన్ కళ్యాణ్ టార్గెట్ చేస్తూ.. డ్రామాలు ఆడుతున్నాడని కిరణ్ రాయల్ విమర్శించారు.


అంబరాన్నంటిన ఫ్రాన్స్ ఆనందం

# ఫ్రాన్స్ సెమీస్ హ్యాట్రిక్

**బోస్టన్, జులై 10:** నిరుటి రన్నరప్ ఫ్రాన్స్ సాకర్ వరల్డ్‌కప్-2026లో దూసుకుపోతోంది. 2022లో ఖతార్‌లో తృటిలో చేజారిన కప్‌ను ఈసారి సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగిన హాట్ ఫేవరెట్ ఫ్రాన్స్... ఆ దిశగా సెమీఫైనల్ చేరింది. బోస్టన్ వేదికగా జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై 2-0 గోల్స్‌తో చిత్తుచేసింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఈ ఘన విజయంతో ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీఫైనల్‌కు చేరిన జట్టుగా ఫ్రాన్స్ సరికొత్త రికార్డు సృష్టించింది.

### పెనాల్టీ మిస్ చేసిన ఎంబాపె

మ్యాచ్ ఆరంభం నుంచే ఫ్రాన్స్ మైదానంలో దూకుడు ఆట ప్రదర్శించింది. బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆటపై పట్టు సాధించింది. చివరకు 30వ నిమిషంలో ఫ్రాన్స్‌కు గోల్ చేసే అవకాశం చిక్కింది. మొరాకో డిఫెన్స్‌ను దాటుకుంటూ బాక్స్ లోపలికి దూసుకెళ్లిన ఎంబాపెను... ప్రత్యర్థి డిఫెండర్ నౌస్సైర్ మజ్రావోయి ప్రమాదకరంగా అడ్డుకున్నాడు. దీంతో రెఫరీ.. ఫ్రాన్స్‌కు పెనాల్టీ ప్రకటించారు. ఎంబాపె షాట్ కొట్టగా, మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో అద్భుతమైన డైవ్‌తో అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

### ఎంబాపె, ఉస్మాన్ డెంబెలే గోల్స్

రెండో అర్ధభాగంలో మొరాకో వ్యూహాత్మకంగా పుంజుకోవడానికి ప్రయత్నించింది.కానీ, ఫ్రాన్స్ ఆ జట్టును నిలువరించింది. 60వ నిమిషంలో ఎంబాపె... బాక్స్ పైభాగం నుంచి బంతిని నెట్ కార్నర్‌లోకి పంపాడు. ఈఅద్భుత గోల్‌తో ఫ్రాన్స్ 1-0ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత వేగంగా కదిలింది. మొరాకో జట్టు కోలుకునే లోపే ఉస్మాన్ డెంబెలే... డూయే అందించిన పాస్‌ను నెట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు రెండో గోల్ అందించాడు. రెండు గోల్స్‌తో వెనుకబడిన మొరాకో మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి తమ స్టార్ ఆటగాళ్లు సోఫియాన్ రహిమి, సోఫియాన్ అమ్రబాత్, జకారియా ఎల్ ఊహాదీలను సబ్‌స్టిట్యూట్‌లుగా రంగంలోకి దించింది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో మొరాకో గోల్ కోసం సర్వశక్తులూ ఒడ్డినా ఫలితం లేకపోయింది.



గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె

# నార్వేకు పరీక్ష.. ఇంగ్లాండ్‌కు సవాల్




**మియామి, జులై 10:** ఫిఫా ప్రపంచ కప్‌లో మరో ఆసక్తికర పోరు నేడు జరగనుంది.మియామివేదికగా జరగనున్న క్వార్టర్ ఫైనల్లో నార్వే, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి తర్వాత రెండున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల చూపంతా ఇప్పుడు ఈ మ్యాచ్‌పై నిలి చింది. మ్యాచ్ ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### సంచలనాల నార్వే

ఈ పోరు కేవలం రెండు జట్ల మధ్య పోటీ మాత్రమే కాదు,ప్రపంచంలోని అత్యుత్తమ స్ట్రైకర్లలో ఇద్దరైన ఎర్లింగ్ హాలాండ్, హ్యారీ మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక ద్వంద్వ యుద్ధంగా మారింది.ఇరు జట్లు ప్రి క్వార్టర్ ఫైనల్లో అద్భుత విజయాలు సాధించిన జోష్‌లో ఉండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. నార్వే ఈ టోర్నీలో అందరినీ ఆశ్చర్యపరిచింది.గ్రూప్-ఐలో ఇరాక్‌పై 2-0గోల్స్‌తో గెలుపు బోణీ చేసిన నార్వే... సెనెగల్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ చేతిలో 0-2తో ఓడింది. గ్రూప్-ఐలో ఫ్రాన్స్‌తో కలిసి నాకౌట్‌కు వచ్చిన నార్వే.... రౌండ్ ఆఫ్ 32లో ఐవరీకోస్ట్‌పై 2-1తో నెగ్గింది. ఇక ప్రి క్వార్టర్ ఫైనల్లో అయితే అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్లు బ్రెజిల్‌ను 2-1తో ఓడించి తొలిసారిగా క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఆ మ్యాచ్‌లో హాలాండ్ రెండు గోల్స్ చేసి నార్వే జట్టును ముందుండి నడిపించాడు.

### అనుభవమే అండగా ఇంగ్లాండ్

మరోవైపు హాట్ ఫేవరేట్లలో ఒకటైన ఇంగ్లాండ్...ఈ వరల్డ్ కప్‌లో స్థాయికి తగ్గ ఆటతీరు కనబరుస్తోంది. ఇప్పటివరకు అజేయంగా ఉంది. గ్రూప్-ఎల్‌లో పనామాపై 2-0గోల్స్‌తో, క్రొయేషియాపై 2-0గోల్స్‌తో నెగ్గిన ఇంగ్లాండ్... ఘనాతో గోల్ లెస్ డ్రా చేసుకుంది. గ్రూప్-ఎల్ అగ్రస్థానంతో నాకౌట్‌కు వచ్చిన ఇంగ్లాండ్... రౌండ్ ఆఫ్ 32లో డీఆర్ కాంగోపై 2-1తో గెలుపొందింది. ఇక అతిథ్య మెక్సికోను దాని సొంత గడ్డపై 3-2తో ఓడించి ఉత్కంఠ విజయంతో క్వార్టర్ ఫైనల్ వచ్చింది. కోచ్ థామస్ టుచెల్ వ్యూహాలు, కెప్టెన్ హ్యారీ కేన్ నాయకత్వం జట్టుకు పెద్ద బలంగా నిలుస్తున్నాయి.

### హాలాండ్ వర్సెస్ కేన్ హ్యారీ

ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణ హాలాండ్-కేన్ హ్యారే. హాలాండ్ ఇప్పటికే ఈ టోర్నీలో ఏడు గోల్స్ చేసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు కేన్ కీలక సమయాల్లో గోల్స్ సాధిస్తూ ఇంగ్లాండ్‌కు విజయాలు అందిస్తున్నాడు. ఇద్దరూ క్లబ్ ఫుట్‌బాల్ ఇంగ్లాండ్‌లోనే ఆడటం ఈ పోరుకు మరింత ఆసక్తి తీసుకొచ్చింది.

చరిత్ర పరంగా చూస్తే ఇంగ్లాండ్‌కే ఆధిక్యం ఉంది. ఇరు జట్లు ఇప్పటివరకు 12 సార్లు తలపడగా ఇంగ్లాండ్ ఏడు విజయాలు సాధించింది. నార్వే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. అయితే ఈసారి నార్వే గత రికార్డులను మార్చే సంకల్పంతో బరిలోకి దిగుతోంది.అనుభవం, సమతూకమైన జట్టు కూర్పు కారణంగా ఇంగ్లాండ్ స్వల్ప ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే హాలాండ్,ఓడెగార్డ్ వంటి ఆటగాళ్లు మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మలుపుతిప్పే సామర్థం కలిగి ఉండటంతో నార్వేను తక్కువ అంచనా వేయలేం.ఈమ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీస్‌లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. అందుకే ఈ క్వార్టర్ ఫైనల్‌ను అత్యంత ఆసక్తికర పోరుగా అభిమానులు ఎదురుచూస్తున్నారు.


# స్మృతి ట్రిపుల్ సెంచరీ; లార్డ్స్‌లో శతకం మిస్



**లండన్, జులై 10:**లార్డ్స్ వేదికగా భారత్ -ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది.భారత్ తరపున 300అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మూడో మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మంధాన.. ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 9 టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 లున్నాయి.మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా హర్మన్ ప్రీత్(374) అగ్రస్థానంలో ఉండగా..తర్వాత స్థానాల్లో సూజీ బేట్స్ (370), ఎలీస్ పెర్రీ(349), మిథాలీ రాజ్(333) ఉన్నారు.

కాగా సిడ్నీ టెస్ట్‌లో భారత్ విమెన్స్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 275 మార్కు దాటింది. స్మృతి మంధాన(108 బంతుల్లో 83) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. కెప్టెన్ హర్‌ప్రీత్(58), దీప్తీశర్మ (56) అర్ధసెంచరీలతో రాణించారు. జిమీ రోడ్రిగ్స్ 35 రన్స్ చేసింది.

## తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో జ్వెరెవ్



లండన్: జర్మనీ రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ప్రవేశించాడు. తొలి సెమీఫైనల్లో బ్రిటిష్ వైల్డ్‌కార్డ్ ఆటగాడు ఆర్థర్ ఫెరీని 7-6, 6-2, 6-4 తేడాతో ఓడించాడు. సొంతగడ్డపై ఫైనల్ చేరాలన్న ఫెరీ ఆశలకు బ్రేక్ వేశాడు. మొదటి సెట్ చెమటోడ్చి నెగ్గిన ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ జ్వెరెవ్... తరువాతి రెండు సెట్లను అలవోకగా కైవసం చేసుకున్నాడు. 2గంటల 14 నిమిషాల్లో మ్యాచ్ ముగించాడు. జ్వెరెవ్‌కు ఇది అయిదో గ్రాండ్ స్లామ్ ఫైనల్.

## భారత్‌లో బిగ్‌బాష్ లీగ్ ఆరంభ మ్యాచ్

**మెల్‌బోర్న్, జులై 10:** ఆస్ట్రేలియా టీ20 టోర్నీ బిగ్ బాష్ లీగ్ ప్రారంభ మ్యాచ్ డిసెంబర్ 12న చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరగనుంది.2026-27 సీజన్ మొదటి మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించబోతున్నట్లు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, భారత ప్రధాని మోడీ సంయుక్తంగా చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కోర్చర్స్ జట్లు తలపడతాయి. ఆస్ట్రేలియా వెలుపల జరగబోతున్న మొట్ట మొదటి బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ ఇదే.అలాగే భారత్‌లో నిర్వహించబడుతున్న తొలి విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించనుంది. మిగతా బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలోనే డిసెంబర్ 15 నుంచి యథావిధిగా జరుగుతాయి.

## ఫ్రాన్స్ కెప్టెన్ నయా చరిత్ర
## సెంచరీ క్లబ్‌లో ఎంబాపె


**బోస్టన్, జులై 10:** క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై చేసిన గోల్‌తో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపె అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో పలు మైలురాళ్లను అందుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నేరుగా 100 గోల్స్‌లో భాగస్వామ్యాన్ని పంచుకున్న మొదటి ఆటగాడిగా ఎంబాపె నిలిచాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఫ్రాన్స్ తరఫున ఇప్పటివరకు ఎంబాపె వ్యక్తిగతంగా 64 గోల్స్ చేశాడు. మరో 36గోల్స్‌కు అసిస్టులు అందించాడు. దీంతో 100 గోల్స్ మైలురాయిని కిలియన్ ఎంబాపె అందుకున్నట్లు అయింది.

సాకర్ ప్రపంచకప్‌లు (2018, 2022, 2026)లలో ఎంబాపె గోల్స్ సంఖ్య 20కి చేరింది. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ (21 గోల్స్) ఆల్ టైమ్ రికార్డుకు ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు. ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో ఎంబాపెకు ఇది 8వ గోల్. దీంతో మెస్సీతో కలిసి ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా గోల్డెన్ బూట్ రేసులో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## 7.26 బిలియన్ డాలర్లు పెరిగిన ఫారెక్స్ ఖజానా

**న్యూఢిల్లీ,జులై 10:** దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఈనెల3తో ముగిసిన వారంలో 7.26 బిలియన్ అమెరికన్ డాలర్లు పెరిగి 674.193 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 5.654 బిలియన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అయిన 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అనంతరం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు పెరగడం,రూపాయిపై ఒత్తిడి అధికమవడం వల్ల ఆర్‌బీఐ డాలర్ల విక్రయం ద్వారా విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు వరుస వారాల పాటు తగ్గుముఖం పట్టాయి.విదేశీ మారక నిల్వలను పరిరక్షించేందుకు విదేశీ పర్యటనలను తగ్గించాలని, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 11 నుంచి పలు సందర్భాల్లో దేశ ప్రజలకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.ఈనెల 3తో ముగిసిన వారానికి సంబంధించిన ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 4.51 బిలియన్ డాలర్లు పెరిగి 545.578 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అమెరికన్ డాలర్ల రూపంలో లెక్కించే ఈ విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్ స్టెర్లింగ్, జపాన్ యెన్ వంటి ఇతర ప్రధాన కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుంది.

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నికరలాభం 2020 కోట్లు




**ముంబై:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది.గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే బ్యాంక్ నికర లాభం 26.8శాతం పెరిగి రూ.1,593కోట్ల నుంచి రూ.2,020కోట్లకు చేరుకుంది. బ్యాంకు ప్రధాన ఆదాయమైన నికర వడ్డీ కూడా 14.5శాతంవృద్ధి చెంది రూ.3,292 కోట్ల నుంచి రూ.3,770 కోట్లకు పెరిగింది. రుణాలపై వచ్చే ఆదాయం స్థిరంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణమని బ్యాంకు తెలిపింది. ఆపరేటింగ్ పనితీరు కూడా మెరుగుపడింది. ఆపరేటింగ్ లాభం ఏడాది ప్రాతిపదికన 21.3 శాతం పెరిగి రూ.2,570 కోట్ల నుంచి రూ.3,117 కోట్లకు చేరుకుంది. ఇతర ఆదాయం 25 శాతం పెరిగి రూ.825 కోట్ల నుంచి రూ.1,029 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి వరుసగా రెండో త్రైమాసికంలోనూ 1.45 శాతం వద్దనే కొనసాగగా, నికర ఎన్‌పిఎలు కూడా 0.13 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి.ఈ త్రైమాసికంలో కేటాయింపులు రూ.840 కోట్లుగా నమోదయ్యాయి.గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.867 కోట్లు ఉండగా, గత త్రైమాసికంలో రూ.617 కోట్లుగా నమోదయ్యాయి.జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికంలో కోవిడ్19కు సంబంధించిన అత్యవసర ప్రొవిజన్లలో రూ.250 కోట్లను తిరిగి రద్దు చేసినట్లు బ్యాంక్ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది.

## ఐదు ఐపీవోలకు సెబీ గ్రీన్ సిగ్నల్




**ముంబయి,జులై 10:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా శుక్రవారం ఐదు కంపెనీల ఐపీవో ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. టోన్బో ఇమేజింగ్ ఇండియా లిమిటెడ్, మాగ్రీ రిటైల్ లిమిటెడ్, రెంటోమోజో లిమిటెడ్, జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్ లిమిటెడ్, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ లిమిటెడ్ సంస్థలకు సంబంధించిన డ్రాఫ్ట్ పత్రాలపై సెబీ అబ్జర్వేషన్ లెటర్ జారీ చేసింది. సెబీ పరిభాషలో ఇది తుది ఆమోదంగా పరిగణిస్తారు.జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్‌జెట్‌వర్క్ ఐపీవోలో తాజా ఈక్విటీ షేర్ల జారీ తో పాటు ప్రస్తుత వాటాదా రులు విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉండే అవకాశం ఉంది. ఐపీవో పరిమాణం, కంపెనీ విలువ వంటి తుది వివరాలు బుక్ బిల్డింగ్ ప్రక్రియ ద్వారా నిర్ణయించబడతాయి.కంపెనీలో ప్రస్తుతం ఖోస్లా వెంచర్స్, బైలీ గిఫోర్డ్, రాకేష్ గంగ్వాల్, యాక్సెల్, పీక్ శ్రీజు, గ్రీన్‌ఓక్, లైట్‌స్పీడ్ వంటి ప్రముఖ పెట్టుబడిదారులు ఉన్నారు. జెట్‌వర్క్ సాంకేతికత ఆధారిత తయారీ వేదికను నిర్వహిస్తోంది.

పరిశ్రమల నుంచి వచ్చే డిమాండ్‌ను వివిధ సరఫరాదారులు, తయారీ యూనిట్లతో అనుసంధానం చేస్తుంది. టోన్బో ఇమేజింగ్ ఐపీవోలో ప్రమోటర్ వాటాదారులు 19.60 లక్షల ఈక్విటీ షేర్లు, ప్రమో టర్ గ్రూప్ వాటాదారు 3.39 లక్షల షేర్లు, ఇన్వెస్టర్ వాటాదారులు 1.56 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు.ప్రస్తుతం అరవింద్ లక్ష్మీకుమార్, అంకిత్ కుమార్, సిసీలియా డిసౌజా సంస్థ ప్రమోటర్లుగా ఉన్నారు. ప్రపంచ రక్షణ రంగ ప్రాజెక్టులు, ఉత్పత్తుల రూపకల్పన, నిధుల సమీకరణలో వీరికి విశేష అనుభవం ఉంది. గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ ఐపీవోలో 65 లక్షల వరకు తాజా ఈక్విటీ షేర్ల జారీ, 1.32 కోట్ల వరకు ఈక్విటీ షేర్ల ఆఫర్ ఫర్ సేల్‌తో వస్తోంది. ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.10గా నిర్ణయించారు.





# స్టాక్ మార్కెట్లలో జోష్
## ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అన్ని రంగాల్లో కొనుగోళ్ల జోరుతో నిఫ్టీ 24,200 మార్క్‌ను అధిగమించి ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా మంచి ర్యాలీ నమోదు చేశాయి.ఎన్‌ఎస్‌ఈలోని రంగాల వారీ సూచీల్లో నిఫ్టీ ఎఫ్ఎంసీజీ మినహా మిగిలిన అన్ని సూచీలు లాభాల్లో ముగిశాయి.ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ షేరు 10శాతానికి పైగా పెరిగి నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీలో అగ్రగామిగా నిలిచింది. టీసీఎస్ జూన్ త్రైమాసిక ఫలితాలు అంచనాలకు మించి రావడం, ఐటీ రంగంలో డిమాండ్ మెరుగుపడుతున్నట్లు సంస్థ సంకేతాలు ఇవ్వడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

ముడి చమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 827.57 పాయింట్లు పెరిగి 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 244.10 పాయింట్లు లాభపడి 24,206.90 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1.35శాతం, నిఫ్టీ 1.33శాతం పెరిగాయి.రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.36 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.48 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.85 శాతం లాభపడటం నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచింది.విస్తృత మార్కెట్‌లో ప్రధాన సూచీల కంటే మెరుగైన ప్రదర్శన కనిపించింది. బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.40 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం పెరిగాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల ర్యాలీ స్పష్టంగా కనిపించింది.

ఎన్‌ఎస్‌ఈలో 2,339 షేర్లు లాభపడగా, 973 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 98 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.కమోడిటీలు, కరెన్సీ మార్కెట్‌సెప్టెంబర్ 2026 డెలివరీకి బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 10 సెంట్లు తగ్గి 76.20 డాలర్లకు చేరింది. భారత్ 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్ రిటర్నులు 6.754శాతం నుంచి 6.711 శాతానికి తగ్గింది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో డాలర్‌తోపోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 95.4700తో పోలిస్తే 95.3200వద్ద ట్రేడైంది. ఆగస్టు 5,2026 డెలివరీకి ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 0.74 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,44,222కు చేరింది. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన షేర్లుటాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు 0.90 శాతం పెరిగింది.ఇండియన్ బ్యాంక్ షేరు 10.11 శాతం ఎగసింది.బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2.43 శాతం లాభపడింది.ముత్తూట్ మైక్రోఫిన్ షేరు 13.19 శాతం జంప్ చేసింది.ఆనంద్ రాఠీ వెల్త్ 2.12శాతం పెరిగింది.హ్యుందాయ్ ఇంజినీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్ నుంచి అంతర్జాతీయ కాంట్రాక్టు దక్కడంతో అయాన్ ఎక్స్ఛేంజ్ ఇండియా షేరు 17.38శాతంఎగిసింది.నికర లాభం 59.9 శాతం తగ్గడంతో ఐమ్‌కో ఎలెకాన్ షేరు 1.72 శాతం పడిపోయింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ.18.54 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్ పొందడంతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేరు 2.31 శాతం పెరిగింది.సుమారు 51.98 మిలియన్ డాలర్ల విలువైన అంతర్జాతీయ ఆర్డర్ దక్కడంతో హెచ్ఎఫ్‌సీఎల్ షేరు 0.57 శాతం లాభపడింది. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో ప్రమోటర్లకు చెందిన 41.33 శాతం వాటాను రూ.1,550 కోట్ల నగదు ఒప్పందంతో కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో అపోలో మైక్రో సిస్టమ్స్ షేరు 2.57 శాతం పెరిగింది. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ షేరు 3.92 శాతం క్షీణించింది.

## ఐదేళ్లలో 5 వేలు జీసీసీలు సాధ్యమే



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ,జులై 10:** దేశంలో 2030 నాటికి ఐదువేల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యం సాధ్యమేనని, వాస్తవికమైనదేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీసీసీల తదుపరి విస్తరణ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా రెండు,మూడోశ్రేణి నగరాలకు విస్తరించడంపైనే ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. సీఐఐ నిర్వహించిన జాతీయ జీసీసీ బిజినెస్ సమ్మిట్‌లో ప్రసంగించిన కేంద్ర ఆర్థికమంత్రి.. ప్రపంచంలోని ఫార్చ్యూన్2000 కంపెనీలలో దాదాపు మూడింట రెండొంతుల సంస్థలు ఇంకా భారత్‌లో జీసీసీలను ఏర్పాటు చేయలేదని,దీంతో ఈ రంగంలో వృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పలు విధానపరమైన సంస్కరణలు జీసీసీల విస్తరణకు ఊతమిస్తాయని తెలిపారు.

ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ విధానాన్ని సరళీకరించడం, సేఫ్ హార్బర్ నిబంధనలను విస్తరించడం, అడ్వాన్స్ ప్రైసింగ్ మెకానిజాన్ని వేగవంతం చేయడం, సిటీ ఎకనామిక్ రీజియన్లు, యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు, అర్బన్ చాలెంజ్ ఫండ్ వంటి చర్యలు జీసీసీల పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడతాయని నిర్మలా సీతారామన్ చెప్పారు.జీసీసీలు కేవలం అగ్రశ్రేణి నగరాలకే పరిమితం కావొద్దని పేర్కొన్న సీతారామన్, చండీగఢ్, వారణాసి, విశాఖపట్నం వంటి నగరాలు కూడా జీసీసీ కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ప్రస్తుతం దాదాపు 10 రాష్ట్రాలు ప్రత్యేక జీసీసీ విధానాలను ప్రకటించాయని ఈ సదస్సులో 14కు పైగా రాష్ట్రాలు పాల్గొనడం ప్రాంతీయ ప్రభుత్వాల ఆసక్తిని ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు.విజ్ఞాన ఆధారిత పరిశ్రమలకు అనుకూలమైన ప్రత్యేక పారిశ్రామిక వాతావరణాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులతో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు.

దేశంలోని జీసీసీలు ఏటా సుమారు 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ఫోర్బ్స్ 2000 జాబితాలోని 500కుపైగా కంపెనీలున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీలలో దాదాపు సగం భారత్‌లోనే ఉండగా, రోజుకు సగటున ఒక కొత్త జీసీసీ దేశంలో ప్రారంభమవుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రారంభమవుతున్న కొత్త జీసీసీలలో సగానికి పైగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారితంగా పనిచేస్తుండటంవిశేషమని కేంద్రమంత్రి చెప్పారు.




## మ్యూచువల్ ఫండ్లలో 29వేల కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ,జులై 10:** దేశీయంగా చురుకుగా ఉన్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా ఆంఫీ విడుదల చేసిన డేటాచూస్తే జూన్‌లో యాక్టివ్ ఈక్విటీ ఫండ్లలో రూ.28,973.41 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మే నెలలో ఈ మొత్తం రూ.22,907.77 కోట్లుగా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన అత్యల్ప నెలవారీ ఈక్విటీ పెట్టుబడులు మే నెలలోనే నమోదయ్యాయి.మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో నికర ఉపసంహరణలు జూన్‌లో రూ.52,948.78 కోట్లకు తగ్గగా, మేలో అవి 64,021.17కోట్లుగా ఉన్నాయి. జూన్ నెలలో దాదాపు అన్ని ఈక్విటీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెరిగాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులను అత్యధికంగా ఆకర్షించాయి.

లార్జ్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.2,067.48 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మేలో ఈ మొత్తం రూ.1,592.93 కోట్లుగా ఉంది. మిడ్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.6,090.17 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మేలో ఇవి రూ.4,385.06కోట్లుగా నమోదయ్యాయి.స్మాల్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.5,601.96 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. అంతకుముందు నెలలో రూ.6,263.56 కోట్లుగా ఉండటంతో స్వల్ప తగ్గుదల కనిపించింది.ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.5,231.31 కోట్ల పెట్టుబడులు నమోదుకాగా, సెక్టోరల్, థీమాటిక్ ఫండ్లలో కూడా పెట్టుబడులు పెరిగి జూన్‌లో రూ.1,469.26 కోట్లకు చేరాయి. డెట్ మ్యూచువల్ ఫండ్లలో గత నెలలో రూ.1.09 లక్షల కోట్ల నికర విత్‌డ్రాలున్నాయి. ఓవర్‌నైట్ ఫండ్ల నుంచి జూన్‌లో రూ.10,579.58 కోట్లు విత్‌డ్రాకాగా లిక్విడ్ ఫండ్ల నుంచి రూ.42,293.29 కోట్ల నికర ఉపసంహరణలు నమోదయ్యాయి. హైబ్రిడ్, ప్యాసివ్ ఫండ్ల పరిస్థితిహైబ్రిడ్ పథకాలలో జూన్‌లో రూ.12,892.76కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మేలో ఇవి రూ.16,538.47 కోట్లుగా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శనివారం 11 జులై 2026 | I


# సీఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

## హెలిప్యాడ్, సభా వేదిక పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**రంపచోడవరం, జూలై 10: ప్రభాతవార్త.** రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 17న రంపచోడవరం పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని హెలిప్యాడ్ ల్యాండింగ్ ప్రాంతాన్ని, స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రంపచోడవరం పంచాయతీ పరిధిలోని "చెత్త నుండి సంపద" కేంద్రాన్ని సందర్శించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తయారైన ఎరువులను రైతులకు అందించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, అనుమతులు అందిన వెంటనే ప్రజలకు అధికారికంగా వెల్లడిస్తామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ చంద్రశేఖర్, డీఎల్పీఓ రాధాకృష్ణ, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, డీఈ భవాని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సమాచార హక్కు చట్టం పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

### రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చక్రవర్తి



**రాజమహేంద్రవరం సిటీ, జూలై( 10 ప్రభాతవార్త)** సమాచార హక్కు చట్టం పై ప్రజల్లో అవగాహన కల్పించి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ వి ఎస్ కే చక్రవర్తి సూచించారు. క్షేత్రస్థాయిలో సమాచార హక్కు చట్టం అమలు తీరును పరిశీలించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఆర్టిఐ దరఖాస్తులు రిజిస్టర్లు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత జవాబుదారితనాన్ని పెంపొందించేందుకు 2005 లో ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రతి భారతీయ పౌరుడు ప్రభుత్వ శాఖలు ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల నుంచి నిర్ణీత గడువులోపు సమాచారాన్ని పొందే హక్కు కలిగి ఉంటారని పేర్కొన్నారు. సమాచార చట్టం అమలులో అర్జీదారులు సంతృప్తి ఎంతో ముఖ్యమని అందుబాటులో ఉన్న సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందించడం పి ఐ ఓ ల బాధ్యత అన్నారు. ఒక దరఖాస్తు రెండో అప్పి లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే అది చట్టం అమలులో లోపం ఉన్నట్లుగా పరిగణించాల్సి ఉంటుంది అని పేర్కొన్నారు. అధికారులు బాధ్యతాయుతముగా వ్యవహరించి చట్టం ప్రకారం 30 రోజుల్లోపు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు విద్యాసంస్థల్లో కూడా ఆర్టిఐ సమాచార బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రదర్శించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజా ప్రయోజనాల పోస్ట్ కాకుండా వ్యక్తిగతత్వంతో సమాచారాన్ని కోరే వ్యక్తుల విషయంలో పి ఐ ఓ లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు ప్రజా సమాచార అధికారులు సహాయ ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్ పెట్టుబడులు పేరుతో మోసగించిన ఆల్మైటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్ల అరెస్టు

### అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దు ఏఎస్పి కిషోర్ కుమార్




**కాకినాడ రూరల్ జూలై 10 (ప్రభాతవార్త):** స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రతి నెల స్థిరమైన లాభాలు అందిస్తామని ఖాతాదారులను మోసగించిన ఆల్మైటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్లు పి. మోజేష్, లలితాంబికను సర్పవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూ. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15 వేల చొప్పున 10 నెలలు, రూ.12,500 చొప్పున మరో 10 నెలలు అసలు, లాభం కలిపి రూ.4 లక్షలు ఇస్తామని ఈ సంస్థ రూ.కోట్లలో సేకరించింది. కొన్ని నెలలు చెల్లించాక నిలిపేయడంతో ఇటీవల బాధితులంతా ఆల్మైటి జెనిసెస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆరుగురు ఖాతాదారులు సర్పవరం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో సర్పవరం పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో ఏ ఎస్ పి ఎం కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఖాతాదారులకు సుమారు రూ.37 కోట్ల మేర చెల్లింపులు నిలిపేసినట్లుమోజేష్ బ్యాంకు ఖాతాల్లో తగిన నిల్వలు లేకపోవడం, ఆస్తులు కనిపించకపోవడం ఖాతాదారులను మోసగించాలనే ఈ సంస్థను నడుపుతున్నారని బాధితులు ఫిర్యాదు చేయడంతో డైరెక్టర్లను అరెస్టు చేసి నిందితులను స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కాకినాడ ఎదుట హాజరు పరచున్నట్లు వెల్లడించారు. అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని ఏఎస్పీ కిషోర్ కుమార్ ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో సర్పవరం సిఐ సిహెచ్ ప్రకాష్, ఎస్సై లు ఎం ఏసుబాబు, జి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి హామీ అమలు.. కొత్త షెడ్లు ప్రారంభం



**రామచంద్రపురం,జూలై 10 (ప్రభాతవార్త):** ద్రాక్షారామం వ్యవసాయ మార్కెట్లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన 48 దుకాణాల బాధితులకు కేవలం పది రోజుల్లోనే నూతన షెడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు.కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనల మేరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షెడ్ల నిర్మాణం పూర్తిచేశారు.నూతన షెడ్లను ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ప్రకటించిన రూ.20 లక్షల సాయంతో పాటు దాతల సహకారంతో పునరావాస చర్యలు వేగంగా పూర్తయ్యాయని ఆయన తెలిపారు.ద్రాక్షారామం మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,వ్యాపారులు,దాతలు,బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

# డెంగ్యూ జ్వరాలపై అధికారుల అప్రమత్తం.

### డెంగ్యూ భయంతో ఉమ్మడివరంలో కొనసాగుతున్న మెడికల్ క్యాంపు.



**చింతూరు జూలై 10 ప్రభాత వార్త.** వి. ఆర్. పురం మండలం ఉమ్మడివరం గ్రామములో 11 మందికీ డెంగ్యూ పాజిటివ్ వచ్చిన విషయం అందరికి తెలిసిందే. కూనవరం మండలం కోతులు గుట్ట సిహెచ్ సి లో వైద్యం పొందుతున్న ఉమ్మడివరం గ్రామానికి చెందిన 11మంది డెంగ్యూ బాధితులను చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్ శుక్రవారం పరామర్శించారు. వారి యొక్క ఆరోగ్య స్థితిగతులను డాక్టర్ లను అడిగి తెలుసుకోవడంతో పాటు, బాధితుల యొక్క మెడికల్ రిపోర్టర్ ను పరిశీలించారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య సేవలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రాథమిక పరీక్షలో మాత్రమే డెంగ్యూ గా తేలిందని, పూర్తిస్థాయిలో తెలుసుకోవడం కోసం ఎలిసా పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సరిత నేతృత్వంలో వైద్య బృందం ఆ గ్రామాన్ని శుక్రవారం జల్లెడ పట్టింది. మొత్తం గ్రామములో ఉన్న 119 గృహాలకు చెందిన 398 మందికి ఆర్. డి టెస్టులను నిర్వహించారు. వారం రోజుల పాటు మెడికల్ క్యాంపు గ్రామములో కొనసాగించాలని అధికారులకు ఆమె అదేశాలు జారీ చేశారు. ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని, వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉందని, ఒక్క పోలవరం జిల్లాలో 5 లక్ష ఆర్ డి కిట్లు అందుబాటులో ఉన్నాయని, కోతుల గుట్ట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డెంగ్యూ భాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, దాదాపు అందరికి ప్లేట్ లెట్స్ 1.5 లక్షల పైనే ఉన్నటు ఆమె తెలిపారు.

# దోమల ఫారాలుగా మారుతున్న భవనాలపై మూతలు లేని నీటి ట్యాంకులు

## : భూతలంపై నిరుపయోగమౌతున్న దోమలపై దండయాత్ర

**వి.ఆర్.పురం,జూలై 10, ప్రభాతవార్త**

ప్రభుత్వాలు దోమల నిర్మూలన కోసం ప్రతీ ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ భూతలంపై దోమల నిర్మూలన కోసం దండయాత్ర చేస్తూనే ఉంది. అయిన ఏటేటా కాలంతో సంబంధం లేకుండా, దోమలు నిత్యం అంతటా స్వైర విహారం చేస్తూనే ఉన్నాయి. మలేరియా, డెంగీ లాంటి భయానక జ్వరాల బారినపడి ఏటేటా ఎందరో అమాయకులు తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోతూనే ఉన్నారు. నేలపై ఎక్కడ చూసిన నీటి గుంతలు, వాటిలో నీటి నిల్వలు ఉండటం లేదు. మరి ఈ దోమలు ఎక్కడి నుండి వస్తున్నాయి ?. అవి ఎక్కడ తమ సంతానోత్పత్తిని మూడు పువ్వులు, ఆరు కాయల చందంగా అభివృద్ధి చేసుకుంటున్నాయి, అని తలలు పట్టుకోవటం అధికారుల వంతవుతుంది. మన తలపైనే మనల్ని ఎక్కిరిస్తు, దోమలు దర్జాగా తమ సంతానోత్పత్తి చేసుకుంటున్నాయి. ఇది నమ్మలేకున్నా నగ్నసత్యం. ఇళ్ల పైకప్పుల్లోని మూతలు లేని నీటి ట్యాంకులు, హౌస్ లే ఇప్పుడు దోమల ఫారాలు....... సామాన్య ప్రజలతోపాటు, అవగాహన లేని, బాధ్యతలేని అధికారులు సైతం నేడు దోమలను పెంచి పోషిస్తున్నారు. తమ ఇంటిపై, కార్యాలయంపై ఉన్న నీటి ట్యాంకులకు పై మూతలు ఉన్నాయా?, లేవా అని చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. అలా మీ ఇంటిపై, లేదా మీరు పనిచేస్తున్న మీ శాఖ కార్యాలయం భవనాలపై మూతలు లేని నీటి ట్యాంకులు ఉన్నట్లయితే, వాటిపై వెంటనే మూతలు ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. అలా ఎంత మంది నేడు బాధ్యతగా నీటి ట్యాంకుపై మూతలు ఉన్నాయా ?, లేవా అని చూస్తున్నారు. లేవని తెలిస్తే, బాధ్యతగా వెంటనే నీటి ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేస్తున్నారు అన్నది ప్రశ్నార్థకం.




### ప్రభుత్వ, ప్రవేటు బడులు, కార్యాలయాలపై ఉన్న నీటి ట్యాంకులపై మూతలు ఉన్నట్లేనా......?

మలేరియా, డెంగీ, విషజ్వరాలు ఇలా ఎక్కడ ఏవి నమోదైన వైద్య ఆరోగ్య శాఖపై విమర్శల పరంపర కొనసాగుతుంటుంది. కాని దోమల నియంత్రణ కోసం మనమేం చేస్తున్నామని, ఎవరు తమను తాము ప్రశ్నించుకోరు. ఆత్మపరిశీలన అసలే చేసుకోరు. ప్రవేటు వ్యక్తుల ఇళ్లే కాదు, ప్రభుత్వ, ప్రవేటు బడులు, కార్యాలయాలపై ఉన్న నీటి ట్యాంకులపై మూతలు ఉన్నట్లేనా?, అని ఎవరు ఆలోచించటం లేదు. ఇక్కడే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ప్రతి పది భవనాలు నేడు మనం ఎక్కి చూస్తే ?, ప్రతీ పదింటిలో కనీసం 3,4 ట్యాంకులకు పైన మూతలు ఉండని పరిస్తితి నెలకొంది. ఇలా అయితే దోమల నియంత్రణ ఎలా సాధ్యమవుతుంది.



మలేరియా, డెంగీ ఎలా వస్తుంది, ఆ దోమలు ఎక్కడ గుడ్లు పెడతాయి.......

మలేరియా: ఇది 'ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల వస్తుంది. ప్లాస్మోడియం అనే పరాన్నజీవి మనిషి శరీరంలోకి ప్రవేశించి ఈ వ్యాధిని కలుగజేస్తుంది. ఈ దోమ తేట ని నీటిలోనే గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుంటుంది. ఇక డెంగ్యూ ఇది ఎడిస్ ఈజిప్టి'.దోమ కుట్టడం వల్ల వస్తుంది. ఈ దోమ సైతం తేట ని నీళ్లలో మాత్రమే గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుంటుంది. ఇంతటి ప్రమాదకరమైన , ప్రాణాంతకరమైన దోమలు గుడ్లు పెట్టి, సంతానోత్పత్తి చేసుకునే మన నీటి తోట్లను, ఇంటి పై కప్పిన ఉన్న నీటి ట్యాంకులు, హౌస్ లను మూతలు లేకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తే ఎలా, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడేస్తే ఎలా ప్రతీ ఒక్కరు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు వి.ఆర్.పురం మండలంలోని ఉమ్మడివరం అనే గిరిజన గ్రామంలో ఒకే విధిలో 12 మంది గిరిజనులు ఈ డెంగ్యూ జ్వరాల బారిన పడటానికి, ఎలాంటి నిర్లక్ష్యమే కారణం కావచ్చునటంలో ఎలాంటి సందేహం లేదు.

# పర్యాటక కేంద్రంగా పిచ్చుకలంక...

### ఈ నెల 13 న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక....

### పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం....

### అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బండారు...







**ఆత్రేయపురం, జూలై 10,(ప్రభాత వార్త)** ఈ నెల 13వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండల పరిధిలోని పిచ్చుకలంక పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆయన రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఆత్రేయపురం మండలం గోదావరి నది తీరాన ఉన్న పిచ్చుకలంక ప్రాంతంలో చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనుండటంతో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమ స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ. రాహుల్ మీన సంబంధిత శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, వీఐపీ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త ఊపును తీసుకురానుందని ఆయన పేర్కొన్నారు. పిచ్చుకలంక ప్రాంతం సహజసిద్ధమైన అందాలు, గోదావరి నది పరీవాహక ప్రాంత సౌందర్యంతో ప్రత్యేక గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనుల ద్వారా ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వి.వి. సత్యనారాయణ, తాసిల్దార్ ఆర్ డి. రామచంద్రమూర్తి, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, డి.ఎస్.పి సుంకర మురళీమోహన్, సిఐ. సిహెచ్ విద్యాసాగర్, ఎస్సై, ఎస్. రాము, పర్యటి శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్, కుమార్, జుజ్జువరపు హరిబాబు, నారాలశెట్టి వెంకన్న, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు తోట రజిని, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

### పుష్కర్ నగర్లు, పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించిన జిల్లా యంత్రాంగం



**రాజమహేంద్రవరం అర్బన్, జూలై 10 (ప్రభాతవార్త)** రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మహేష్తో పాటు వివిధ శాఖల అధికారులు శుక్రవారం రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పర్యటనలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, తాత్కాలిక వసతి, హోల్డింగ్ ఏరియాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్, జీఎస్ఎల్ వెనుక ప్రాంతం, దేవాన్ చెరువు జీరో పాయింట్, కేశవ హాస్పిటల్ రోడ్, గమన్ వంతెన -- కాతేరు అండర్‌పాస్ ప్రాంతం, కాతేరు లోని సీటీఆర్ఐ భూములు, వ్యవసాయ కళాశాల సమీప ప్రాంతం, తిరుమల బస్ గ్రౌండ్, తిరుమల పాపయ్య నగర్ సమీప ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. అనంతరం కొవ్వూరు చేరుకుని అక్కడ నుంచి తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పార్కింగ్, హోల్డింగ్ ఏరియాలు, పుష్కర్ నగర్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను సమీక్షించారు. అలాగే ట్రాఫిక్ మళ్లింపు, అత్యవసర సేవల నిర్వహణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పి. నారాయణ ఉదయం 7 గంటల నుంచి రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పుష్కరాల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు.

# మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తాం

### కాని వాడ పర్యటనలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్.




**పోలవరం జిల్లా ప్రతినిధి జూలై 10 ప్రభాతవార్త.** మారుమూల గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రకటించారు. శుక్రవారం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో జిల్లా కలెక్టర్ ఒక నెల ఒక నియోజకవర్గం- నాలుగు గ్రామాల సందర్శన కార్యక్రమంలో భాగంగా కానీవాడ, కొండ వేజువాడ గ్రామాలలో ఆయన పర్యటించారు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులకు గిరిజనులు వారి సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. త్రాగునీరు,కరెంటు సౌకర్యం, రహదారులు,గృహాలు, వివిధ రకాలైన పింఛన్లు, ప్రతి నెల సకాలంలో అధించాలని కలెక్టర్ సూచించరు.గిరిజనులు తమ గ్రామములోని పాఠశాలకు,, అంగన్వాడి కేంద్రానికి పక్క భవనాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. గంద్రాల గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న పసుపు పంటను కలెక్టర్ పరిశీలించారు. కానివాడ గ్రామం లో సచివాలయం భవనం, హెల్త్ వెల్నెస్ సెంటర్, ఆర్ ఎస్ కె భవనాలను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. గిరిజనులకు మినీ పప్పుల ప్రాసెసింగ్ మిషన్లు అందజేయాలని, రబ్బర్ టాపింగ్ పై రైతులకు శిక్షణ ఇప్పించాలని గిరిజనులు కలెక్టర్ను కోరారు.పెద్దలోవ మండల పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కానీవాడు ఘాటీ నుండి ఆహ్లాదకరమైన వ్యూ పాయింట్ను టూరిస్టులకు ఆకర్షించే విధంగా ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆయన ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామంలోని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పి హెచ్ ఓ నరేంద్ర కుమార్, పంచాయతీ అధికారి నర్సింగరావు డిఎమ్ఓ భాస్కర్, ఎంపీపీ కె.ఆనంద్,ఐసిడిఎస్ పిడి కె.ఉమా,ఎంపీడీవో బాపన్న దొర,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రజల సమస్యలే ప్రాధాన్యం

## ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై10 (ప్రభాతవార్త) ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు ప్రారంభించాలనే లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం 13, 14, 15 డివిజన్లలో విశేష స్పందనతో కొనసాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.గురువారం రాత్రి 13, 14, 15 డివిజన్ల పరిధిలోని రెల్లిపేటలో కుంచమాంబ--పాలమాంబ ఆలయం వద్ద కొనసాగింది. ఆ రాత్రి పార్టీ కార్యకర్త ఇంట్లో బస చేసిన ఎమ్మెల్యే వాసు, శుక్రవారం ఉదయం ప్రజలతో కలిసి ఆయా డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా తెలుసుకున్నారు. డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## దేవాలయాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి.. ఎమ్మెల్యే గిడ్డి..

కొర్లపాటివారిపాలెంలో వెంకన్న ఆలయ ముఖ ద్వారానికి భూమిపూజ..



అంబాజీపేట, జూలై 10, (ప్రభాతవార్త): దేవాలయాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం లో వేం చేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ముఖ ద్వారం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయ మర్యాదలతో స్వాగతం అందుకున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సన్నాయి, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు వేద మంత్రోచ్ఛరణలతో ఊరేగింపుగా భూమి పూజ ప్రదేశానికి చేరుకున్నారు. భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొర్లపాటివారిపాలెంలో సుమారు ఆరు దశాబ్దాల క్రితం నిర్మితమైన శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారు విశేష పూజలు అందుకుంటున్నారన్నారు.అలాగే అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఆలయం దినదినాభివృద్ధి చెంది ప్రముఖ వైష్ణవాలయంగా పేరు పొందిందన్నారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా ముఖ ద్వారం (ఆర్చి) నిర్మిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే స్థానిక పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీ సత్యసాయి నగర్ లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది విధులకు అవసరమైన ప్రత్యేకగది ని నిర్మించేందుకు కొబ్బరికాయను కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవోలు కంచి శ్రీనివాస్, ఎండి అబ్బాస్ అలీ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి బాలభాస్కర్, నియోజవర్గ టీడీపీ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ సుంకర గణపతిరావు, నాయకులు గణపతి వీర రాఘవులు,రవణం రాము, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, పులపర్తి సుజాత, కొర్లపాటి ఢిల్లీ, దొమ్మేటి సాయి కృష్ణ,కురసాల అంజనేయులు, సుంకర బాలాజీ,నూదురుపాటి రాము, నైనాల ప్రభాకర్, మేడిద బుచ్చిబ్బాయి, పత్తి దత్తుడు, ఉండుర్తి నాగబాబు, రవణం హరి, కుప్పాల సీతారాం, అరిగెల శివ కళ్యాణ్,రవణం విజయ్, పొట్టుపోతు సాయి, పత్తి శివ తదితరులు ఉన్నారు.


## 15న ప్రారంభం కానున్న వారాహీ అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు

### వ్యవస్థాపకురాలు లక్ష్మీ ప్రసన్న వెల్లడి




కాకినాడ రూరల్ , జూలై 10(ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో వారాహి అమ్మవారి ప్రాంగణంలో ఈనెల 15వ తేదీ నుండి 24 వరకు గుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాల లో భాగంగా 15వ తేదీ ఉదయం 5గంటలకు మాలధారణ దీక్ష ప్రారంభం అవుతుందని, దీక్షా నియమాలను వివరించారు.కాశీ క్షేత్ర పరిపాలకురాలుగా అమ్మవారి కీర్తి ఎంతో ఉందన్నారు. భక్తులు సమస్యలు నుంచి త్వరితగతిన బయట పడేందుకు అమ్మవారిని ఉపాసనతో ప్రార్థించాలని, ఉదయం వేళల్లో అమ్మవారికి దీపారాధనలు చేసి రాత్రి వేళల్లో పూజిస్తే అనుకున్న పనులు జరుగుతాయని వివరించారు. అమ్మవారికి పానకం, చక్రపొంగలి, దద్ధోజనం నైవేద్యంగా సమర్పించాలన్నారు. అమ్మవారు భూదేవత అయినందున క్యారెట్, బీట్రూట్, చిలకడ దుంపలు, కాయగూరలుతో పాటు భూమి నుంచి వచ్చే ఆహార పదార్థాలు అన్నీ ప్రసాదం రూపంలో పెట్టవచ్చన్నారు. తమ ప్రాంగణంలో నిర్విరామ అన్నదానం, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. మామూలు రోజులు కన్నా అమ్మవారిని ఆషాఢమాసంలో భక్తితో పూజించడం వలన కుటుంబం అంతటికీ అనుగ్రహం వేగంగా లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్త కాళ్ళ సత్య నారాయణ తో పాటు అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## విత్తన శుద్ధితో అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన పంటలు..



అంబాజీపేట, జూలై 10, (ప్రభాతవార్త): బిజామృతంతో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్ళ నివారణతో పాటు అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన పంటల పండించవచ్చునని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వక్కలంకలో ఎంటి నాగమణి విత్తన శుద్ధి పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవాళీ వరి విత్తనాలు సీరగ సాంబ, కూచి పట్టాలియా, ఆర్ఎన్ఆర్, మైసూర్ మల్లిక వంటి రకాలను బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల భూమి నుండి వచ్చే తెగుళ్లు, విత్తనం నుండి వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చున్నారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల మరొక శాతం అధికంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యకరమైన పంటను నాణ్యమైన దిగుబడితో పంటలు పండించుకోవచ్చని రైతులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయం చేసేలా ముందుకు రావాలని రైతులను కోరారు. స్థానిక రైతు పితాని సుధీర్ ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచారని, మిగిలిన వారు కూడా ప్రకృతి వ్యవసాయం చేసేలా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్పి ఎం. సరిత శ్రీలక్ష్మి, ఎం.నాగకుమారి, కె. స్వరూపారాణి, పి.యమునా పాల్గొన్నారు.

# ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఎపియుడబ్ల్యుజె ప్యానెల్ ఘన విజయం



**అధ్యక్షునిగా మోతా సారథి... కార్యదర్శిగా గండ్రోతు గోపి...**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 10,ప్రభాతవార్త. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ ఎన్నికల్లో ఎపియుడబ్ల్యూజే ప్రతిపాదించిన ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ ప్యానెల్ లో అధ్యక్షునిగా మోతా బాల విజయ సారథి, ప్రధాన కార్యదర్శిగా గండ్రోతు వేణు గోపాలస్వామి (గోపి), ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా పిఎస్ గంగాధర్, కొత్తపల్లి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా సోమాబత్తుల కృపానందం, కెవిఎన్ వరప్రసాద్, కోశాధికారిగా శ్రీపాద పురుషోత్తమకుమార్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా ఆకుల ఈశ్వర్, కొట్టే మధు,ఆర్‌వివి సత్య నారాయణ,పి చంటిబాబు, పాలపర్తి శ్రీనివాస్,గరగ ప్రసాద్, జివి గోపాలకృష్ణ విజయం సాధించారు.

**సభ్యుల సంక్షేమమే లక్ష్యం...**

"మార్పు కోసం" పేరిట బరిలో దిగిన తాము సభ్యుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తామని అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన సారథి, గోపిలు స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్‌ను అభివృద్ధి చేసి సభ్యులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విలేకరులకు వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. సభ్యుల మధ్య ఐక్యత పెంపొందిస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు మండేల శ్రీ రామమూర్తి, సీనియర్ నాయకులు కుడుపూడి సారథి, సీనియర్ జర్నలిస్టులు టివి 9 సత్య, ఎన్‌టివి శ్రీనివాస్, తదితరులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## సమగ్ర శిక్ష జేఏసీ నూతన కమిటీ ఏర్పాటు

మామిడికుదురు.జూలై 10(ప్రభాతవార్త) జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో మామిడికుదురు మండల జేఏసీ నూతన కమిటీ శుక్రవారం ఏర్పాటు చేయబడింది. కమిటీ అధ్యక్షుడిగా నాసర్ మహెదీ, సెక్రటరీగా యెరుబండి మధు,కోశాధికారిగా పోతుల జయప్రకాష్ ల నియామకం జరిగింది. నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, కార్యదర్శి సిగ్రామణి కుమార్, నైనాల రాజేంద్ర ప్రసాద్,గాలి దేవర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్రంపేటపాడులో ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ బొజ్జిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ



అడ్డతీగల,జూలై 10, ప్రభాతవార్త అడ్డతీగల మండలం కిమ్మూరు పంచాయతీ సర్రంపేటపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ బొజ్జిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దాల వీర్రాజుకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రం అంశంపై గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు.అనంతరం గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానికుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులతో పరిశీలించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశీ విశ్వనాథరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు జర్త వెంకటరమణారెడ్డి,మద్దాల మదన్మోహన్, ఆడారి నాగబాబు, కూటమి నాయకులు, భారత ఆదివాసీ నాయకులు. బొండ్లప్రభాకర్ సర్రంపేటపాడు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, జూలై 10,(ప్రభాతవార్త) ప్రజా దర్బార్ లో ప్రజలు సమర్పించే వినతుల పట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనంతో వ్యవహరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు శుక్రవారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు రెవెన్యూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి స్వీకరించారు మొత్తం ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించారు పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు

## జడ్డంగిలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు




రాజవొమ్మంగి, జూలై 10, ప్రభాతవార్త జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం 516 ఈ జాతీయ రహదారి పై జడ్డంగి ఎస్. ఐ. చినబాబు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలను నిర్వహించారు. రికార్డులు లేని వాహనదారులకు ఎస్. ఐ. జరిమానాలను వేశారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణను పాటించాల్సిన నిబంధనలపై ఎస్. ఐ. చినబాబు అవగాహనను కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను దరించా లన్నారు. ప్రయాణ సమయంలో ప్రతీ వాహనదారుడు రికార్డులు వెంట ఉండాలన్నారు. ఈతనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్స్ రాజ్ కుమార్, గోవిందరాజులు, ఏ. పి. ఎస్. పి. సిబ్బంది పాల్గొన్నారు

## అసంపూర్ణంగా పంచాయతీ భవనం.



రౌతులపూడి (ప్రభాత వార్త) మండల గ్రామం ములగపూడిలో పంచాయతీ కార్యాలయ భవనం అసంపూర్ణంగా పడి పడివుంది. గత పదేళ్లుగా నిర్మాణం పూర్తి కాకపోవడంతో వివిధ ప్రదేశాలలో సమావేశాలు నిర్వహించవలసి వస్తుంది.దీనితోవివిడ పార్టీల నాయకులు ఇబ్బందులేదుకుంటున్నారు. దీనిపై అనేకసార్లు అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడేలేడనీ ప్రజలు వాపోవుచున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



కొత్తపేట, జూలై 10,(ప్రభాతవార్త) కొత్తపేట మండలంలో బిల్లకుర్రు పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు కొత్తపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు తెలిపారు 33/11 కేవీ లైన్ పరిధిలోని 11 కేవీ బిల్లకూరు 11 కేవి గొల్ల కోటివారిపాలెం ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు మరమ్మత్తు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకుసబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గొల్లకోటివారిపాలెం మోదేకుర్రు రాకూర్తి వారి పాలెం బిల్లకూరు తరిట్ల వారి పేట దేగల వారి పాలెం నల్లవారిపేట నెల్లి వారి పేట నక్క వారి పేట కముజు వారి పాలెం శ్రీనివాసపురం సత్తెమ్మ కాలనీ మాసాయిపేట ఎలిశెట్టి వారి పాలెం వాకాడి వారి పాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించి పనులకు వీలు కల్పించవలసిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు విజ్ఞప్తి చేశారు

## మత్స్యరంగ అభివృద్ధిలో అక్వా రైతుల పాత్ర కీలకం:

### --జాయింట్ డైరెక్టర్ నిర్మల కుమారి



కడియం ,జూలై 10 ప్రభాతవార్త జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని కడియంలోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి, జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ దేశంలో మత్స్యరంగ అభివృద్ధికి చేపల రైతులు, అక్వా రైతులు అందిస్తున్న సేవలు అమూల్యమని అన్నారు. 1957 జూలై 10న ఒడిశాలోని కటక్‌లో సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ అలీ కున్నీ మెజర్ కార్ప్ చేపల ప్రేరేపిత సంతానోత్పత్తి సాంకేతికతను విజయవంతంగా అభివృద్ధి చేశారని, ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తిస్తూ ప్రతి ఏడాది జూలై 10న జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రపంచంలో మంచినీటి చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో కొనసాగడం గర్వకారణమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి చేపల విత్తనాలను వదలడం ద్వారా ఆహార ఉత్పత్తిని పెంచడంతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని కూడా గణనీయంగా పెంచవచ్చని సూచించారు. చేపలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారమని, గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలకు చేపల పెంపకం ప్రధాన జీవనాధారంగా మారిందని వివరించారు. ఈ సందర్భంగా మత్స్యరంగ అభివృద్ధికి విశేష సేవలు అందించిన అక్వా రైతులను, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్, అనపర్తి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పులకుర్తి శ్రీనివాసు, శ్రీకృష్ణపట్నం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొల్లాం రత్నంలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. బ్రహ్మానందం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మత్స్య సహకార సంఘం జేఏసీ ఏ. సత్తిబాబు, జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల సభ్యులు, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## నర్సరీ రైతులకు తక్కువ ధరకే ఎర్రమట్టి

### సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ అసోసియేషన్ మరో ముందడుగు



కడియం, జూలై 10 ప్రభాతవార్త కడియం మండల నర్సరీ రైతులకు అత్యంత అవసరమైన ఎర్రమట్టిని అందుబాటు ధరలో అందించేందుకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ అసోసియేషన్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో అసోసియేషన్ కొనుగోలు చేసిన భూమి నుంచి ఆరు యూనిట్ల ఎర్రమట్టి లారీ ని రూ.8,900కే సరఫరా చేసే కార్యక్రమాన్ని శుక్రవారం భూమిపూజతో ప్రారంభించారు. గతంలో ఎర్రమట్టి ధరలు ఒక్కసారిగా పెరిగి ఆరు యూనిట్ల ఎర్రమట్టి లారీ రూ.14 వేల నుంచి రూ.14,500 వరకు చేరుకున్న సమయంలో నర్సరీ అసోసియేషన్ నేరుగా మట్టిని సరఫరా చేసి రైతులకు తక్కువ ధరకే అందించిందని, దళారుల ఆధిపత్యానికి అడ్డుకట్ట పడటంతో పాటు ధరలు కూడా తగ్గుముఖం పట్టాయని రత్నం అయ్యప్ప తెలిపారు. ఇటీవల మళ్లీ ఎర్రమట్టి ధరలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత తక్కువ ధరకే మట్టిని అందిస్తున్నామని చెప్పారు.నర్సరీ రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, చలనచిత్ర శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రూరల్ శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం శాసనసభ్యుడు బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, అదనపు కలెక్టర్ మేఘ స్వరూప్, జిల్లా గనుల శాఖ అధికారి ఫణిభూషణ్ రెడ్డిలకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, ప్రధాన కార్యదర్శి కొండేపూడి నాగు, కార్యదర్శి తడాల నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి గాజుల రత్తయ్య, కోశాధికారి రత్నం బాబ్జీ, సంయుక్త కోశాధికారి పిల్లా శ్రీనివాస్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

## గోపాలపురం ఆర్ఐగా విన్‌బాబు



గోపాలపురం జూలై 10, (ప్రభాతవార్త): గోపాలపురం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా ఎం.విన్‌బాబు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కొవ్వూరులో పోలవరం కుడి ప్రధాన కాలువ స్పెషల్ ఆర్ఐగా విధులు నిర్వహించారు. బదిలీపై గోపాలపురానికి వచ్చిన ఆయనను రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఆత్మీయంగా స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విన్‌బాబు మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, రెవెన్యూ పరిపాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. సుమారు సంవత్సరం నుంచి ఖాళీగా ఉన్న ఆర్ఐ పోస్ట్ విన్ బాబు రాకతో భర్తీ అయింది.

### మంత్రి, 'ఆనం'కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వాడపల్లి దేవస్థానం డిప్యూటీ కమిషనర్, నల్లం, అర్చక బృందం



.ఆత్రేయపురం, జూలై ,10,(ప్రభాత వార్త). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు , అర్చక స్వాములు కలిసి మంత్రివర్యులను మర్యాదపూర్వకంగా కలిసి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం శ్రీ స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వీరవరం సమస్యలపై ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వినతి -- తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశాలు



కడియం ,జూలై 10 ప్రభాతవార్త భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా కడియం మండలం వీరవరం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ సోము వీర్రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న చెత్త నిల్వ కేంద్రం సమస్యతో పాటు మురుగునీటి కాలువల నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు వెంటనే స్పందించి సంబంధిత మండల అభివృద్ధి అధికారితో ఫోన్ ద్వారా సంప్రదించి,గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కడియం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం, తాళాబత్తుల భవానీ భాస్కర్, దాసరి ముత్యం, మండన రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# లైన్ మ్యాన్ ను నియమించండి.

రౌతులపూడి,(ప్రభాత వార్త) తమగ్రామాలకు లైన్ మ్యాన్ ను నియమించి రైతులను ఆదుకోవాలని మండల గ్రామాలైన గిడజాం, కోదూరు, పారుపాక పంచాయతీల ప్రజలు కోరుచూన్నారు. పలు మారులు విద్యుత్ అంతరాయంవల్ల పంటలు పాడైపోతున్నాయని,పశు వులకు నీరు కూడా ఉండటంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలులు వేసినప్పుడు గ్రామాలలో కరెంటు సరఫరా నిలిపోవడంతో పాటు కరెంటు తీగలు నేలపై పడుచున్నాయని విషయం తెలియచేయడానికి లైన్ మ్యాన్ లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించవలసి వస్తుందని వారు అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఉన్నతాధికారులకు తెలియ పరుద్దామంటే పట్టించుకోవడం లేదని, కరెంట్ లేకపోవడంతో ఒకొక్క సారి పాములుకూడ ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ మూడు గ్రామాలకు ఒక విద్యుత్ లైన్ మ్యాన్ ను నియమించి ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు

## నేడు విద్యుత్ సరఫరా కి అంతరాయం

కాట్రేనికోన 10 ( ప్రభాతవార్త) కాట్రేనికోన మండలంలోని పల్లంకుర్రు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫీడర్ పైన చెట్టుకొమ్మలు తొలగించుటకొరకు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని అమలాపురం ఈఈ కె.రాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్లంకుర్రు సబ్ స్టేషన్ పరిధిలో వున్నా పల్లంకుర్రు. బలుసుతిప్ప, రామాలయంపేట, దాసరివారిపేట, చీకూరుమెల్లివారిపేట, గొల్లగురువు, ఐ చెరువు, కామరాజు చెరువు, మరియు బట్టుచేరువు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును అని ఈ ఈ తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## దేవీపట్నం పోలవరం పరిహారాల్లో అక్రమాలపై విచారణ కోరుతూ ఆర్డీఓకు వినతి



దేవిపట్నం , జూలై 10ప్రభాత వార్త : దేవీపట్నం ముంపు మండలంలో పోలవరం భూసేకరణ, ఆర్‌డఆర్ ప్యాకేజీల నిధులను గిరిజనేతరులు అక్రమంగా పొందారని ఆరోపిస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ, ఏజెన్సీ చట్టాలు, ఎల్‌టీఆర్ 1/70 నిబంధనలకు విరుద్ధంగా భూ రికార్డులు మార్పులు చేసి కోట్ల రూపాయల పరిహారాలను కొల్లగొట్టారని ఆరోపించారు. దండంగి, లోతుపాలెం, ఇందుకూరుపేట, గానుగులగొండి గ్రామాల్లో గిరిజన భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల్లో అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత ఆదివాసీ కుటుంబాలకు రావలసిన పరిహారం, ఆర్‌డఆర్ హక్కులను వెంటనే కల్పించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనలు, న్యాయపోరాటం చేపడతామని హెచ్చరించారు.

## విద్యార్థినులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సీఐ గజేంద్రకుమార్ పిలుపు



అడ్డతీగల,జులై 10, ప్రభాతవార్త సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్, ఎస్ఐ వినోద్ కుమార్ తమ సిబ్బందితో కలిసి స్థానిక అనూప్ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాలు మరియు సోషల్ మీడియా సురక్షిత వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ సేవల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు చురుకుగా పాల్గొని, సైబర్ భద్రత, వ్యక్తిగత రక్షణపై తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## సారా బట్టీపై ఎక్సైజ్ దాడులు.. 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



రాజవొమ్మంగి, జూలై 10, ప్రభాత వార్త రాజవొమ్మంగి పంచాయితీ శ్రీరామ్‌నగర్‌లో శుక్రవారం రంపచోడవరం ఎక్సైజ్ శాఖ అధికారులు సారా తయారీ కేంద్రంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. సారా బట్టీ నిర్వాహకులు అధికారులు వచ్చే విషయం తెలుసుకుని పరారైనట్లు ఎక్సైజ్ సీఐ శ్రీధర్ తెలిపారు. నిందితుడిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిర్వాహకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు వై.వి. నాయుడు, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ విజయ్ రత్నకుమార్ పాల్గొన్నారు. అక్రమ సారా తయారీ, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ సి. ఐ. శ్రీర్ హెచ్చరించారు.

## భూసార పరీక్షలు నిర్వహించి ఎరువులు వాడాలి



మామిడికుదురు.జూలై 10(ప్రభాతవార్త) భూసార పరీక్షలు నిర్వహించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు ఎవిఎస్ రాజశేఖర్ రైతులకు సూచించారు. గెద్దాడ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం,నానో ఎరువుల వినియోగం మరియు నూతన సాగు పద్ధతులపై రైతులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆత్మా చైర్మన్ ఆరుమెల్లి సత్య సాయిబాబా మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. వ్యవసాయ అధికారి ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంటలను సాగు చేసేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు.నానో ఎరువులు అయిన నానో యూరియా మరియు నానో డిఏపి లాభాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు జవ్వాది పద్మావతి,ఆత్మా కమిటి సభ్యులు చెల్లింగి శిరీష,విల్లా శ్రీ రామారావు,రైతులు గంధం శ్రీనివాసరావు,గుబ్బల శ్రీ రామచంద్రమూర్తి, ఏఈఓ కె.స్వాతి రమాదేవి,శివరామకృష్ణ మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## లబ్బర్తి అడవుల్లో 4 వేల విత్తనబంతులు వెదజల్లింపు



**రాజవొమ్మంగి, జూలై 10, ప్రభాతవార్త** లబ్బర్తి అడవుల్లో 4 వేల విత్తన బంతుల వెదజల్లింపు
రాజవొమ్మంగి రేంజ్ పరిధిలోని లబ్బర్తి బీట్ అటవీ ప్రాంతంలో సెక్షన్ ఆఫీసర్ సుబ్బయ్యమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం విత్తన బంతుల వెదజల్లే కార్యక్రమం నిర్వహించారు. చింత, మర్రి, నల్లమద్ది, రావి, రోజ్‌వుడ్, ఇప్ప, నేరేడు, గానుగ తదితర వృక్షజాతుల విత్తనాలతో తయారు చేసిన 4 వేల విత్తన బంతులను విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది అడవిలో వెదజల్లారు. పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సుబ్బయ్యమ్మ, బీట్ ఆఫీసర్ పృథ్వి, బేస్ క్యాంపు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు.. యువతకు ఎస్పీ పిలుపు



**రామచంద్రపురం,జూలై 10 (ప్రభాతవార్త):** మత్తు మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా రామచంద్రపురం పోలీస్ సర్కిల్ ఆఫీస్ లో గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో భాగంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై యువతకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజా,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని అన్నారు.అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి విద్య,ఉపాధి,లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు.మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు.ఈ నేపథ్యంలో సుమారు 70 మంది పాత నేరస్తుల మూత్ర నమూనాలను పరీక్షించి,అవసరమైన వారికి కౌన్సెలింగ్ అందించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సమాజం సహకరిస్తే డ్రగ్స్ నిర్మూలన లక్ష్యాన్ని మరింత సమర్థంగా సాధించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కోట సతీష్,ఇన్‌ఛార్జి డీఎస్పీ ప్రసాద్,ఈగల్ టీం సీఐ వెంకటేశ్వరరావు,సీఐ వెంకటనారాయణ,ఎస్ఐ నాగేశ్వరరావు,కె గంగవరం ఎస్ఐ సోమేంద్రతో పాటు పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రంపచోడవరం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత



రంపచోడవరం, జూలై 10:ప్రభాతవార్త. రంపచోడవరం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో వార్షిక నిర్వహణ పనులు, విద్యుత్ లైన్ల ఆధునీకరణ, చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రంపచోడవరం మండల పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అచ్యుతాచారి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అంగరంగ వైభవంగా సోమేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు



**కె గంగవరం, జూలై 10, (ప్రభాతవార్త) :** డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె గంగవరం మండలం యండగండి శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయం మూలా నక్షత్రం1వ పాదానికి సంబంధించిన ఆలయం.ఈ ఆలయం ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి చుట్టూ ఉన్న ప్రాంతంలోని 108 నక్షత్ర పాద శివాలయాలలో ఒకటి. ఇంతటి విశిష్ట గల శ్రీ రాజరాజేశ్వరి సమేత సోమేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభించినట్లు ఆలయ అర్చకులు కొత్తలంక నాగేశ్వరరావు తెలిపారు. వేద పండితులు మైలవరపు చోడిద్దు బ్రహ్మత్వం లో రుత్వికులు మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన చేసి అనంతరం స్వామివారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

## వృద్ధాశ్రమం పనులను పరిశీలించిన జేసీ అపూర్వ భరత్



**పెద్దాపురం: జూలై 10(ప్రభాత వార్త )** ఐరిగేషన్ స్థలంలో నిర్మిస్తున్న వృద్ధాశ్రమం పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ ప్రగతి, నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు ఆసరాగా ఉండేందుకు వృద్ధాశ్రమ నిర్మాణం చేపట్టడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, తహశీల్దార్ పి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి 'వెంకన్న 'కు డీఎస్పీ సుంకర మురళీమోహన్ ప్రత్యేక పూజలు.



### స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కళ్యాణం... పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం, జూలై 10,(ప్రభాత వార్త). ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కొనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ సతీ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అష్టోత్తర నామార్చన పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు అనంతరం వేద పండితులు వేద ఆచిర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర, నిత్య కళ్యాణం లలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ముందస్తుగా ఏరియాల గుర్తింపు. : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, జూలై 10( ప్రభాతవార్త)** రానున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ఏరియాలను ముందస్తుగా గుర్తించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్ నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా పుష్కర డిప్యూటీ కలెక్టర్ మహేష్ పాటు ఇక శాఖల అధికారులు రాజమహేంద్రవరం కొవ్వూరు ప్రాంతంలో పర్యటించారు. పుష్కర నగర్లో పార్కింగ్ ప్రాంతాలు హోల్డింగ్ ఏరియాలను ముందస్తుగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల సమయంలో బొక్కలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నిర్వహణ పార్కింగ్ తాత్కాలిక వసతి హోల్డింగ్ ఏరియాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రాథమిక అంచనాలకు వచ్చారు. ఆటోనగర్ జిఎస్ఎల్ వెనుక ప్రాంతం జవాన్ చెరువు 0. కేశవ హాస్పిటల్ రోడ్ గ్రామం సిటీ ఆర్ ఐ భూములు వ్యవసాయ కళాశాల సమీపాన ప్రాంతం తిరుమల బస్సు గ్రౌండ్ తిరుమల పాపయ్య నగర్ సమయం ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ శనివారం రాజమహేంద్రవరంలోని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఆమె వివరించారు. కలెక్టర్ అధ్యక్షతన వివిధ సమన్వయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పుష్కరాలు ఏర్పాట్లు సమగ్ర సమీక్ష చేపట్టిన వెల్లడించారు.

## గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన



**మారేడుమిల్లి, జూలై 10: ప్రభాతవార్త.** మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, రంపచోడవరం డీఎస్పీ పి. అష్రాఫ్ అలీ ఆదేశాల మేరకు మారేడుమిల్లి సీఐ బి. నరసింహమూర్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణ, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం, ర్యాగింగ్ నిర్మూలన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. ర్యాగింగ్ శిక్షార్హమైన నేరమని, విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో వ్యవహరించాలని, బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక దుష్పరిణామాలను గుర్తించి వాటి నిర్మూలనకు సహకరించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యానాం ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటుపై ఆంధ్ర యానాం సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తత.

### పనులు ప్రారంభం.
### భారీగా మోహరించిన ఇరు రాష్ట్రాల పోలీసులు.
### అఖిలపక్ష నాయకుల అరెస్టు.



**తాళ్ళరేవు, జూలై 10 (ప్రభాతవార్త):**ఆంధ్రా, యానాం సరిహద్దులోని వివాదాస్పద భూమిలో తాళ్ళరేవు మండలం తూర్పు పేట వద్ద యానాం ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటుకు యానం అధికారులు పనులు ప్రారంభించడంతో రెండు రాష్ట్రాల సరిహద్దుల వద్ద మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పు పేట వద్ద యానాం ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తుండగా ఇటీవల పోలేకుర్రు పంచాయతీ ప్రజలు, అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి ప్లాంట్ ఏర్పాటును అడ్డుకున్నారు. దీనిపై కాకినాడ ఆర్డిఓ వివరణ ఇస్తూ యానం ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేయబోయే ప్రాంతం వివాదాస్పదమైనదని హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. ఈ ఉదంతం ఇలా ఉండగా, యానం అధికారులు వివాదాస్పద స్థలంలో ప్లాంటు ఏర్పాటు కోసం ఆ ప్రాంతాన్ని శుక్రవారం చదును చేసి యానంలోని కొంత చెత్తను తీసుకొచ్చి అక్కడ వేశారు. ఇది తెలుసుకున్న అఖిలపక్ష నాయకులు ఆ ప్రాంతానికి దూరంగా ఒకచోట సమావేశమై ఉండగా కాకినాడ జిల్లా పోలీసులు పలువురు అఖిలపక్ష నాయకులను అరెస్టు చేసి కాకినాడ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనిపై కోరంగి ఎస్సై వివరణ కోరగా తాళ్లరేవు తహసిల్దార్ జి ఆర్ వి భద్రరావు ఈ ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఆదేశాలు ఇచ్చారన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో ఒకచోట గుమిగూడి ఉన్న ఆరుగురు నాయకులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో జక్కల ప్రసాద్ బాబు, పిల్లి సత్తిబాబు, ధూళిపూడి బాబి, సిరంగం సతీష్, వనమాడి రాంబాబు వాసంశెట్టి సూరిబాబులను అరెస్టు చేసి వీరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం రూ.2 లక్షల పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

## మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు

### కలెక్టర్ కె. దినేష్ కుమార్



**మారేడుమిల్లి, గుర్తుడు జూలై 10: ప్రభాతవార్త.** గుర్తేడు మండలంలోని కానీవాడ, కొండవేజువాడ గ్రామాలతో పాటు మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం "ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు గ్రామాల సందర్శన" కార్యక్రమంలో భాగంగా కానీవాడ, కొండవేజువాడ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు కలెక్టర్ హాజరై ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, గృహాలు, పింఛన్లు, రేషన్, ఉపాధి హామీ పనులు, ప్రభుత్వ సేవలపై వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలని, గిరిజన ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిరంతరం పర్యటించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద 125 రోజుల ఉపాధి కల్పనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కొండవేజువాడ గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, గంద్రాల సమీపంలో కల్వర్టు నిర్మాణ ప్రతిపాదనలు, కానీవాడలో సచివాలయం, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గిరిజనులకు మినీ పప్పుల ప్రాసెసింగ్ యంత్రాల పంపిణీ, రబ్బర్ రైతులకు టాపింగ్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్దలోవ మండల పరిషత్ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నిబంధనల ప్రకారం అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు, యూనిఫారాల పంపిణీపై కూడా ఆరా తీశారు. కానివాడ ఘాట్ ప్రాంతంలోని వ్యూ పాయింట్‌ను పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిల్లా పంచాయతీ అధికారి నర్సింగరావు, డీఎంఓ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ ఉమా, ఎంపీపీ కె. ఆనంద్, ఎంపీడీవో బాపన్నదొర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**సీతానగరం, జూలై 10, (ప్రభాతవార్త) :** మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. మునికూడలి, రాజంపేట, ముగళ్ళ, రఘుదేవపురం, సీతానగరం, సింగవరం, వంగలపూడి, రామచంద్రపురం, కూనవరం, ఉండేశ్వరపురం గ్రామాల్లో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఈ చెక్కులను అందించారు. చెక్కులను అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యాలయం ఘనంగా ప్రారంభం



**పెద్దాపురం జూలై 10 (ప్రభాత వార్త )** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని కాకినాడ జిల్లా అధ్యక్షులడు , డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు పోలమరశెట్టి సత్తిబాబు, గౌరవ అధ్యక్షుడు కఠారి శ్రీను నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసైనికులు, వీర మహిళలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. ?ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాల ప్రకారం ఈ కార్యాలయం కేవలం రాజకీయాల కోసమే కాకుండా, ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కేంద్రం ద్వారా సభ్యత్వ నమోదు, ఉపాధి మార్గదర్శకత్వం, సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని, ప్రజలకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## పశు గ్రాస వారోత్సవాలు...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిది, జూలై10, ప్రభాతవార్త.** పశు గ్రాస వారోత్సవాలు కోనసీమ జిల్లాలో విస్తృతంగా నిర్వహించ బడుతున్నాయి.ఈనెల 7వతేదీ నుండి14 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమాల ద్వారా రైతులకు పశు గ్రాసం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరుగుతోంది.
ఈ సందర్భంగా శుక్రవారం నాడు అమలాపురం మండలం నడిపూడి గ్రామంలో పశు గ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.బి.నాగేశ్వర రావు, అమలాపురం ఉప సంచాలకులు,డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ విజియారెడ్డి, బండారులంక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. డి. మాధురి, తదితరులు హాజరై రైతులకు అవగాహన కల్పించారు.
ఈకార్యక్రమం సందర్భంగా అధికారులు రాయుడు బ్రహ్మానంద వెంకట నారాయణ మూర్తి పశుసంవర్ధక క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన వద్ద 7 గేదెలు ఉండగా, రెడ్ నాపియర్ గడ్డి సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి అభినందించారు. అదేవిధంగా సహజ వ్యవసాయంపై ఆసక్తి కలిగిన అప్పారి చిన వెంకట రమణ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. బి. నాగేశ్వరరావు రైతులకు పశుగ్రాస పంటల సాగు ప్రాముఖ్యత, పచ్చిక, ఎండు గడ్డి, సైలేజ్ వంటి పోషకాహారాల అవసరం, వాటి ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగుపడటం, పాల ఉత్పత్తి మరియు పశుసంపద ఉత్పాదకత పెరగడం వంటి ప్రయోజనాలపై వివరించారు. పశుగ్రాస గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీ విత్తనాలను 115 రూపాయలకే ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని అందరు రైతులు సద్వినియోగం చేసుకోవా లన్నారు.అలాగే సైలేజ్ తయారీ విధానం, నిల్వ పద్ధతులు, పశువులకు సమతుల్య ఆహారం అందించే విధానాలపై ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి.డాక్టర్ విజయారెడ్డి మాట్లాడుతూ పచ్చి మేతను మేపడం వలన పశువుల లో ఆరోగ్యం మెరుగుపడి పాల ఉత్పత్తి, గర్భధారణశక్తి పెరిగి ఆర్థికంగా రైతులు మంచి జరుగుతుందన్నారు. పశుగ్రాస పంటలను విస్తృతంగా సాగు చేసిష్త్ర తమ పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



**రాజమహేంద్రవరంఅర్బన్,జూలై10(ప్రభాతవార్త)** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు జూలై 13న రాజమహేంద్రవరం ప్రాంతంలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను వేగవంతం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు బృందం శుక్రవారం సాయంత్రం వేమగిరి హైవే, వేమగిరి హైస్కూల్ ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతం, ధవళేశ్వరం బ్యారేజ్ పరిసరాలు, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేస్తున్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, బ్యారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, అత్యవసర స్పందన బృందాల సిద్ధతపై సంబంధిత శాఖలకు స్పష్టమైన సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యమంత్రి కాన్వాయ్ మార్గంలో అవసరమైన అన్ని చర్యలను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిర్వహణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని ఎస్పీ డి నరసింహ కిషోర్ సూచించారు. అలాగే ధవళేశ్వరం బ్యారేజ్ ప్రాంతంలో జరుగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, సందర్శన మార్గం, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శంఖవరం మండలంలో ఎస్ఐఆర్ ను వేగవంతం చేయండి

### ప్రత్తిపాడు నియోజకవర్గం ఎన్నికల అధికారి శ్రీనివాసరావు



**శంఖవరం జులై 10 ప్రభాత వార్త** శంఖవరం మండలంలోని గ్రామాల్లో జనగణన సర్వే (ఎస్ఐఆర్) ను వేగవంతం చేయాలని సూపర్వైజర్లను, బిఎల్ఏలను ప్రత్తిపాడు నియోజకవర్గం ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని నెల్లిపూడి, శంఖవరం గ్రామాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ను పరిశీలించి, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేసారు. ఈ సంధర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ సూపర్వైజర్, బిఎల్ఏ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజల వివరాలు సేకరించి, నమోదు చేయాలని, పూర్తి చేసిన ఫారంను త్వరితగతిన ఆన్ లైన్ చేయాలన్నారు. వలసలు వెళ్ళిన వారు, మరణించిన వారి వివరాలను జాగ్రత్తగా పరిశీలన చేయాలని సూచించారు. అన్నవరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై తహశీల్దార్ సూరిబాబు, ఎంపిడిఓ నాగేంద్ర ప్రత్యేక దృష్టి సారించి, సిబ్బందిని అప్రమత్తం చేసారు. జనగణన సర్వేలో పాల్గొనే సిబ్బంది చురుకుగా వ్యవహరించి, ఎన్నికల కమీషన్ ఇచ్చిన గడువులోగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ కిరణ్ కుమార్, మండల ఎన్నికల అధికారి సూర్య, పంచాయితీ కార్యదర్శి అప్పలరాజు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## 12న శ్రీసత్యదేవుని దివ్య కల్యాణం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై, ప్రభాతవార్త.** ఈనెల12 న లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ వారిచే, ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో అమలాపురం, శ్రీ సత్యసాయి కల్యాణ మండపం నందు శ్రీసత్యదేవుని దివ్య కల్యాణం జరగనున్నది. లోక కళ్యాణార్థం, భారతదేశ ఆర్థికాభివృద్ధి, ఉభయ తెలుగు రాష్ట్రాల దినదినాభివృద్ధి, ప్రజలందరికీ ధన ధాన్య ఆరోగ్యసిద్ధి సంకల్పంగా శ్రీ అనంత లక్ష్మి సత్యవతీ దేవి సమేత శ్రీ వీర వేంకట సత్యనారాయణమూర్తి స్వామివారి దివ్య కళ్యాణం నిర్వహించనున్నారు. పూజలో పాల్గొను వారికి ఏవిధమైన పూజా రుసుము, టికెట్, దక్షిణలు, హుండీలు లేకుండా ఉచితంగా అవకాశం కల్పించబడుతుందని కుమార్ శంకర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకా స్సమస్తా సుఖినో భవంతు సభ్యులతో పాటు శ్రీ విజయ త్రిముఖ గణపతి స్వామివారి ఆలయ కమిటీ సభ్యులు సేవలందించ నున్నారు. పూజలో పాల్గొను వారు జులై 9 వ తేదీ లోపుగా ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సంస్థ ప్రతినిధి ఆర్. లోకేష్ తెలియచేసారు.

## ప్రత్యేక వైద్య శిబిరంలో 278 మందికి పరీక్షలు



**యు.కొత్తపల్లి, జూలై 10 (ప్రభాతవార్త) :** ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు చేనేత కార్మికులకు శుక్రవారం స్థానిక సురక్షా ప్యాలస్ లో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 278 మందికి వైద్య పరిక్షలు నిర్వహించారు. పిఠాపురం ప్రాంత ప్రాధికార సంస్థ (పాడా) పీడీ శివరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్, ఎపీడీ వసంత మాధవి, డిప్యూటి ఎంపీడీఓ గోవిందరాజులు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రావు అక్షయ్, పలువురు అధికారులు, వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps